ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 16.08.2026 | సంపుటి : 13 | సంచిక : 27 | పేజీలు : 12 | వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


# ఆకుపచ్చని తెలంగాణే లక్ష్యం

## ప్రాజెక్టులు పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం




### కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదు

### సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది

- 31 నెలల కృషి ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి
- తెలంగాణ రైజింగ్-2047' దిశగా అడుగులు వేస్తున్నాం
- రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నది నా నమ్మకం
- అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేపట్టాం
- ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేశాం
- గ్రూప్ పరీక్షలను సమర్థంగా నిర్వహించాం
- త్వరలోనే ఇంటర్‌నేషనల్ స్పోర్ట్స్ నిర్వహణ
- ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం
- గోల్కొండలో జెండా ఎగరేసిన సీఎం రేవంత్ రెడ్డి
- అనంతరం ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగం

**హైదరాబాద్,ఆగస్ట్15(జనంసాక్షి):**తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీ పడేది లేదని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతుల కళ్లలో ఆనందం చూస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గోల్కొండ కోటలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడకలకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విద్య, వైద్యం.. ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశాలని తెలిపారు. సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం తమది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని

మిగతా 2లో..




### ఆత్మగౌరవానికి ప్రతీక

## స్మార్ట్ రేషన్ కార్డు

- కేసీఆర్ వస్తే ఎవరేం చేశారో చర్చిస్తాం
- బీజేపీ,బీఆర్ఎస్ నాణేనికి బొమ్మాబొరుసు లాంటివి
- పేదరికం నిర్మూలించే బలమైన అడుగు..స్మార్ట్ రేషన్ కార్డు
- పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బీఆర్ఎస్
- రేషన్ కార్డులతో పాటు..సన్న బియ్యం ఘనత మాదే
- సంక్షేమ కార్యక్రమాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం
- సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సీఎం

### అభివృద్ధిపై చర్చిద్దాం.. అసెంబ్లీకి రండి

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 15(జనంసాక్షి):**స్మార్ట్ రేషన్ కార్డు అనేది కేవలం ఒక ప్లాస్టిక్ కార్డు లేదా ఉచితంగా బియ్యం పొందే సాధనం మాత్రమే కాదని, పేదరికాన్ని నిర్మూలించే దిశగా వేసిన బలమైన అడుగని సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏ పేదవాడు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ నాడు రేషన్ వ్యవస్థను తీసుకొచ్చిందని అన్నారు. గతంలో ఇందిరాగాంధీని మెదక్ ఎంపీగా గెలిపించడం వల్లే ఈ ప్రాంతం పారిశ్రామికంగా

మిగతా 2లో..

### అర్హులందరికీ రేషన్ కార్డులు

- దేశంలో ఎక్కడా సన్నబియ్యం పంపిణీ లేదు
- 89 లక్షల కార్డులను 2.80 కోట్లకు చేర్చాం
- బీఆర్ఎస్ నేతలు తప్పడు ప్రచారాలు మానాలి
- సంగారెడ్డి సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2 లో..



## మహిళా రిజర్వేషన్లకు అన్ని పార్టీలు సహకరించాలి

### భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం

- అన్నిరంగాల్లో దూసుకుపోయేతత్వం మన సొంతం
- సత్తా చాటగల నైపుణ్యాలు మన సొంతం
- యువత ఓ గంట సమయం కేటాయిస్తే చాలు
- జనగణనలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వండి
- అప్పడే దేశ అభివృద్ధికి ప్రణాళికలు రచించగలం
- ఒలింపిక్స్‌లో ప్రతి క్రీడలో భారత భాగస్వామ్యం ఉండాల్సిందే
- ఎర్రకోటపై నుంచి క్రీడాకారులకు ప్రధాని మోడీ పిలుపు
- తొలిసారిగా పూర్తిస్థాయి వందేమాతర గీతాలాపన
- పూలవర్షం కురిపించిన వాయుసేన హెలీకాప్టర్లు

**న్యూఢిల్లీ,ఆగస్ట్15(జనంసాక్షి):**భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, అన్నిరంగాల్లో దూసుకుపోయే సమర్థత ఉందని ప్రధాని మోడీ అన్నారు. సవాళ్లు స్వీకరించి ముందుకు సాగడం ద్వారా మనమేంటో సత్తా చూసగలమన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ యువత లక్ష్యంగా పలు కార్యక్రమాలను ప్రకటించారు. కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తామని, పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే.. ఉచిత కోచింగ్ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యవత చురుగ్గా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.'నేను అందరినీ ఒక ఫేవర్ చేయాలని అడుగుతున్నాను. ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ మాత్రం

మిగతా 2లో..



## కాశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తి ఇవ్వాలి

### అలా ఉంటేనే పీవోకే కలిసేది

### ఇప్పుడు అక్కడ పరిస్థితి బాధాకరం: ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్(జనంసాక్షి):**జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు గురించి స్వాతంత్య్ర వేడుకల్లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రస్తావించారు. ఈ ప్రత్యేక హోదాను కేంద్రం రద్దు చేయకపోయి ఉంటే.. జమ్మూకశ్మీర్‌లో విలీనం అయ్యేందుకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలు

మిగతా 2లో..

## డబుల్ ఇంజన్ అని కేంద్ర పాలకులు డబ్బా కొడుతున్నారు

### సింగిల్ ఇంజిన్‌తో మోత మోగించలేదా!: కేటీఆర్



**హైదరాబాద్(జనంసాక్షి):** డబుల్ ఇంజిన్ అని కేంద్ర పాలకులు డబ్బా కొడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలోని సింగిల్ ఇంజిన్ మోత మోగించలేదా అని ప్రశ్నించారు. తెలంగాణ కన్నా మెరుగ్గా పనిచేసిన డబుల్ ఇంజిన్ రాష్ట్రం ఉందా అని అడిగారు. దేశంలోని 28 ఇంజిన్లు పోటీపడి ఉరికితే బాగుపడమా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రోకు కేంద్రం ఎందుకు పర్మిషన్ ఇవ్వదని కేటీఆర్ ప్రశ్నించారు. ఎలక్షన్లు ఎక్కడుంటే అక్కడ మాత్రం మెట్రోలు ఇస్తున్నారని తెలిపారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ ఎక్కడుందని అడిగారు. మీతో అంటకాగని రాష్ట్రాలపై కక్షగట్టడమేనా మీ వికాసం అని ప్రశ్నించారు. మనకన్నా చిన్న దేశాలు ఎక్కడికో దూసుకెళ్లాయని చెప్పారు. మనం మాత్రం కులమతాల కొట్లాటల్లోనే ఉన్నామని అన్నారు. ఎన్నికలు రాగానే దేవుళ్ల పేర్లు చెప్పడం, అక్షింతలు పంచడం

మిగతా 2లో..

## పరువునష్టం కేసు వేస్తా..

### సాక్షాలివ్వండి..

### లేకపోతే శిక్షకు సిద్ధం కండి:హరీశ్



**సిద్దిపేట(జనంసాక్షి):** సంగారెడ్డి సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. సీఎం తన ప్రసంగంలో సంగారెడ్డి జిల్లాలోని సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టు పనుల గురించి మాట్లాడలేదని విమర్శించారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వంలో సంగారెడ్డి జిల్లాకు ఏం చేశారో చెప్పాలన్నారు. జిల్లాలో ఒక్క కి.మీ రోడ్డైనా వేశారా? అని ప్రశ్నించారు. సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. "బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి గతంలో అసెంబ్లీలో చెప్పారు. ఇవాళ బీఆర్ఎస్ రేషన్ కార్డులు ఇవ్వలేదని అవాస్తవాలు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 16వేల ఉద్యోగాలు ఇచ్చిందని అసెంబ్లీలో చెప్పారు. సంగారెడ్డి సభలో

మిగతా 2లో..



## హర్మూజ్‌ను స్వాధీనం చేసుకుంటాం

### ఇరాన్ వద్ద అణ్వాయుధ సామర్థ్యం ఉండడం ఎప్పటికైనా ప్రమాదమే..

**వాషింగ్టన్(జనంసాక్షి):**గతంలో మాదిరిగానే జలసంధి పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందన్నారు. తమ సాయుధ దళాల అనుమతి లేకుండా ఏ వాణిజ్య నౌక కూడా ఈ మార్గంలో ప్రయాణించబోదని స్పష్టంచేశారు. హర్మూజ్ విషయంలో అమెరికా తప్పుడు అంచనాలు వేస్తోందన్నారు. యుద్ధంలో ఇరాన్‌ను ఓడిస్తామని, ఆ దేశం ఓటమిని

మిగతా 2లో..

### ముమ్మాటికీ హర్మూజ్

## మా అంతర్భాగమే

- యుద్ధ నౌకలతో జలసంధిని స్వాధీనం చేసుకోలేరు
- అమెరికా ఓటమిని అంగీకరించే వరకు దిగ్బంధనాన్ని అమలు చేస్తూనే ఉంటాం:ఇరాన్

**టెహ్రాన్(జనంసాక్షి):**హర్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ అమెరికాదేనని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ఖండించింది. జలసంధి ఎప్పటికీ తమ నియంత్రణలోనే ఉంటుందని.. దానిని ఎవరూ ఆక్రమించుకోలేరని పేర్కొంది. హర్మూజ్‌ను మూసి ఉంచాలా? తెరవాలా? అనేది తమ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ తెలిపారు. యుద్ధ నౌకల మోహరింపు ద్వారా జలసంధిని స్వాధీనం చేసుకోలేరని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. అగ్రరాజ్యం తన భ్రమలను విడిచిపెట్టి.. ఓటమిని అంగీకరించే వరకు హర్మూజ్‌పై ఇరాన్ దిగ్బంధనాన్ని అమలు చేస్తూనే ఉంటుందని

మిగతా 2లో..

### నీళ్ల దగ్గర రాజకీయాలు చేస్తే

## ఊరుకునేది లేదు



- సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు
- రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా విడుదల చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్15(జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగ్గా లేక పంటల సాగుకు ఇబ్బందులు ఏర్పడ్డాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు.. సాగర్ ఆయకట్టుకు భరోసాగా మారిందన్నారు. మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నీళ్ల దగ్గర రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. రాజీవ్ లింక్ కెనాల్‌కు గోదావరి జలాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు. శనివారం అశ్వాపురం మండలం సీతారామ పంప్ హౌస్ వద్ద మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.. మోటార్ స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు ఎవరూ కూడా దిగులు పడొద్దని.. మీ భూముల్లో పైప్‌లైన్ వేసిన మరలా పూడ్చి ఇస్తామని మంత్రి చెప్పారు. యధావిధిగా మళ్లీ వ్యవసాయం చేసుకోవచ్చని అన్నారు. పినపాకకి నీళ్లు ఇవ్వకుండా ఖమ్మంకి తీసుకెళ్లటం బాధగా ఉందన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. ఎవరు ఎటువంటి రాజకీయాలు చేసినా నెలాఖరుకు మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

### స్వేచ్ఛ అంటే బహుమతి మాత్రమే కాదు..

## బాధ్యత కూడా



- దీనిని సత్యం, అహింస మార్గంలో కాపాడుకోవాలి:రాహుల్ గాంధీ
- ఎర్రకోట నుంచి అన్నింటికీ మోదీ క్రెడిట్
- ప్రజాస్వామ్య సంస్థలకు ఎన్నో సవాళ్లు
- అందరికీ రాజ్యాంగ హక్కులు దక్కాలి: ఖర్గే

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశ 80వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వేచ్ఛ అంటే స్వాతంత్య్ర సమరయోధులు అందించిన కానుక మాత్రమే కాదని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని పేర్కొన్నారు. సత్యం, అహింస మార్గంలో నడవడం, రాజ్యాంగ విలువలను గౌరవించడం, త్రివర్ణ పతాకాన్ని గుండెల్లో నిలుపుకోవడం, ప్రజాస్వామ్యాన్ని ఎలాంటి పరిస్థితుల్లోనైనా పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని రాహుల్ అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దేశ ప్రజలు, ముఖ్యంగా యువత ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఐక్యంగా నిలబడుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

మిగతా 9లో..

### మహిళా రిజర్వేషన్లపై మోదీది ద్వంద్వవైఖరి

- ఆయన మాటల్లో నిజాయితీ లేదు
- 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలి: కాంగ్రెస్

### భారత్-అమెరికా సంబంధాలు

## మరింత బలోపేతం

- ట్రంప్, మోదీ మధ్య వ్యక్తిగత సాన్నిహిత్యమే ఇందుకు కారణం
- ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న స్నేహం ద్వైపాక్షిక భాగస్వామ్యానికి పునాదిగా నిలుస్తోంది
- అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో

**వాషింగ్టన్(జనంసాక్షి):**భారత 80వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శుభాకాంక్షలు తెలిపారు. భారత్-అమెరికా సంబంధాలు మునుపెన్నడూ లేనంత బలంగా ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని నరేంద్ర మోదీ మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యమే ఇందుకు కారణమని చెప్పారు. రక్షణ, ఇంధన భద్రత, కీలక ఖనిజాలు, కృత్రిమ మేధ, అంతరిక్షం, వాణిజ్య రంగాల్లో ఇరు దేశాల సహకారం మరింత విస్తరిస్తోందని తెలిపారు. భారత్, అమెరికా ప్రజల మధ్య ఉన్న స్నేహం ద్వైపాక్షిక భాగస్వామ్యానికి

మిగతా 9లో..




## గ్యాస్ ఈకేవైసీకి ఆఖరి గడువు నేడే..

**హైదరాబాద్,ఆగస్ట్15(జనంసాక్షి):** గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీని చేసుకోవాలని, ఈ నెల 16వ తేదీ సాయంత్రంతో గడువు ముగియనుంది. పలు కంపెనీలకు చెందిన గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు వినియోగదారులకు మెసేజ్‌లు, ఫోన్‌లు చేసి ఈకేవైసీని తప్పనిసరిగా చేసుకోవాలని, లేకుంటే గ్యాస్ రాదని స్పష్టంగా తెలియజేస్తున్నారు. ఇలా చేయకపోతే సబ్సిడీ రద్దవు తుందని, ఆంక్షలు విధించే అవకాశముందని పలువురు చర్చించుకుంటున్నారు. దీంతో గ్యాస్ ఏజెన్సీల వద్దకు ఈకేవైసీని చేసుకునేందుకు

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
16.08.2026

# ఆత్మగౌరవానికి ప్రతీక స్మార్ట్ రేషన్ కార్డు

ఎంతో అభివృద్ధి చెందిందని కొనియాడారు. సంగారెడ్డి వేదికగా జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని లబ్దిదారులకు కార్డులను అందజేశారు. నాయకుడు జగ్గారెడ్డి పర్యవేక్షణలో స్వాతంత్య్ర దినోత్సవం రోజున వేలాదిమంది మహిళల సమక్షంలో ఈ సభ నిర్వహించు కోవడం ఎంతో ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆశయాలను ఆదర్శంగా తీసుకునే తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు వేర్వేరు కాదని, ఆ రెండు పార్టీలు ఒకే నాణెళినికి బొమ్మ, బొరుసు లాంటివని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఏనాడైనా పేద ప్రజల ఆకలి తీర్చాలని ఆ పార్టీలు ఆలోచించలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో దాదాపు 3 కోట్ల 48 లక్షల మంది ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన బియ్యం దొడ్డుగా ఉండి, మనుషులు తినలేక బర్లకు దాణాగా వేసే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు తాము ఇస్తున్న సన్న బియ్యం ప్రతి పేద కుటుంబానికి కడుపు నింపుతోందని వివరించారు. తెలంగాణలో 1.06 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో వీటిని రూపొందించినట్లు పేర్కొన్నారు. దేశంలో సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. పేదలకు రూ.14,800 కోట్లతో ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నట్లు సీఎం చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాకే ఇవ్వడం ప్రారంభించాం. రేషన్ విషయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని ఎవరూ తినేవారు కాదు.. పైగా పక్కదారి పట్టేవి. పేదల ఆకలి తీర్చేదే ఈ స్మార్ట్ రేషన్ కార్డు. అసలు రేషన్ షాపులు తెచ్చిందే కాంగ్రెస్. పేదలకు కూడు, గూడు, గుడ్డ ఉండాలని ఇందిరమ్మ ఆలోచన చేశారు. వారికి సంక్షేమం అందించడం మా బాధ్యత. రేషన్ కార్డు అనేది పేదల ఆత్మగౌరవం. వారికి ప్రతినెలా 6 కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తున్నాం. దీని వల్లే మార్కెట్‌లో బియ్యం ధరలు తగ్గాయన్నారు. ల్గ÷తులకు ఎవరేం చేశారో అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?. పదేళ్లలో మీరేం చేశారో.. రెండున్నరేళ్లలో మేమేం చేశామో చర్చిద్దాం అని సవాల్ చేశారు. అతి తక్కువ అప్పుల్లో తెలంగాణ రైతులు ఉన్నారని కేంద్రం చెబుతోంది. కేంద్రం చెప్పేది బీజేపీ నేతలకు కనిపించడం లేదా అని అన్నారు. రైతులు పండించిన వడ్లకు రూ.90 వేల కోట్లు బదిలీ చేశాం. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశాం. గత పాలకులు బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు నొక్కారు. గతంలో పాలపిట్ట చీరలు ఇచ్చాం.. ఈసారి చిలకపచ్చ చీరలు ఇస్తాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేశాం. ఆనాడు డబుల్ బెడ్‌రూమ్ అంటూ డబ్బా కొట్టారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రాలేదు కానీ వారికి మాత్రం ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. మేము 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తున్నాం. తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు లేని ఊరేలేదు. కొత్తగా 2.5 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేశాం. అర్హులైన చేనేత, గీత కార్మికులందరికీ పెన్షన్లు ఇస్తాం అని సిఎం అన్నారు. పదేళ్లపాటు మహిళలకు మంత్రి పదవి ఇవ్వని వారు నేడు మహిళల గురించి మాట్లాడుతున్నారు. కేసీఆర్ ఇంట్లో అందరికీ ఉద్యోగాలు వచ్చాయి. నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాలు రాలేదు. త్వరలోనే ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. అగ్గిపెట్టె రావు, అఘోరా రావులు వస్తారు.. జాగ్రత్త. వీళ్లకు అగ్గిపెట్టెలు దొరకవు కానీ అమాయక యువతను మాత్రం బలిచేశారు. శవాలపై పెట్టుబడులు పెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నారు. మాట ఇస్తే మట్టిలో కలిసే వరకు నిలబడి ఉంటామని రేవంత్ అన్నారు.. ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేసేందుకు చిత్తశుద్ధితో ఉన్నాం. దుర్మార్గులు, దుష్టులు మాయమాటలతో వస్తారు. యువత అప్రమత్తంగా ఉండాలి. మాయమాటలను నమ్మొద్దు. బీఆర్ఎస్ వాళ్లు చేసిన అప్పులకు రూ.75 వేల కోట్ల వడ్డీ కడుతున్నాం. రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్నాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులిస్తాం

సంగారెడ్డి బ్యూరో(జనంసాక్షి):తెలంగాణలో ఇస్తున్నట్టు దేశంలో ఎక్కాడా కూడా సన్నబియ్యం పంపిణీ జరగడం లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. 3.42 కోట్ల మందికి రూ.14800 కోట్లతో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉంటే.. వాటిని 2.80 కోట్లకు పెంచామని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు.. నిరంతర పక్రియ అని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీలోని నేతలు పదే పదే అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ, సుందిళ్ల నుంచి చుక్క నీరు తీసుకోకుండా దేశంలోనే ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణలో పండించామన్నారు. వరి కొనుగోళ్లలో రూ.90 వేల కోట్లు.. రైతుల ఖాతాల్లో వేశామని అన్నారు. ఈరోజు సంగారెడ్డి చరిత్రలోనే కాదు, తెలంగాణ చరిత్రలోనే ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోనుందన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిరుపేదలకు రేషన్ కార్డుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని వెల్లడించారు. కొత్తగా 16 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు. ఃఖా హయాంలో రేషన్ కింద దొడ్డు బియ్యం ఇచ్చారని.. అప్పుడు ఆ బియ్యాన్ని ఎవరూ తినకుండా కిలో రూ.10కి అమ్ముకునే వారని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసి వాటినే పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నాణ్యత ఉన్న సన్న బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ రోజు చరిత్రలో పండుగలా గుర్తుండిపోతుంది.

## మహిళా రిజర్వేషన్లపై మోదీది ద్వంద్వవైఖరి

స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో మహిళా రిజర్వేషన్ల గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. మోదీ మాటల్లో కపటత్వం ఉందంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. ఎక్స్ వేదికగా ఆయన మోదీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. 'నారీ శక్తి వందన్ అధినియమ్' (మహిళా రిజర్వేషన్ల బిల్లు) 2023 సెప్టెంబర్‌లోనే పార్లమెంట్‌లో ఏకగ్రీవంగా ఆమోదం పొందినప్పటికీ, బీజేపీ ప్రభుత్వ ద్వంద్వ విధానాల వల్ల అది 2024 ఎన్నికల నుంచే అమలులోకి రాకుండా పోయిందని ఆరోపించారు. ఈ చట్టానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను 2026 ఏప్రిల్ 16న రాత్రి వేళ అత్యంత హడావుడిగా విడుదల చేశారని వ్యాఖ్యానించారు. అయితే, ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాల పరిధిలోనే, 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలనేది కాంగ్రెస్ నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. తమ పార్టీ వైఖరిలో ఎటువంటి మార్పులేదని తేల్చి చెప్పారు.ఎర్రకోటలో ప్రసంగించిన ప్రధాని మోదీ, మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రయత్నం, గత 40 ఏళ్లుగా ఏదో ఒక కారణంతో రాజకీయ వివాదాలకు బలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్ని రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. దానికి బదులుగా జైరాం రమేశ్ ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు.ఇదిలా ఉండగా, జాతీయ గేయం 'వందేమాతరం' వివాదంపై కూడా జైరాం రమేశ్ స్పందించారు. ఆ పాటలోని మొదటి రెండు చరణాలను మాత్రమే జాతీయ గేయంగా స్వీకరించాలని స్వయంగా రవీంద్రనాథ్ ఠాగూరే నెహ్రూకు లేఖ రాశారని ఆయన గుర్తుచేశారు. వాస్తవానికి ఆ లేఖ ఆధారంగానే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం రూపుదిద్దుకుందని చెప్పారు.

# ఆకుపచ్చని తెలంగాణే లక్ష్యం



పురస్కరించుకుని గోల్కొండ కోటపై సీఎం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దే శించి ప్రసంగిస్తూ.. ఈ ప్రభుత్వ 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోందని.. తలసరి ఆదాయంలో టాప్‌లో ఉన్నామన్నారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని నిర్ణయించామని తెలిపారు. రైతు బాగుంటేనే.. రాష్ట్రం బాగుంటుందన్న ముఖ్యమంత్రి.. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టామన్నారు. రైతు భరోసా కింద రూ.36వేల కోట్లు పెట్టుబడి సాయం అందించామని చెప్పారు. అలాగే, రైతు సంక్షేమం కోసం రూ.లక్షా 70వేల కోట్లు, రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని వివరించారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రికార్డులు సృష్టించిందని తెలిపారు. కృష్ణా–గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధించి తీరుతామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తామన్నారు. త్వరలోనే పాలమూరు పూర్తి చేసి నీరందిస్తామని తెలిపారు. వ్యవసాయంతో పాటు ఇళ్లకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని, కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డలకు రూ.4,790 కోట్లు అందజేశామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ఉన్నామని చెప్పుకొచ్చారు. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని,2 విడతల్లో 5.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లు నిర్మించి అందించనున్నామని తెలియజేశారు. దేశంలోనే తొలిసారి తెలంగాణలో కులగణన జరిగిందని.. తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేర్చిందని తెలిపారు. కొత్తగా 2.50లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు. సినీ కార్మికుల సంక్షేమం కోసం త్వరలో బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విద్యా సూచీలో 21 నుంచి 14వ స్థానానికి తెలంగాణ చేరిందని రేవంత్ తెలిపారు. నియోజకర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. స్కూళ్లలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం పెడుతున్నామని, 100కు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు నిర్మించే యోచనలో ఉన్నామని చెప్పారు. అక్రమాలు జరగకుండా ఈఉఖాఅని ప్రక్షాళన చేశామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఇప్పటికే ఉస్మానియా కొత్త ఆసుపత్రి భవనం నిర్మాణంలో ఉంది. 8 కొత్త మెడికల్ కాలేజీలకు భవనాలు నిర్మిస్తున్నాం. విద్యా సూచీలో 21వ స్థానంలో ఉన్న తెలంగాణ 14కు చేరుకుంది. నియోజకవర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టాం. వందకు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మించే లక్ష్యంతో ఉన్నాం. ప్రభుత్వ స్కూళ్లలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెడుతున్నాం. అక్రమాలు జరగకుండా టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని అన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహించాం. త్వరలో జరిగే ఖేల్ ఇండియా పోటీలకు హైదరాబాద్ అతిథ్యం ఇస్తుంది. టీఎస్ ఐపాస్ ద్వారా రూ.1.95లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మరో 78వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయి. ప్రఖ్యాత సంస్థలు హైదరాబాద్ జీసీసీలు ఏర్పాటు చేస్తున్నాయి. నగరంలో ఇప్పటికే 355కు పైగా జీసీసీలు పనిచేస్తున్నాయి. అమెజాన్ సంస్థ రాష్ట్రంలో 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే ఉక్కు సంకల్పంతో ఉన్నాం. మహిళలను ఆర్టీసీ అ÷-దదె బస్సులకు యజమానులుగా చేశాం. 15 లక్షలకు పైగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేశాం. రెండో విడత కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఇవాళే ప్రారంభించుకుంటున్నాం. వృద్ధ తల్లిదండ్రుల కోసం చట్టం చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని సీఎం వివరించారు.

**త్వరలోనే ఇంటర్‌నేషనల్ స్పోర్ట్స్ నిర్వహణ**

ఉద్యోగ నియామకాలను ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుందని, ఇప్పటి వరకు 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గ్రూప్1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, మెగా డీఎస్సీ నియామకాలను విజయవంతంగా నిర్వహించి నియామక పత్రాలు అందించామని తెలిపారు. యువతకు నైపుణ్యం, ఉద్యోగాలు కల్పించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని వివరించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ అకాడమీ, యంగ్ ఇండియా డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్లింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే తెలంగాణ వేదికగా యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ 2026 నిర్వహించ బోతున్నామని చెప్పారు. వైద్యరంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, నిమ్స్‌లో 2,000 పడకల నూతన ఆసుపత్రి నిర్మాణంతో పాటు వరంగల్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తున్నామని తెలిపారు. కొత్తగా 8 మెడికల్ కళాశాలలు, 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారామెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. దక్షిణ భారతదేశంలోనే తొలి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ నిర్వహణ ఇందుకు నిదర్శనమని, ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5.18 లక్షల మందికి రూ.2,526 కోట్ల సాయం అందించామని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులకు సరికొత్త సాంకేతికత, వనరులను అందిస్తున్నామని సీఎం చెప్పారు. సైబర్ నేరాలు, ఆహార కల్తీని ఎదుర్కొనేందుకు డ్రగ్స్ కంట్రోల్, సైబర్, ఆహార కల్తీ నియంత్రణ లను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నామని తెలిపారు. ఓఆర్ఆర్‌పై ప్రమాదాలు తగ్గించేందుకు హైవే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సెంటర్లు, మహిళల భద్రతకు షీ టీమ్స్, పిల్లల అనుకూల న్యాయస్థానాల ఏర్పాటులో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల శ్రద్ధతో నిర్ణయాలు తీసుకుంటున్నా మని, పీఆర్సీ, పెన్షన్లు, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ వంటివి అమలు చేస్తున్నామని తెలిపారు. 36 సచివాలయ శాఖల్లో 100 శాతం ఈ–ఆఫీస్ అమలు చేశామని, ఈ నెల 17వ తేదీ నుండి అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో 'ప్రజావాణి' ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, చెరువుల పరిరక్షణకు 'హైడ్రా' ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని సీఎం వివరించారు. పారిశ్రామికంగా టి–ఐడియా ద్వారా రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులు, తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్ ద్వారా రూ.5.75 లక్షల కోట్ల ఒప్పందాలు సాధించామని, 2025–26లో ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయని వెల్లడించారు. తొలి సమగ్ర టూరిజం పాలసీ 2025 తీసుకువచ్చామని, సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్–2047' దిశగా అడుగులు వేస్తున్నామని, అందరి సహకారంతో రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని సీఎం ప్రసంగాన్ని ముగించారు.

## అది మా గొంతును అణచివేసే ప్రయత్నం జరుగుతోంది

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాక్రోచ్ జనతా పార్టీ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా శనివారం ఉదయం కొద్దిసేపు నిలిచిపోయింది. స్వాతంత్య్ర దినోత్సవం రోజున తమ గొంతును అణచివేసే ప్రయత్నం జరిగిందని ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. ఉదయం 6.16 గంటలకు ఖాతా తొలగించారని ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు. 6.45 గంటలకు ఖాతాను పునరుద్ధరించినట్లు మరో పోస్టులో తెలిపారు. ఇలాంటి చర్యలకు తాము భయపడమని దీప్కే పేర్కొన్నారు. తమను అడ్డుకోవాలనుకునేవారు స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఎంచుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి జాతినుద్దేశించి ప్రసంగించడానికి ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

**దేశ యువతను తప్పుదోవ పట్టించారు**

దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఏ పార్టీ అధికారంలో ఉన్నా మారడం లేదని దీప్కే అన్నారు. మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలోని తన సొంత గ్రామమైన సంతుక్ పింప్రీ నుంచి "స్కూల్ ఠీక్ కరో"ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై తల్లిదండ్రులు, గ్రామస్థులు, సర్పంచ్‌లు సామాజిక తనిఖీలు చేసి నిలదీయాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. భారీ ప్రచారాలకు ఖర్చు చేసే డబ్బును గ్రామీణ పాఠశాలలు, విద్యార్థుల కోసం వెచ్చిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమం కోసం తాము బృందాలను ఏర్పాటు చేశామని, వారు గ్రామాలను సందర్శించి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తారని తెలిపారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 80 ఏళ్లు అవుతున్నా గ్రామీణ విద్యార్థులు పాఠశాలల్లో కనీస సౌకర్యాల కోసం ఇంకా ఎదురుచూసే పరిస్థితి ఉండకూడదని దీప్కే పేర్కొన్నారు.

## పరువునష్టం కేసు వేస్తా..

70వేల ఉద్యోగాలు ఇచ్చామని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసగించారు. అసత్యాలు చెబుతున్న ముఖ్యమంత్రికి నిరుద్యోగులే గుణపాఠం చెబుతారు. రెండేళ్ల నుంచి బకాయిలు ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఎప్పుడు ఇస్తారు?" అని నిలదీశారు.

## గ్యాస్ ఈకేవైసీకి ఆఖరి గడువు నేడే..

వినియోగదారులు క్యూకట్టారు. అయితే శనివారం స్వాతంత్య్ర దినోత్సవం, ఆదివారం సెలవులు కావడంతో ప్రజలు సందేహంలో ఉన్నారు. ఏజెన్సీల నిర్వాహకులను వివరణ కోరగా.. శని, ఆదివారం వర్కింగ్ డేగా ఉందని తెలుస్తోందని, పై నుంచి తేదీని పెంచితే సెలవు ఉంటుందని తెలుపుతున్నారు. త్వరితగతిన ఏజెన్సీల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

## డబుల్ ఇంజిన్ అని కేంద్ర పాలకులు డబ్బా కొడుతున్నారు

చేస్తున్నారని విమర్శించారు. పక్కా మళ్లీ తెలంగాణ పట్టాలు ఎక్కుతుందని ధీమా వ్యక్తం చేశారుదేశం బాగుపడాలంటే ఆ మార్పు మన ఇంటి నుంచే మొదలవ్వాలని కేటీఆర్ అన్నారు. జాతి నిర్మాణంలో తెలంగాణ పాత్ర పెద్దది అని కేటీఆర్ తెలిపారు. జీడీపీలో 5.2 శాతం వాటా మన తెలంగాణదే అని పేర్కొన్నారు. దేశాన్ని సాదుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అని చెప్పారు. ఇవాళ ఉన్న సన్నాసులకు తెలివి లేదు అని విమర్శించారు. దివాళా తీసిందని కూతలు కూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ మళ్లీ పట్టాలెక్కాలంటే సమర్థ నాయకుడు రావాలన్నారు. ప్రజలందరూ ప్రేమించే నాయకుడు కేసీఆర్ అని అన్నారు. రాబోయే రెండేళ్లు గట్టిగా పనిచేద్దాం.. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ వాలిపోదామని పేర్కొన్నారు. జిల్లాలు, నియోజకవర్గాల్లో యాక్టివిటీ పెంచుదామని చెప్పారు.

## కాశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తి ఇవ్వాలి

తిరుగుబాటు చేసేవారని అన్నారు. "1947లో పాకిస్తానీ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా కశ్మీర్ ప్రజలు పోరాడారు. ఇప్పుడు సరిహద్దుల్లో పరిస్థితులను చూసినప్పుడు.. మన పూర్వీకులు చెప్పిన మాట నిజమని అర్థమవుతోంది. 'దాడికి దిగాలనుకునేవారికి హెచ్చరిక.. మీకు బుద్ధి చెప్పేందుకు కశ్మీరీలం అయిన మేం సిద్ధంగా ఉన్నాం' అని వారు చెప్పారని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజల పరిస్థితి చూస్తుంటే.. బాధగా ఉంది. రాష్ట్ర హోదా, ప్రత్యేక హోదా రద్దు చేయకపోయి ఉంటే.. తమను తిరిగి జమ్మూకశ్మీర్‌లో విలీనం చేయమని పీఓకే ప్రజలు తిరుగుబాటు చేసేవారని నేను భావిస్తున్నాను. వారికోసం మనం అసెంబ్లీలో సీట్లు ఖాళీగా ఉంచుతున్నాం. ఏదో ఒకరోజు ఆ సీట్లు నిండుతాయన్న ఆశతో ఉన్నాం" అని అబ్దుల్లా అన్నారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరించేవరకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు.భాజపా ఈ వ్యాఖ్యలను ఖండించింది. "ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా మాట్లాడారు. ఈ స్వాతంత్య్ర దినోత్సవం రోజున ఆయన రాజకీయాలు చేస్తున్నారు. భవిష్యత్ ప్రణాళికలు మాట్లాడాల్సిన ఈ వేదికను ఆయన రాజకీయాలకు వాడుకున్నారు" అంటూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, భాజపా నాయకుడు సునీల్ శర్మ దుయ్యబట్టారు.

# మహిళా రిజర్వేషన్లకు అన్ని పార్టీలు సహకరించాలి

సమయం దేశాన్ని ఎలా బలోపేతం చేస్తుందా..? అని యువత ఆలోచిస్తూ ఉండొచ్చు. వారి భాగస్వామ్యంతో ప్రతి ఇంట్లో జనాభా గణనకు ఒక అనుకూల వాతావరణం ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో ప్రజలు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి. దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోదీ పేర్కొన్నారు. అలాగే 'దిమాగీ నక్సల్స్' గురించి మాట్లాడుతూ.. వారిని దేశానికి కొత్త శత్రువులుగా అభివర్ణించారు. 'సంవత్సరాలుగా మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు దేశంలో బలంగా పాతుకుపోయారు. అడవుల్లోని సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించింది. సాయుధ నక్సల్స్ కనుమరుగైనా.. 'దిమాగీ నక్సల్స్' మిగిలి ఉన్నారు. వారు ఒక అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మనం వారిని గుర్తించి.. ఏకాకిని చేయాలని సూచించారు. తయారీ, వ్యవసాయం, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగం, గ్రీన్ అండ్ బ్లూ ఎకానమీ, ఇండియాస్ సాఫ్ట్ పవర్ కోసం 'సప్తధార' రోడ్‌మ్యాప్‌ను మోదీ ప్రకటించారు. మహిళా కోటా బిల్లుపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో.. తన ప్రసంగంలో దాని ప్రస్తావన తీసుకువచ్చారు. ప్రతిపక్షాలు విభేదాలను పక్కనపెట్టి.. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలని కోరారు. క్రెడిట్ వారే తీసుకున్నా ఫర్వాలేదని, కానీ బిల్లు పాసయి మహిళలకు గౌరవం దక్కాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. భారత్ ఇకపై చిన్న కలలతో ముందుకు వెళ్లలేదని, ఆలోచనా పరిధి విస్తృతం చేసుకునేందుకు ఉన్నత లక్ష్యాలు అవసరమని మోదీ పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు ప్రపంచం మన వైపు చూసే తీరే మారుతుందని పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారడి జీవించలేమని, స్వయం సమృద్ధి సాధించాలన్నారు. టెక్ ప్రపంచంలో చిప్‌ల విలువను భారతదేశం అర్థం చేసుకుంటోందని, అందుకే మూడు సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. సమీప భవిష్యత్తులో మరిన్ని సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పుడు ప్రతిభారతీయుడు స్థానిక ఉత్పత్తులకు మద్దతు ఇవ్వడంపై సంతోషం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వ హయాంలో 25 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. అభివృద్ధి దిశగా దృఢ సంకల్పంతో పయనిస్తోన్న 140 కోట్ల మంది భారతీయులను ఆపడం అసాధ్యం అని పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల సంభవించిన విపత్తుల గురించి ప్రస్తావించారు. బాధిత కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉంటుందని సంఘీభావం తెలిపారు. దేశంలో 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్తున్నాం. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తున్నాం. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం. వంద గిగావాట్ల అణు ఇంధనం సాధించడం మనలక్ష్యం అన్నారు. ఇటవలే హైడ్రోజన్ రైలును విజయంతంగా నడిపించాం. 90 ఏళ్లలో 30 శాతం మాత్రమే రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ జరిగింది. 10 ఏళ్లలో 70 శాతం రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేశాం. ఇటీవలే హైడ్రోజన్ రైలును విజయవంతంగా నడిపించామని అన్నారు. 50 లక్షల ఇళ్లకు సౌరశక్తి విద్యుత్ అందిస్తున్నాం. దేశంలో ఐదు న్యూక్లియర్ రియాక్టర్లు ఏర్పాటు చేస్తున్నామని మోదీ తెలిపారు.2036లో జరిగే ఒలింపిక్స్‌లో ప్రతి క్రీడలో భారత భాగస్వామ్యం ఉండేలా చూసుకోవాలన్నారు. ఇందులో భాగంగా ప్రతిభ ఉన్న వారిని గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ, సౌకర్యాలు అందించేందుకు జాతీయస్థాయిలో టాలెంట్ ఐడెంటిఫికేషన్ ప్రోగ్రామ్‌ను ప్రకటించారు. క్రీడా ప్రపంచంలో భారత్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటోంది. ప్రపంచవేదికలపై మన జాతీయ గీతాన్ని తరచూ వింటుంటాం. మన మువ్వన్నెల జెండా ఎగరవేయడం చూస్తున్నాం. టాప్స్(ఝజీసణ!బి క్షపూతిఇ ఖనీటతిబీప ఝాఇర!ప!) గొప్ప విజయాన్ని సాధించింది. ఖేలో ఇండియా గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్, బీచ్ గేమ్స్, వింటర్ గేమ్స్, స్పోర్ట్స్ మెడిసిన్, స్పోర్ట్స్ న్యూట్రిషన్ ఇలా ఏ రంగంలోనైనా భారతదేశం వేగంగా దూసుకుపోతోంది. 2036లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు మనం కూడా పోటీపడుతున్నాం. 2030లో కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇస్తున్నాం. ఒలింపిక్స్‌లో దాదాపు 40 క్రీడాంశాలు, సుమారు 350 ఈవెంట్లు ఉంటాయి. అయితే చాలా క్రీడల్లో కనీస అర్హత సాధించలేక పోతున్నందున.. మూడింట రెండొంతుల గేమ్స్‌లో మనం పోటీ కూడా పడలేకపోతున్నాం. 2036లో మనం కనీసం మూడు వంతుల ఈవెంట్లలో పాల్గొనాలని నిర్ణయించుకున్నాం. టాలెంట్ హంట్‌తో దేశంలోని ప్రతిచోట నుంచి 5 నుంచి 15 ఏళ్ల వయసు గల ప్రతిభావంతులను గుర్తిస్తాం. వారు ప్రత్యేక శిక్షణ పొందుతారు' అని మోదీ వెల్లడించారు.

**దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం**

భారతదేశ 80వ స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్తు ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్', స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా, దేశాన్ని నడిపించే ఏడు ప్రాథమిక శక్తులను 'సప్తధార' పేరుతో ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడు రంగాలు భారతదేశ రాబోయే ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదక శక్తులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మొదటి ధార మాన్యుఫ్యాక్చరింగ్. దేశ తదుపరి వృద్ధి దశకు మాన్యుఫ్యాక్చరింగ్ బలమైన పునాదిగా మోడీ అభివర్ణించారు. కేవలం చిన్న విడిభాగాల తయారీకే పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తుల తయారీపై భారత్ దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టేందుకు ధర, నాణ్యత, విస్తృత స్థాయి ఉత్పత్తి అనే మూడు అంశాలపై తయారీదారులు దృష్టి పెట్టాలని సూచించారు. మన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఖచ్చితత్వంతో కూడిన నాణ్యత ఐడెంటిటీగా మారాలని చెప్పారు. సప్తధారలో రెండవది వ్యవసాయం, ఆహార భద్రత. దేశ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయ రంగ ప్రాధాన్యతను నొక్కి చెప్పిన ప్రధాని, ఆర్థిక వృద్ధిలో ఆహార ఉత్పత్తి, వ్యవసాయం ఎప్పటికీ కేంద్రబిందువులుగా ఉంటాయని స్పష్టం చేశారు.

## హర్మూజ్‌ను స్వాధీనం చేసుకుంటాం

చవిచూసిన అనంతరం హర్మూజ్‌ను అమెరికా భూభాగంగా ప్రకటిస్తామని శనివారం జరిగిన మీడియా సమావేశంలో ట్రంప్ పేర్కొన్నారు.ఇరాన్ వద్ద అణ్వాయుధ సామర్థ్యం ఉండడం ఎప్పటికైనా ప్రమాదమేనని అన్నారు. అందుకే దానిని నాశనం చేయాలనే లక్ష్యంతో యుద్ధానికి దిగినట్లు వెల్లడించారు.

## ముమ్మాటికీ హర్మూజ్ మా అంతర్భాగమే..

పేర్కొన్నారు. తాము బెదిరింపులకు భయపడబోమని.. సైనిక ప్రదర్శనలకు లొంగబోమని స్పష్టం చేశారు. హర్మూజ్ ద్వారా నౌకలు స్వేచ్ఛగా ప్రయాణిస్తున్నాయని అమెరికా చెబుతున్న మాటల్లో నిజం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే.. జలసంధి పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందన్నారు. తమ సాయుధ దళాల అనుమతి లేకుండా ఏ వాణిజ్య నౌక కూడా ఈ మార్గంలో ప్రయాణించబోదని స్పష్టం చేశారు. హర్మూజ్ విషయంలో అమెరికా తప్పుడు అంచనాలు వేస్తోందన్నారు.

ట్రంప్ ఏమన్నారంటే..?

యుద్ధంలో ఇరాన్‌ను ఓడిస్తామని.. ఆ దేశం ఓటమిని చవిచూసిన అనంతరం హర్మూజ్‌ను అమెరికా భూభాగంగా ప్రకటిస్తామని శనివారం జరిగిన మీడియా సమావేశంలో ట్రంప్ పేర్కొన్నారు. ఆ దేశం వద్ద అణ్వాయుధ సామర్థ్యం ఉండడం ఎప్పటికైనా ప్రమాదమేనని.. అందుకే దానిని నాశనం చేయాలనే లక్ష్యంతో యుద్ధానికి దిగినట్లు వెల్లడించారు.

ఉగ్ర సంస్థలతో సంబంధాలు

## బెంగళూరులో వ్యక్తి అరెస్ట్

బెంగుళూరు(జనంసాక్షి):అఫ్గానిస్థాన్ కేంద్రంగా నడుస్తోన్న ఉగ్రముఠాతో సంబంధం ఉన్న అసఫుల్ మాలిక్ అనే యువకుడిని బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. తెహ్రీక్–ఎ–తాలిబన్ పాకిస్థాన్ సభ్యుడితో కలిసి, ఆ సంస్థలో చేరడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలపై సమాచారం అందడంతో అతడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అసఫుల్ మాలిక్ అనే వ్యక్తి ఏడాదిగా బెంగళూరులోని జిగాని ప్రాంతంలో ప్రముఖ టెక్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అతడు అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు బొమ్మసంద్ర ఇండస్ట్రియల్ ఏరియాలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు గుర్తించారు.

# ఫోటో మంత్రిది.. పేరు కలెక్టర్‌ది

- స్మార్ట్ రేషన్ ఫ్లెక్సీలో బలితెగించిన అధికారుల నిర్లక్ష్యం
- అతిథుల ముందే తలదించుకున్న జిల్లా యంత్రాంగం




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రభుత్వ కార్యక్రమాలంటే అధికారులకు ఆటగా మారింది. కనీస బాధ్యత లేకుండా చేసిన పనికి జిల్లా పరువు పోయింది. శనివారం కలెక్టరేట్ ఐడీఓసీలో జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యం బట్టబయలైంది. వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఫోటో ఉండాల్సిన చోట మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోను అతికించి, కింద మాత్రం కలెక్టర్ పేరు రాసేశారు. ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ వేదికపై కూర్చుని ఉండగానే ఈ తప్పు వెలుగులోకి వచ్చింది. ఫ్లెక్సీ చూసిన ప్రజలు ఒక్కసారిగా నవ్వులతో నిండిపోయారు. అధికారులు మాత్రం సిగ్గుతో తలదించుకునేంత పనైంది. రాష్ట్ర మంత్రి ఫోటోను జిల్లా కలెక్టర్ పేరుతో ముద్రించడం ఇది అనుకోని పొరపాటు కాదు. ఫ్లెక్సీ ముద్రణకు ముందు ఒక్కసారి కూడా పరిశీలించని అధికారుల అలసత్వానికి ఇది నిదర్శనం. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం ప్రారంభంలోనే ఇలాంటి నిర్వాకం చేయడంపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలకు వచ్చే ప్రజల ముందు ఇలా నవ్వులపాలు చేయడం సరికాదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఫోటో మార్చడం చేతకాకపోతే పదవుల్లో ఎందుకు కూర్చున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచార సామగ్రి విషయంలో కనీస జాగ్రత్తలు కూడా తీసుకోవడం లేదని పలువురు విమర్శించారు. ఈ ఘటన జయశంకర్ జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. అధికారుల అత్యుత్సాహం, నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పొరపాట్లు జరుగుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు.

# కొత్త గనులతో సింగరేణికి నూతన జవసత్వాలు

- పోటీ మార్కెట్లో నిలబడడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలి
- తెలంగాణ ఇంధన అవసరాలు తీర్చడానికి ప్రాధాన్యం
- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పురోగమిస్తున్న సింగరేణి
- 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సెంట్రల్ ఫంక్షన్ లో
- సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సందేశం






**కొత్తగూడెం (జనంసాక్షి) :** సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వ చొరవ, సహకారంతో రెండు కొత్త బ్లాకులు లభించాయని, రానున్న రోజుల్లో మరికొన్ని గనుల సాధనతో నూతన జవసత్వాలు సంతరించుకొని రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తగినంత బొగ్గును అందిస్తూ దేశ సేవకు పునరంకితం అవుతుందని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అన్నారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సెంట్రల్ ఫంక్షన్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత తన సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తాడిచర్ల -2 బ్లాకు కు మైనింగ్ లీజు లభించిందని, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కృషితో దక్కిన ఈ బ్లాక్ వల్ల సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసే అవకాశం లభించిందని, తద్వారా 40 సంవత్సరాల పాటు అక్కడ మైనింగ్ చేయడానికి అవకాశం కలిగిందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మణుగూరు ఏరియాకు ఉజ్వల భవిష్యత్‌ను అందించే పీకే ఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణి సంస్థ వేలంలో దక్కించుకుందని వివరించారు. దీనివల్ల 120 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను తవ్వి తీసే గొప్ప అవకాశం కలిగిందని, ఇది మణుగూరు తో పాటు కొత్తగూడెం రీజియన్ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు.

సింగరేణి సంస్థ అభివృద్ధికి నిరంతరాయంగా సమీక్షలు నిర్వహిస్తూ సంస్థ ఉన్నతికి, విస్తరణకు సహకరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి యాజమాన్యం తరఫున ఆయన తన ధన్యవాదాలు తెలిపారు. సింగరేణి సంస్థలోని ఓపెన్ కాస్ట్ గనుల్లో గల రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను వెలికి తీయడానికి కూడా సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. ఇందులో భాగంగానే కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన సింగరేణి జియో సైన్స్ లాబొరేటరీని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క ఇటీవలే ప్రారంభించారని, దీనివల్ల కీలక ఖనిజ రంగంలో అన్వేషణకు ఇది ఎంతో దోహదపడుతుందని వివరించారు. సింగరేణి బొగ్గు గనుల్లో ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు అత్యాధునిక సాంకేతికతను అమలు పరుస్తామన్నారు. అలాగే తక్కువ ఖర్చుతో నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ నిలబడాలంటే రక్షణతో పనిచేస్తూ ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలని, తద్వారా బొగ్గు ఉత్పత్తి ఖర్చు తగ్గుతుందని, ఇందుకోసం ఖర్చు నియంత్రణ చర్యలను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

అత్యాధునిక మైనింగ్ పద్ధతులను అవలంబించడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి సాధించే వీలు కలుగుతుందన్నారు. సింగరేణిలో భారీ యంత్రాలను, మానవ వనరులు కూడా పూర్తి పనిగంటలు వినియోగించినప్పుడే సంస్థకు మనుగడ ఉంటుందన్నారు. అదే సమయంలో డైవర్సిఫికేషన్‌లో గల అవకాశాలను అందిపుచ్చుకోవాలని, నవీన మైనింగ్ విధానాలను పాటించాలని పేర్కొన్నారు. కార్మిక సంక్షేమానికి సింగరేణి సంస్థ కట్టుబడి ఉందని, ఇప్పటికే వైద్య సేవలను మెరుగుపరచడం కోసం చర్యలు తీసుకున్నామని, రామగుండం ఏరియా ఆసుపత్రిలో అత్యవసర గుండె జబ్బుల సేవ కోసం క్యాథ్ ల్యాబ్ ను ఏర్పాటు చేశామని వివరించారు. సింగరేణి మరింత పటిష్టమైన జాతీయ స్థాయి మైనింగ్ సంస్థగా రూపుదిద్దేందుకు ప్రతీ ఒక్కరు సమష్టితత్వంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి సూర్య నారాయణ, డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్ మరియు ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, ఐఏఎస్, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) శ్రీ ఎం. తిరుమలరావు, గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు వి.సీతారామయ్య, త్యాగరాజన్, పెద్ది నర్సింహులు, వివిధ విభాగాల జీఎంలు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మదరసా విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ

**సూర్యాపేట (జనంసాక్షి) :** సూర్యాపేట పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఉన్న అరబీ మదరసా మదీనతుల్ ఉలూమ్ లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ వెల్ఫేర్ సొసైటీ, సూర్యాపేట ఆధ్వర్యంలో మదరసా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఎం.డి. ఖాలేద్ అహ్మద్ (న్యాయవాది) మాట్లాడుతూ మైనార్టీ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తి, నైపుణ్యం మరియు ఏకాగ్రతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడుతూ దేశం లో డాక్టర్లు, ఇంజనీర్ లు, యాక్టర్ లు ఉన్నారని, దేశాన్ని అభివృద్ధి పదంలో ముందుకు నడిపే, అవినీతి రహిత పాలన అందించే నాయకులు కరువు అవుతున్నారని, విద్యార్థి, యువత చదువుతో పాటు రాజకీయాల్లో కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మైనార్టీ యువత, విద్యార్థులకు ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్పై బాసిద్, రిటైర్డ్ ఎస్పై రషీద్ ఖాన్ , రిటైర్డ్ ఎస్పై అబ్దుల్లా , రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి గయాజ్ భాయ్ , మదరసా నిర్వాహకులు హాఫిజ్ తాహెర్ , మౌలానా అబ్రార్ , యాసిర్, నాసిర్ ,ఆదిల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విచ్చేసిన అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్ట్

- సబ్ జైలుకు తరలింపు



**సిర్పూర్ టి, ఆగస్ట్ 15 (జనం సాక్షి) :** సిర్పూర్ రేంజ్ పరిధిలో వన్యప్రాణుల వేటకు పాల్పడిన వారితో పాటు, ప్రభుత్వ అటవీ భూములను ఆక్రమించిన అక్రమార్కులపై అటవీ శాఖ అధికారులు వేర్వేరు కేసుల్లో అరెస్టయిన ఐదుగురు నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది. అటవీ అధికారుల కథనం ప్రకారం, సిర్పూర్ రేంజ్ పరిధిలోని లింబుగూడ అటవీ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఒక కొండగొర్రె మరియు అడవి కుందేలును వేటాడి చంపిన కేసులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులలో కొమురం కాంతారావ్ లింబుగూడ, ఆత్రం శ్యామ్ రావు రావన్పల్లి, చౌదరి సంజు రావన్పల్లి నికోడే శంకర్ రావన్పల్లి ఉన్నారు. అలాగే డబ్బా సెక్షన్ పరిధిలోని ఆడేపల్లి బీట్ లో, ప్రభుత్వ అటవీ భూమిని అక్రమంగా ఆక్రమించిన మరో కేసులో ఆడేపల్లి గ్రామానికి చెందిన లొంబడే ప్రభాకర్ అనే వ్యక్తిని, నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ రెండు కేసుల నిందితులను శుక్రవారం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి 13 రోజుల రిమాండ్ విధించారు. దీంతో అటవీ శాఖ అధికారులు నిందితులను ఆసిఫాబాద్ సబ్-జైలుకు తరలించారు. ఈ సందర్భంగా సిర్పూర్ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ అడవులను, వన్యప్రాణులను రక్షించడం చట్టప్రకారం అందరి బాధ్యత అని అన్నారు. మూగజీవాలను వేటాడినా, అటవీ భూములను ధ్వంసం చేసి ఆక్రమణలకు పాల్పడినా చట్టరీత్యా నేరమని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# స్వాతంత్ర్య వేడుకల్లో ఏపీ మంత్రి ఆనంకు అస్వస్థత




**తిరుపతి, ఆగస్ట్15 (జనంసాక్షి) :** తిరుపతి పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలకు రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగిస్తున్న సమయం లో కళ్లు తిరిగి ఒక్కసారిగా పక్కకు వాలిపోయారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది మంత్రి కింద పడకుండా పట్టుకున్నారు. సకాలంలో స్పందించిన వైద్యులు మంత్రికి ప్రాథమిక చికిత్స అందించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాసేపటి తర్వాత మంత్రి ఆనం స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు.

# నేడు పరకాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక

- పరకాలలో రూ.400 కోట్లకు పైగా అభివృద్ధి పనులను ప్రారంభించనున్న సీఎం
- సీఎం పర్యటనతో పరకాల అభివృద్ధికి కొత్త దిశ
- ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హనుమకొండ /పరకాల, ఆగస్టు 15 (జనం సాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆగస్టు 16న( ఆదివారం) మధ్యాహ్నం పరకాలలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరకాల లో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పరకాల, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎస్. శ్వేత తో కలిసి పరకాల లోని స్థానిక అంగడి స్థలం వద్ద భారీ బహిరంగ సభ ప్రాంగణం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో హెలిపాడ్ వద్ద ఏర్పాట్లను ప్రత్యక్షంగా మంత్రి శనివారం పరిశీలించారు. పరకాలలోని అంగడి స్థలం వద్ద సభా ప్రాంగణం, వేదిక, పార్కింగ్, ట్రాఫిక్, భద్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలను పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నియోజకవర్గంలో రూ.400 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల చిరకాల అవసరాలను తీర్చే ఈ కార్యక్రమాలు పరకాల అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయన్నారు. గతంలో శంకుస్థాపన చేసిన పరకాల వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని ప్రస్తుత ప్రభుత్వం అవసరమైన నిధులు సమకూర్చి పూర్తి చేసిందన్నారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కృషి, ముఖ్యమంత్రి సహకారంతో ఆసుపత్రి అందుబాటులోకి వస్తుండటంతో పరకాల, పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం స్థానికంగానే లభించనుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రెండు విడతల్లో పరకాల నియోజకవర్గానికి సుమారు 6,000 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మొదటి విడతలో 3,500, రెండో విడతలో 2,500 ఇళ్లు మంజూరు కాగా, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున సుమారు రూ.300 కోట్ల ఆర్థిక సహాయం అందనుందని చెప్పారు. అర్హులైన మరిన్ని కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ ఇ సురేష్ బాబు, పరకాల మున్సిపల్ కమిషనర్ పవన్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, పరకాల ఆర్డిఓ డి ఎస్ వెంకన్న, వివిధ శాఖల అధికారులు అరుణ్ కుమార్, తదితరులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్షమందితో వందేమాతరం

- దమ్ముంటే అడ్డుకోవాలని ఎంఐఎంకు బండి సవాల్

**హైదరాబాద్, ఆగస్ట్15 (జనంసాక్షి) :** పాతబస్తీ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్షలాది మందితో సామూహిక వందేమాతరం గీతాలాపన చేయిస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంఐఎం నేతలారా.. దమ్ముంటే అడ్డుకోండని సవాల్ విసిరారు. వందేమాతరం గీతాన్ని అవమానిస్తే 3 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా తప్పదన్నారు. చట్ట ప్రకారం వ్యవహరించే తమను మతతత్వవాదులంటారా అని మండిపడ్డారు. స్మార్ట్ రేషన్ కార్డులపై సీఎం, మంత్రుల ఫోటోలు ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మితే ఊడిపోయేదని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో సిద్ధరామయ్య హయాంలో రూ.వందల కోట్లతో తయారు చేసిన స్మార్ట్ కార్డులన్నీ నిరుపయోగమయ్యాయని గుర్తు చేశారు. తెలంగాణలో దాదాపు 2 కోట్ల మందికి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం ఇస్తోందన్నారు. రేషన్ కార్డులపై మోదీ ఫోటో ఎందుకు పెట్టడం లేదో చెప్పాలన్నారు. కేంద్రం ఇచ్చే బియ్యం మీకు అవసరం లేదా అని ప్రశ్నించారు.

# దేవాదుల రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందిస్తాం

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- సాగునీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 15 ( జనం సాక్షి ) :** దేవాదుల రిజర్వాయర్ కాల్వల ద్వారా సాగు నీరు అందించడమే అందించడమే లక్ష్యమని ఇంతటి కరువు పరిస్థితులలో కూడా దేవాదుల ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులకు సాగు నీరు అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రం లోని స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ మెయిన్ కెనాల్ ద్వారా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంట కాలువలకు సాగు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ వద్ద గోదావరి జలాలకు ప్రత్యేకపూజలు నిర్వహిం చి పసుపు, కుంకుమ, పూలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడు తూ ఎల్ నీనో ప్రభావంతో దేశ వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా వర్షాలు లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. కురిసిన కొద్దిపాటి వర్షాలకు వేసిన ఆరుతడి పంటలు, నారు మల్లు ఎండిపోతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వాడుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. అందులో భాగంగానే నెల రోజుల నుండి ప్రతీ రోజు అధికారులతో మాట్లాడుతూ, పంపింగ్ ను పర్యవేక్షిస్తూ దేవాదుల పరిధిలోని అన్ని రిజర్వా యర్లను నింపే ప్రయత్నం చేశామని అన్నారు. అలా చేయడం వల్లనే ఈ రోజులు రిజర్వాయర్ల ద్వారా సాగు నీరు విడుదల సాధ్యం అయిందని పేర్కొన్నారు. రిజర్వాయర్ల నుండి ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో సాగు నీటి విడుదల జరుగుతుందని అన్నారు. రైతులు కాలువల ద్వారా వచ్చే నీటిని సద్వినియోగం చేసుకొని పొదుపుగా వాడుకుం టూ పంటలను కాపాడుకోవాలని సూచించారు. ఇప్పటికే ధర్మసాగర్, అశ్వరావుపల్లి, గండి రామా రం రిజర్వాయర్ల ద్వారా సాగు నీరు విడుదల చేసినట్లు తెలిపారు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు చేరే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలువల ద్వారా వచ్చే నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పంటలను కాపాడు కోవాలని సూచించారు. ప్రతిపక్షాలు చిల్లరవేషాలు పక్కన పెట్టి గౌరవప్రదంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, మున్సిప ల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, చిల్పూర్ గుట్ట దేవస్థానం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, దేవాదుల అధికారులు, స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడి

- పాడైన ఆహార పదార్థాల తయారీ గుర్తింపు

**రంగారెడ్డి, ఆగస్ట్15 (జనంసాక్షి) :** కల్తీ ఆహార తయారీ కేంద్రంపై హెచ్‌ఫాస్ట్, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. జిల్లాలోని బొంగుళూర్‌లో ఫుడ్ ప్రొడక్ట్స్‌పై జరిపిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. గడువు ముగిసిన ముడిసరుకులతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లేబుల్స్ లేని రసాయన సువాసన ద్రవ్యాలతో నాసిరకం ఆహారాన్ని తయారు చేస్తున్నట్టు తేలింది. నిర్వాహకులు అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలను తయారీ చేస్తున్నట్లు అధికారుల దాడుల్లో బయటపడింది. వ్యాపారంలో లాభాలు రాకపోవడంతో ఈజీ మనీ కోసం అక్రమంగా నాణ్యత లేని ఆహారపదార్థాల తయారీకి ప్లాన్ చేసినట్లు గుర్తించిన అధికారులు.. తనిఖీల అనంతరం యజమాని మహ్మద్ ఖాలీద్, మేనేజర్ సంతోష్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడుల్లో దాదాపు 4.07 లక్షల విలువైన ఆహార పదార్థాలు, ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. ముడిసరుకు గడువు ముగిసిన ఫ్లేవర్లు, కాజూ, కొబ్బరి పొడి తదితర పదార్థాలను సీజ్ చేసిన అధికారులు.. నిందితులపై ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

# ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గేను అవమానించడం హేయం

- ఏఐఎస్‌వో తెలంగాణ కన్వీనర్ రమేష్ కుమార్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పర్యటన అనంతరం నిర్వహించిన శుద్ధి కర్మలు (ప్యూరిఫికేషన్ రిచువల్స్) పై ఏఐఎస్‌వో తెలంగాణ కన్వీనర్ రమేష్ కుమార్ తీవ్రంగా ఖండించారు.

ఇది ప్రజాస్వామ్య విలువలకు, మానవ హక్కులకు విరుద్ధంగా ఉన్న అఘాయిత్య చర్య అని, ఈ అఘాయిత్య చర్యను ప్రజలు గమనించాలని, ప్రభుత్వం చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటి వివక్షతా చర్యలు సమాజంలో విభజనకు దారితీస్తాయని హెచ్చరిస్తూ, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడే విధంగా ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

# హర్మ్యూజ్‌పై అమెరికా కన్ను

సంపాదకీయం

హర్మ్యూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానన్న డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్య ప్రపంచాన్ని ఒక్కసారి ఆలోచించాల్సిన పరిస్థితిలోకి నెట్టింది. సైనిక శక్తి ఉందని ఒక దేశం ప్రపంచంలోని వ్యూహాత్మక జలమార్గాలను తన భూభాగంగా ప్రకటించగలదా? అన్నది ప్రశ్న. సమాధానం స్పష్టంగా ఉండాలి, లేదు.

హర్మ్యూజ్ జలసంధి ఇరాన్, ఒమన్ మధ్య ఉన్న అత్యంత కీలక అంతర్జాతీయ సముద్ర మార్గం. అంతర్జాతీయ సముద్ర న్యాయ వ్యవస్థ తీరదేశాల సార్వభౌమాధికారాన్ని గుర్తిస్తూనే, అంతర్జాతీయ నావిగేషన్‌కు ప్రత్యేక హక్కులను కూడా నిర్దేశిస్తుంది. అంతర్జాతీయ నావిగేషన్‌కు ఉపయోగించే జలసంధుల్లో ప్రయాణ హక్కును అడ్డుకోకూడదనే సూత్రం ఉంది. అలాంటి ప్రాంతాన్ని "అమెరికా భూభాగం"గా ప్రకటించడం ఏ చట్టం ఆధారంగా? ఏ అంతర్జాతీయ ఒప్పందం ఆధారంగా? ఏ ఐక్యరాజ్యసమితి తీర్మానం ఆధారంగా? సమాధానం చెప్పాల్సింది అమెరికానే.

అమెరికాకు ఇరాన్‌తో భద్రతా సమస్యలు ఉండవచ్చు. ఇరాన్ అణు కార్యక్రమంపై ఆందోళనలు ఉండవచ్చు. హర్మ్యూజ్‌లో నౌకాయాన భద్రతపై నిజమైన సమస్యలు ఉండవచ్చు. కానీ ఒక దేశంతో ఉన్న విభేదాలకు పరిష్కారం ఆ దేశ భూభాగాన్ని, సముద్ర జలాలను సొంతం చేసుకోవడం కాదు. అమెరికా నిజంగా "స్వేచ్ఛా నౌకాయానం"ను కాపాడాలనుకుంటే, అదే సూత్రాన్ని తనకూ వర్తింపజేసుకోవాలి. ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తూ నౌకాయాన స్వేచ్ఛను కాపాడాలి.

ప్రపంచానికి కావాల్సింది "అమెరికా అనుమతితో నడిచే సముద్ర మార్గం" కాదు అంతర్జాతీయ చట్టం ప్రకారం నడిచే సముద్ర మార్గం. ఇక్కడే అమెరికా విదేశాంగ విధానంపై అసలు ప్రశ్న మొదలవుతుంది. ప్రపంచంలో ఎక్కడైనా వ్యూహాత్మక వనరు కనిపిస్తే అక్కడ అమెరికా జోక్యం చేసుకుంటుంది. చమురు మార్గం కనిపిస్తే భద్రత పేరుతో సైనిక ఉనికి. ప్రత్యర్థి దేశం కనిపిస్తే ఆంక్షలు. అవసరమైతే యుద్ధం. చివరికి ఆ ప్రాంతంపై రాజకీయ, ఆర్థిక, సైనిక ఆధిపత్యం. ఇది నిజంగా ప్రజాస్వామ్య పరిరక్షణా? లేక ప్రపంచ ఆధిపత్యానికి కొత్త రూపమా?

ఇరాక్ అనుభవాన్ని ప్రపంచం మరచిపోలేదు. సామూహిక విధ్వంసక ఆయుధాల ఆరోపణల ఆధారంగా 2003లో అమెరికా నేతృత్వంలోని దాడి జరిగింది. ఆ ఆరోపణలు తరువాత నిలబడలేదు. కానీ అప్పటికే ఒక దేశం నాశనమైంది, ఒక సమాజం అస్థిరమైంది. లిబియా మరో ఉదాహరణ. గడాఫీ పాలన కూలిపోయింది. కానీ ఆ తరువాత అక్కడ ఏర్పడింది ఏకీకృత ప్రజాస్వామ్య స్థిరత్వం కాదు.. దీర్ఘకాలిక రాజకీయ అస్థిరత. అందుకే ప్రపంచం ఇప్పుడు అడగాల్సిన ప్రశ్న ఒక్కటే.. ఒక దేశాన్ని సైనికంగా ఓడించడం సులభమా? లేక ఆ దేశంలో శాశ్వత శాంతిని నిర్మించడం సులభమా?

అమెరికా సైనిక శక్తి అపారమైనదై ఉండొచ్చు. కానీ సైనిక శక్తి అంతర్జాతీయ చట్టానికి ప్రత్యామ్నాయం కాదు. హర్మ్యుజ్ విషయంలో మరింత ప్రమాదకరమైన అంశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ. ఈ జలసంధి ద్వారా భారీ స్థాయిలో చమురు, ఎల్ఎన్జీ రవాణా జరుగుతుంది. కాబట్టి అక్కడి నియంత్రణ కోసం జరిగే అమెరికా--ఇరాన్ ఘర్షణ కేవలం రెండు దేశాల మధ్య పోరాటంగా మిగలదు. దాని ప్రభావం ఆసియా నుంచి యూరప్ వరకు ఇంధన ధరలపై, ద్రవ్యోల్బణంపై, సాధారణ ప్రజల జీవన వ్యయంపై పడుతుంది. అంటే ఒక దేశం తన సైనిక ప్రయోజనం కోసం తీసుకునే నిర్ణయానికి ప్రపంచ ప్రజలే ధర చెల్లించాల్సిన పరిస్థితి వస్తుంది. ఇది ఏ విధమైన ప్రపంచ వ్యవస్థ?

అమెరికా తన భద్రతను కాపాడుకోవడానికి హక్కు కలిగి ఉంది. ఇరాన్ కూడా తన భద్రతను కాపాడుకోవడానికి హక్కు కలిగి ఉంది. ఒమన్ తన సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి హక్కు కలిగి ఉంది. అలాగే ప్రపంచంలోని ప్రతి దేశానికి అదే హక్కు ఉంది. అంతర్జాతీయ చట్టం పెద్ద దేశాలకు ఒక రూలు, చిన్న దేశాలకు మరో రూలు కాదు. అమెరికా నిజంగా ప్రపంచ నాయకత్వం వహించాలనుకుంటే, ముందుగా ప్రపంచానికి ఒక ఉదాహరణ చూపాలి. శక్తి ఉన్నవాడు చట్టాన్ని నిర్ణయించడు. చట్టమే శక్తిమంతుడినీ నియంత్రిస్తుంది.

హర్మ్యుజ్‌ను అమెరికా భూభాగంగా ప్రకటించడం సాధ్యమా కాదా అన్నది కేవలం భౌగోళిక ప్రశ్న కాదు. అది 21వ శతాబ్దపు ప్రపంచ వ్యవస్థకు ఒక పరీక్ష. ప్రపంచం అమెరికా ఆధిపత్యాన్ని అంగీకరిస్తుందా?

లేక అంతర్జాతీయ చట్టం, సార్వభౌమాధికారం, సమానత్వం అనే సూత్రాలను కాపాడుతుందా? ఇది ఇరాన్‌కు మాత్రమే సంబంధించిన ప్రశ్న కాదు. రేపు మరో శక్తిమంతమైన దేశం మరో చిన్న దేశం సముద్ర మార్గాన్ని తనదిగా ప్రకటిస్తే అప్పుడు అమెరికా ఏం చెబుతుంది? అందుకే ఈ రోజు చెప్పాల్సిన మాట ఒక్కటే..!

కర్ర పెత్తనం ప్రపంచ న్యాయం కాదు. యుద్ధనౌక అంతర్జాతీయ చట్టం కాదు. సైనిక బలం సార్వభౌమాధికారానికి ప్రత్యామ్నాయం కాదు. ప్రపంచానికి కావాల్సింది ఒక దేశం ఆధిపత్యం కాదు, అందరికీ సమానంగా వర్తించే అంతర్జాతీయ న్యాయం. హర్మ్యుజ్‌పై హక్కు ఎవరి సైనిక బలంతో నిర్ణయించకూడదు.

అది అంతర్జాతీయ చట్టంతోనే నిర్ణయించాలి.

# త్రివర్ణం జేబులో.. రంగుల క్రమంపై వివాదం!

స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురుతున్న దృశ్యం ప్రతి భారతీయుడి మనసును కదిలిస్తుంది. అలాంటి రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధరించిన దుస్తుల్లోని త్రివర్ణ పాకెట్ స్క్వేర్ ఇప్పుడు రాజకీయ చర్చకు కారణమైంది. కారణం ఒక్కటే-కనిపించిన రంగుల క్రమం.

భారత జాతీయ పతాకంలో పైభాగంలో కాషాయం, మధ్యలో తెలుపు, కింద ఆకుపచ్చ ఉంటాయి. మధ్యలో అశోకచక్రం ఉంటుంది. ఇది అధికారిక ఫ్లాగ్ కోడ్‌లో స్పష్టంగా ఉంది. మోదీ జేబు వద్ద కనిపించిన పాకెట్ స్క్వేర్‌లో మాత్రం ఆకుపచ్చ, తెలుపు, కాషాయం రంగులు కనిపించడంతో "త్రివర్ణ రంగుల క్రమం మారిందా?" అనే ప్రశ్న మొదలైంది. కాంగ్రెస్ నేతలు ఇదే అంశాన్ని పట్టుకుని ఐర్లాండ్ జెండాను పోలి ఉందంటూ విమర్శలు చేశారు. ఈ అంశంపై జాతీయ మీడియాలోనూ కథనాలు వెలువడ్డాయి.

అయితే ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చూడాలి. మోదీ ధరించింది భారత జాతీయ పతాకం కాదు; త్రివర్ణ రంగులను ప్రతిబింబించే పాకెట్ స్క్వేర్. అందువల్ల దీన్ని జాతీయ పతాక అవమానంగా తేల్చడం సరైనది కాదు. అదే సమయంలో త్రివర్ణాన్ని ప్రతీకగా ఉపయోగించిన సందర్భంలో రంగుల అమరికపై ప్రజల్లో సందేహం రావడం కూడా సహజమే.



రాజకీయ పార్టీలు ఇలాంటి అంశాలను తమ విమర్శలకు ఉపయోగించుకోవడం కొత్త కాదు. కానీ త్రివర్ణం విషయంలో రాజకీయ ప్రయోజనాల కంటే జాతీయ భావనకు ప్రాధాన్యం ఉండాలి. చిన్న వస్త్ర భాగంలో కనిపించిన మూడు రంగులపై ఇంత చర్చ జరగడానికి కారణం కూడా అదే-ఆ రంగులు సాధారణ రంగులు కావు; అవి దేశ స్వాతంత్ర్య పోరాటం, త్యాగం, శాంతి, అభివృద్ధి వంటి విలువలకు ప్రతీకలు.

అందుకే ఈ ఘటనను ఎవరి దేశభక్తికి కొలమానంగా చూడాల్సిన అవసరం లేదు. పొరపాటా, డిజైన్ ఎంపికా, మడత వల్ల ఏర్పడిన దృశ్యమా అన్నది పక్కన పెడితే, ఒక విషయం మాత్రం స్పష్టం- త్రివర్ణాన్ని ఉపయోగించే ప్రతి సందర్భంలో మరింత జాగ్రత్త అవసరం.

జాతీయ జెండా మన చేతిలో ఉండటం కన్నా, దాని గౌరవం మన ఆలోచనల్లో ఉండటం ముఖ్యం. చివరికి ప్రశ్న ఒక్కటే-త్రివర్ణం జేబులో కనిపించిందా? లేక దాని విలువలు మనసులోనూ కనిపిస్తున్నాయా?



శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
జగిత్యాల
9133947176

## 'కార్మిక' గుర్తింపును కాపాడే పోరాటం కావాలిప్పుడు

# జీవో 97 ఉపసంహరణకు కార్మిక సంఘాలు కదలాలి

*కార్మికుడి పేరును చెరిపితే చరిత్ర చెరిగిపోదు*
*శ్రమికుడి గొంతు నొక్కితే ప్రశ్న ఆగిపోదు*
*ఐక్యమై పోరాడితే జీవో వెనక్కి మళ్లక తప్పదు*
*శ్రమే శక్తి - కార్మికుడి గుర్తింపే నిలవాలి!*

'కార్మిక' అనే పదాన్ని తొలగించడం ద్వారా కార్మికుడి చరిత్రను చెరిపేయలేరు. శ్రమను ఒక శాఖ పేరులో నుంచి తొలగించినంత మాత్రాన శ్రమజీవుల ఉనికి అంతరించిపోదు. కానీ పేర్లు, పదాలు, గుర్తింపులు ప్రజల సామాజిక చైతన్యంపై ప్రభావం చూపుతాయి. అందుకే తెలంగాణ ప్రభుత్వం జీవో నెం.97 ద్వారా 'కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ' పేరును 'శక్తి'గా మార్చిన నిర్ణయాన్ని కేవలం పరిపాలనా మార్పుగా చూడకూడదు. దీనిపై కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక శక్తులు లోతుగా చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఏ పేరుతో శాఖను పిలవాలనుకుంటుందన్నది దాని పరిపాలనా హక్కు కావచ్చు. కానీ ఒక శాఖ పేరులో దశాబ్దాలుగా ఉన్న 'కార్మిక' అనే చారిత్రక గుర్తింపును ఎందుకు తొలగించాలి? ఆ పదం వల్ల ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటి? కార్మిక సంక్షేమం, కార్మిక హక్కులు, పారిశ్రామిక సంబంధాలు, ఉపాధి, కనీస వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలను స్పష్టంగా ప్రతిబింబించే పేరును పక్కన పెట్టి 'శక్తి' అనే విస్తృతమైన, అస్పష్టమైన పదాన్ని ఎందుకు ముందుకు తెచ్చారు? ప్రభుత్వం ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.

### 'శక్తి' అంటే ఎవరి శక్తి?

'శక్తి' అనే పదానికి అనేక అర్థాలున్నాయి. శక్తి అంటే బలం. సామర్థ్యం. ఎనర్జీ. సామాజిక శక్తి. రాజకీయ శక్తి. కానీ భారతీయ సామాజిక-సాంస్కృతిక సందర్భంలో 'శక్తి'కి ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక, దేవతా సంబంధమైన అర్థం కూడా ఉంది. దుర్గ, కాళి, పార్వతి వంటి దేవతా రూపాలతో 'శక్తి' అనే భావనకు ఉన్న అనుబంధం అందరికీ తెలిసిందే. అందువల్ల ప్రభుత్వ శాఖ పేరుగా 'శక్తి' అనే పదాన్ని తీసుకొచ్చినప్పుడు అది కేవలం ఒక సంక్షిప్త రూపం కాదా? లేక ఆ పదానికి ఉన్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రతీకలను కూడా రాజకీయంగా ఉపయోగించుకునే ప్రయత్నమా? అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇక్కడ ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. ప్రతి 'శక్తి' అనే పదాన్నీ హిందుత్వంతో సమానం చేయడం సరైంది కాదు. కానీ ప్రభుత్వ భాషలో కార్మికుడి స్పష్టమైన వర్గ గుర్తింపును తొలగించి, దానికి బదులుగా ఒక అస్పష్టమైన పదాన్ని తీసుకురావడం వెనుక ఉన్న భావజాలాన్ని ప్రశ్నించడం మాత్రం ప్రజాస్వామ్య హక్కు. ముఖ్యంగా దేశంలో ప్రభుత్వ సంస్థలు, విద్య, చరిత్ర, సంస్కృతి వంటి రంగాల్లో హిందుత్వ ప్రతీకలను సాధారణీకరించే ప్రయత్నాలు జరుగుతున్న సందర్భంలో ఇలాంటి మార్పులను మరింత జాగ్రత్తగా పరిశీలించాలి.

'కార్మికుడు' అనే పదం మనకు వెంటనే ఒక మనిషిని గుర్తుచేస్తుంది. చెమటోడ్చే మనిషిని, కర్మాగారంలో పనిచేసే మనిషిని, నిర్మాణ రంగంలో ఇటుక మోసే మనిషిని, రోడ్డు వేసే మనిషిని, యంత్రాన్ని నడిపే మనిషిని. అతని హక్కులు, వేతనం, పని గంటలు, భద్రత, సంఘటిత హక్కు, సమ్మె హక్కు మన కళ్లముందుకు వస్తాయి. కానీ 'శక్తి' అనే పదం ఆ ప్రశ్నలను అంత స్పష్టంగా ముందుకు తేవదు. ఇదే అసలు ప్రమాదం.

కార్మికుడి పేరు పోతే ప్రశ్న కూడా మసకబారుతుంది పదాలు మన ఆలోచనలను ప్రభావితం చేస్తాయి. 'కార్మిక శాఖ' అని చెప్పగానే.. కార్మిక చట్టాలు ఏమయ్యాయి? కనీస వేతనం అమలవుతోందా? కర్మాగారాల్లో భద్రత ఉందా? కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి ఏమిటి? అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత ఉందా? మహిళా కార్మికులకు సమాన వేతనం దొరుకుతోందా? వలస కార్మికుల హక్కులు ఏమిటి? అనే ప్రశ్నలు సహజంగా ముందుకు వస్తాయి. అదే 'శక్తి' అనే పేరు ప్రశ్నలను ఒక నిర్దిష్ట సామాజిక వర్గం నుంచి దూరం చేస్తుంది. ఇది కేవలం పేరు మార్పు వల్ల వెంటనే జరిగిపోయే పరిణామం కాదు. కానీ పరిపాలనా భాషలో వర్గ గుర్తింపులు క్రమంగా కనుమరుగైతే, ఆ వర్గాల సమస్యలు కూడా పాలనా ప్రాధాన్యతలో మసకబారే ప్రమాదం ఉంటుంది. ప్రశ్నించే స్వభావాన్ని బలహీనపరచే ఏ మార్పునైనా ప్రజాస్వామిక సమాజం జాగ్రత్తగా పరిశీలించాలి.

### కార్మిక సంఘాలు ఇక మౌనంగా ఉండకూడదు

జీవో నెం.97పై విమర్శలు చేయడం మాత్రమే సరిపోదు. దాన్ని ఉపసంహరించుకునేలా ప్రభుత్వంపై ప్రజాస్వామిక ఒత్తిడి నిర్మించాలి. అందుకు కార్మిక సంఘాలు ముందుండాలి. మొదట రాష్ట్రంలోని అన్ని కార్మిక సంఘాలు ఈ అంశంపై సంయుక్తంగా సమావేశమై చర్చించాలి. రాజకీయ భేదాలు ఉన్నా, 'కార్మిక' అనే చారిత్రక గుర్తింపును కాపాడటం అనే కనీస ఉమ్మడి అంశంపై ఐక్య కార్యాచరణ రూపొందించాలి. కార్మిక సంఘాలు చేపట్టాల్సిన కార్యాచరణ స్పష్టంగా ఉండాలి.

**మొదటిది ప్రభుత్వానికి సంయుక్త వినతిపత్రం:** రాష్ట్రంలోని ప్రధాన కార్మిక సంఘాలన్నీ కలిసి ముఖ్యమంత్రికి, కార్మిక శాఖకు, సంబంధిత ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించాలి. జీవో నెం. 97ను పునఃసమీక్షించి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేయాలి.

**రెండోది కార్మిక సభలు :** ప్రతి పారిశ్రామిక ప్రాంతంలో, ప్రతి జిల్లా కేంద్రంలో కార్మిక సభలు నిర్వహించాలి. 'కార్మిక' అనే పదం చరిత్ర ఏమిటి? కార్మిక శాఖ బాధ్యతలు ఏమిటి? పేరు మార్పు వల్ల ఎలాంటి భావజాల సమస్యలు తలెత్తుతాయి? అనే అంశాలపై ప్రజల్లో చర్చ జరగాలి.

**మూడోది మే డే స్ఫూర్తితో ప్రచారం:**
మే డే ఒక్కరోజు పూలదండలు వేసే కార్యక్రమంగా కాకుండా, కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమ దినంగా మార్చాలి. జీవో 97 ఉపసంహరణను కార్మిక ఉద్యమం యొక్క నిరంతర డిమాండ్‌గా ముందుకు తీసుకెళ్లాలి.

**నాలుగోది ప్రజాప్రతినిధులపై ఒత్తిడి :**
ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి ఈ అంశంపై తమ వైఖరిని ప్రకటించాలని కోరాలి. శాసనసభలో ప్రశ్న లేవనెత్తాలని, ప్రభుత్వాన్ని వివరణ కోరాలని డిమాండ్ చేయాలి.

**ఐదోది సంతకాల ఉద్యమం :** కార్మికులు, ఉద్యోగులు, మేధావులు, న్యాయవాదులు, విద్యార్థులు, రచయితలు, కళాకారులు, ప్రజాసంఘాల ప్రతినిధులతో రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టాలి.

**ఆరవది కార్మిక హక్కులపై ప్రజా ప్రచారం :** కార్మిక చరిత్ర, ఎనిమిది గంటల పని హక్కు, కనీస వేతనాలు, సామాజిక భద్రత, ట్రేడ్ యూనియన్ హక్కులు వంటి అంశాలపై చిన్న పుస్తకాలు, కరపత్రాలు, పోస్టర్లు, సోషల్ మీడియా ప్రచారాన్ని నిర్వహించాలి.

**ఏడోది ప్రజాస్వామిక నిరసనలు :** ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలి. అనంతరం రాష్ట్రస్థాయి మహాధర్నా, చలో హైదరాబాద్ వంటి ప్రజాస్వామిక కార్యక్రమాల దిశగా ఉద్యమాన్ని విస్తరించాలి. ఇది ఒక్క సంఘం పోరాటంగా కాకుండా సంయుక్త ఉద్యమంగా మారాలి.

### ప్రభుత్వం వెనక్కి తగ్గే మార్గం పోరాటమే

ప్రభుత్వాలు సాధారణంగా విమర్శలతోనే నిర్ణయాలను వెనక్కి తీసుకోవు. ప్రజల నుంచి బలమైన ప్రజాస్వామిక ఒత్తిడి వచ్చినప్పుడు మాత్రమే పునరాలోచన చేస్తాయి. చరిత్రలో కార్మిక వర్గం సాధించిన ప్రతి హక్కు పోరాటం ద్వారానే వచ్చింది. ఎనిమిది గంటల పని హక్కు పోరాటంతో వచ్చింది. కార్మిక సంఘటనా హక్కు పోరాటంతో వచ్చింది. కనీస వేతనం కోసం పోరాటాలు జరిగాయి. సామాజిక భద్రత కోసం పోరాటాలు జరిగాయి. అందుకే 'కార్మిక' అనే పదాన్ని కాపాడుకోవడం కూడా కేవలం ఒక పేరుకోసం చేసే పోరాటంగా చూడకూడదు. ఇది కార్మికుడి సామాజిక గుర్తింపు, చారిత్రక చైతన్యం, ప్రశ్నించే హక్కు, సంఘటిత శక్తిని కాపాడే పోరాటం.

### పేరు మాత్రమే కాదు - కార్మికుడి హక్కులే అసలు విషయం

అయితే మరో ముఖ్యమైన అంశాన్ని కూడా కార్మిక సంఘాలు విస్మరించకూడదు. 'కార్మిక' అనే పేరు కొనసాగించడం మాత్రమే సరిపోదు. కార్మికుడికి కనీస వేతనం కావాలి. ఉద్యోగ భద్రత కావాలి. కాంట్రాక్టు వ్యవస్థ దోపిడీ నుంచి రక్షణ కావాలి. పని ప్రదేశంలో భద్రత కావాలి. సామాజిక భద్రత కావాలి. మహిళా కార్మికులకు సమాన హక్కులు కావాలి. గిగ్, ప్లాట్‌ఫామ్, అసంఘటిత రంగ కార్మికులకు చట్టబద్ధ రక్షణ కావాలి. కాబట్టి జీవో 97 వ్యతిరేక ఉద్యమాన్ని 'పేరు కాపాడే ఉద్యమం' నుంచి 'కార్మిక హక్కుల పరిరక్షణ ఉద్యమం'గా విస్తరించాలి. అప్పుడే ఈ పోరాటానికి సామాజిక బలం పెరుగుతుంది.

కార్మికుడు తన పేరును కోల్పోవద్దు. తన హక్కులను కోల్పోవద్దు. తన సంఘటిత శక్తిని కోల్పోవద్దు. తన ప్రశ్నించే స్వభావాన్ని కోల్పోవద్దు. 'శక్తి' అనే పేరుతో కార్మికుడి వర్గ గుర్తింపును మరుగున పడనివ్వకూడదు. ప్రభుత్వం ప్రజల మాట వినాలి. కార్మిక సంఘాలతో చర్చించాలి. జీవో నెం.97ను పునఃసమీక్షించాలి. 'కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ' అనే చారిత్రక పేరును పునరుద్ధరించాలి. ప్రశ్నించే కార్మికుడే ప్రజాస్వామ్యానికి బలం. సంఘటిత కార్మికుడే దోపిడీకి అడ్డుకట్ట. పోరాడే కార్మికుడే తన హక్కులను సాధించగలడు. అందుకే ఇప్పుడు అవసరం మరో ప్రకటన కాదు - కార్యాచరణ. కార్మిక సంఘాలు ఐక్యమవ్వాలి. కార్మికులు కదలాలి. ప్రజలు ప్రశ్నించాలి. ప్రభుత్వంపై ప్రజాస్వామిక ఒత్తిడి పెంచాలి. పోరాటమే మార్గం. పోరాటమే శక్తి. ఆ పోరాటం ద్వారానే జీవో 97ను ప్రభుత్వం ఉపసంహరించుకునేలా చేయాలి. కార్మికుడి పేరును కాపాడుకుందాం. కార్మికుడి హక్కులను కాపాడుకుందాం. కార్మికుడి ప్రశ్నించే స్వరాన్ని కాపాడుకుందాం.'కార్మిక' గుర్తింపును నిలబెట్టుకుందాం!

- మామిండ్ల రమేష్ రాజా
రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్)
లిబరేషన్ తెలంగాణ

# దళితబహుజన ఐక్యవేదిక నిర్మాణం - తాత్విక ఘర్షణ

## యుగకర్త బి.ఎస్. రాములు

బి.ఎస్. రాములు గారి ఆలోచనా విధానానికి, సామాజిక దృక్పథానికి ఆయన బాల్యమే పునాది వేసింది. చిన్నతనం నుండి తల్లి చెప్పిన కథలు వింటూ, ఎనిమిదవ తరగతి నుండే స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం ప్రారంభించారు. చందమామ, బాలమిత్ర వంటి పత్రికలతో మొదలైన ఆయన ప్రస్థానం... రవీంద్రనాథ్ ఠాగూర్, శరత్‌బాబు, ప్రేమ్‌చంద్, విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ, గుఱ్ఱం జాషువా, సినారె, దాశరథి, రంగనాయకమ్మ వంటి ప్రముఖుల వందలాది సామాజిక, తాత్విక గ్రంథాల పఠనం వైపు సాగింది. 1968 జనవరిలో 'బాలమిత్ర' పత్రికలో జగిత్యాల నేపథ్యంతో అచ్చయిన కథే ఆయన తొలి రచన.

నాస్తిక కేంద్ర నిర్వాహకులు గోరా రచనలు, సి. వి. హేతువాద సాహిత్యం, డా॥ బి.ఆర్. అంబేద్కర్ రాసిన 'కుల నిర్మూలన', బోయి భీమన్న 'ధర్మం కోసం పోరాటం', ఎండ్లూరి చిన్నయ్య రాసిన 'అంబేద్కర్ జీవిత చరిత్ర' వంటి గ్రంథాలు ఆయనలో నూతన సిద్ధాంతాల ఆవిర్భావానికి కారణమయ్యాయి. 1964 నుండి ఆర్ఎస్ఎస్ మొదలుకొని వివిధ సామాజిక, సిద్ధాంత పునాదులను పరిశీలిస్తూ, యువకుడిగా ఉన్నప్పుడే రైతుకూలి ఉద్యమాలు, అంబేద్కర్ సంఘాల నిర్మాణాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు.

### సామాజిక సేవా రంగం - ఉద్యోగ ప్రస్థానం

1967లో 12వ తరగతి (ఇంటర్మీడియట్) ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనప్పటికీ, సుదీర్ఘకాలం నిరుద్యోగ సమస్యను ఎదుర్కొన్నారు. ధర్మపురిలోని సాయం కళాశాలలో తాత్కాలిక ఉపాధి పనులు చేస్తూ డి ఓ ఎల్ , బి ఓ ఎల్ సాయం కళాశాలలో చదివారు. నిరుద్యోగంలో తొమ్మిదేళ్లు గడిపిన అనంతరం, 1975లో సాంఘిక సంక్షేమ శాఖలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు.

ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే, 1976 నుండి సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగ సంఘాల జిల్లా, రాష్ట్ర స్థాయి బాధ్యతలను భుజానకెత్తుకున్నారు. ఈ క్రమంలో 1977-78లో 'సంఘమిత్ర' అనే పత్రికను నడిపారు. ఉద్యోగుల హక్కుల కోసమే కాకుండా పిడిఎస్యు (గ్రాణూఖ), ఆర్ఎస్యు వంటి విద్యార్థి, యువజన సంఘాల నిర్మాణానికి, పౌరహక్కుల మరియు దళిత బహుజన కార్మిక నక్సలైట్ ట్రేడ్ యూనియన్ ఉద్యోగ సంఘాల బలోపేతానికి చేయూతనందించారు.

### విప్లవోద్యమంలో క్రియాశీలక పాత్ర - నిర్బంధాలు

1978 నుండి రాడికల్ విద్యార్థి యువజన సంఘం జిల్లా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న బి.ఎస్. రాములు, 1980లో విప్లవ రచయితల సంఘం (విరసం) సభ్యుడిగా చేరి, త్వరలోనే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎదిగారు. ప్రజాపోరాటాల నేపథ్యంలో 1984 జనవరిలో రాజ్యాంగ యంత్రాంగం ఆయనను అరెస్ట్ చేసి, జైలుకు పంపింది. తత్ఫలితంగా ఉద్యోగం నుండి సస్పెండ్ అయ్యారు. జైలు నుండి విడుదలైన తర్వాత, 1984 జులైలో రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.



### 1985 జూన్‌లో విరసం, ఎఐఎల్ ఆర్సి, ఎపిసిఎల్ సి, ఆర్ఎస్యు,

ఆర్ వై ఎల్, జన నాట్యమండలి వంటి ఏడు విప్లవ అనుబంధ సంస్థల తరపున వరవరరావు, గద్దర్, సంజీవ్, డోలకిస్టు రాజు తదితరులతో కలిసి 'అఖిల భారత సమాచార సాంస్కృతిక యాత్ర' చేపట్టారు. ఈ దేశవ్యాప్త పర్యటనలో వేలాది మంది రచయితలు, కళాకారులు, మేధావులను కలుసుకుని, వివిధ ప్రాంతాల సామాజిక స్థితిగతులను, పౌరహక్కుల ఉద్యమాలను అధ్యయనం చేసే అవకాశం ఆయనకు లభించింది.

### తాత్విక ఘర్షణ -వర్గ సిద్ధాంతంలో కుల సమస్య

దేశవ్యాప్త పర్యటనలో బి.ఎస్. రాములు గారు ఒక చేదు నిజం గ్రహించారు. సమాజంలో కుల వివక్ష, కుల వ్యవస్థ అన్ని రంగాల్లోనూ రూఢిగా ఉందనీ, ప్రగతిశీల ఉద్యమాల్లో సైతం కుల సమస్య ఒక పెద్ద అడ్డంకిగా మారిందని గుర్తించారు. ఆదర్శాలు మాట్లాడే విప్లవ సిద్ధాంతాల వెనుక అంతర్గతంగా 'కులాధిపత్య ధోరణులు' మరియు 'నిచ్చెనమెట్ల కుల సమాజ మానసికత' దాగి ఉన్నాయని ఆయనకు అర్థమైంది.

మార్క్సిజం, లెనినిజం, మావోయిజం సిద్ధాంతాలు ప్రపంచవ్యాప్తంగా తెచ్చిన మార్పులను గౌరవిస్తూనే, అవి భారతీయ సామాజిక భూమికకు (కుల వ్యవస్థకు) తగినట్లుగా అన్వయించబడలేదని ఆయన వాదించారు. ఫెమినిస్టులు, దళితులు, బహుజనవాదుల సమస్యలను వామపక్షాలు కేవలం తమ ఉనికి కోసం వాడుకుంటున్నాయే తప్ప, వాటిని ప్రధాన సామాజిక శక్తులుగా గుర్తించడం లేదని విమర్శించారు.

### 'అరుణతార' పత్రికలో వాదోపవాదాలు - ఆంక్షలు

భారతీయ సమాజానికి సరిపోయే సమగ్ర తాత్విక భూమిక కోసం చార్వాక, బౌద్ధ, జైన, భక్తి ఉద్యమాలతో పాటు పూలే, అంబేద్కర్ ఆలోచనలను ఆయన అధ్యయనం చేశారు. ఈ నేపథ్యంలో 1987లో "ఆలోచన ఆచరణ మధ్య వైరుధ్యం" అనే సుదీర్ఘ వ్యాసాన్ని కలం పేరుతో 'అరుణతార' మాసపత్రికలో రాశారు. ఈ వ్యాసంపై విప్లవ శ్రేణుల్లో ఏడాది పాటు తీవ్రమైన సైద్ధాంతిక చర్చ జరిగింది.

మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావోల సిద్ధాంతాల్లోని అంతర్గత వైరుధ్యాలను స్పష్టం చేస్తూ, భారతీయ సమాజంలోని వర్గ-కుల దృక్పథాల మధ్య ఉన్న వ్యత్యాసాలను ఆయన బహిర్గతం చేశారు. అయితే, ఈ తాత్విక చర్చలు తీవ్రరూపం దాల్చడంతో, సంఘ నాయకత్వం రాములు గారిని కలం పేర్లతో రాయవద్దని ఆదేశించింది. భావప్రకటన స్వేచ్ఛను హరించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సంఘంలో ఉంటూనే కలం పేరుతో వ్యాసాలు పంపినప్పటికీ, అంతర్గత ఆంక్షల వల్ల ఆయన రాసిన ఒక్క వ్యాసం కూడా అచ్చు అవ్వకుండా నిరాకరించబడింది.

### 'విరసం' సర్వసభ్య సమావేశం (1991) - చారిత్రాత్మక నిష్క్రమణ

1991 జనవరిలో జరిగిన విరసం సర్వసభ్య సమావేశంలో కుల సమస్యపై ఒక స్పష్టమైన తీర్మానం లేదా అవగాహన సాధించాలని బి.ఎస్. రాములు ప్రతిపాదించారు. అయితే మెజారిటీ సభ్యులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ సమయంలో ప్రజాస్వామిక హక్కులను గౌరవిస్తూ విమల (జనశక్తి) వంటి కొద్దిమంది మాత్రమే ఆయనకు మద్దతు ఇచ్చారు.

సభలో కులం ఉనికిని నిరాకరిస్తున్న నాయకులను ఉద్దేశించి రాములు గారు తీవ్ర స్వరంతో... "మీ తండ్రి, తల్లి, భార్య, తాత, ముత్తాతలు ఏ కులం? మూడు తరాలుగా ఒకే కులంలో వివాహాలు చేసుకుంటూ, సమాజంలో కులం లేదని ఎలా అబద్ధం చెప్తారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నాయకత్వం ఉక్కిరిబిక్కిరి అయింది.

### భావజాల యుద్ధం - మొక్కవోని దీక్ష

సంఘం నుండి బయటకు వచ్చిన తర్వాత, ఈ సిద్ధాంతపరమైన యుద్ధం బి.ఎస్. రాములు గారిని ఒక 'యుద్ధనౌక'గా మార్చింది. ఈ ప్రస్థానంలో ఆయన ఎన్నో విమర్శలను, హేళనలను, భౌతికపరమైన హెచ్చరికలను మరియు వ్యక్తిత్వ హత్యాకాండ (జఫ్ట్రుతీఖ్వేతీ ాంయిం౦౦ఆఖ్ఆశీఅ) నిందారోపణలను ఎదుర్కొన్నారు. అయితే తన ఆచరణాత్మక సిద్ధాంతాల ద్వారా ఆయన వాటన్నిటినీ పటాపంచలు చేశారు. తనను వ్యతిరేకించిన శక్తులకు వెరవకుండా, విప్లవోద్యమ కాలంలో రెండు సార్లు పోలీసు నిర్బంధాలకు గురైనా సరే, కాలం కాపాడిన బిడ్డగా నిలబడ్డారు. తాను ఏం మాట్లాడుతున్నారో, ఏం చేస్తున్నారో అనే సంపూర్ణ లక్ష్యశుద్ధితో ఆయన ముందుకు సాగిపోయారు.

### అంబేద్కర్-మార్క్స్ సమన్వయం - చారిత్రక సవాలు

సంఘం నుండి నిష్క్రమించిన తర్వాత బి.ఎస్. రాములు గారు ఒక చారిత్రక సత్యాన్ని నొక్కి చెప్పారు: "భారతదేశంలో విప్లవ పార్టీలు మార్క్సిజం పునాదులపై ఏర్పడినప్పటికీ, ఇక్కడి సామాజిక అనుభవాలు వేరు. కాబట్టి అంబేద్కర్ ఆలోచనా విధానంతో సమాజాన్ని విశ్లేషించాలి." ఈ క్రమంలో విప్లవ నాయకుడు లక్ష్మణరావు ఆయనను అవమానించగా, రాములు గారు 1988 లోనే ఒక సవాలు విసిరారు.

ఆయన ఊహించినట్లుగానే, వామపక్ష నక్సలైట్ ఉద్యమాలు గాంధీ, అంబేద్కర్ ల కన్నా చాలా ఆలస్యంగా (1993 నాటికి) కుల సమస్య యొక్క ప్రాధాన్యతను గుర్తించి, తమ పార్టీ డాక్యుమెంట్లలో చేర్చుకోవలసి వచ్చింది. ఇది సిద్ధాంతపరంగా బి.ఎస్. రాములు సాధించిన చారిత్రక విజయం.

### 'దరకమే ఐక్యవేదిక' ఆవిర్భావం - సభలు, సదస్సులు

1990 వరకు సమాజం వెంట నడిచిన బి.ఎస్. రాములు గారు, 1990 తర్వాత సమాజానికి తానే ముందుండి దిశా నిర్దేశం చేశారు. విప్లవవాద బౌద్ధ మానవతావాదాన్ని, బహుజన తత్వాన్ని సమన్వయపరుస్తూ బహిరంగ జీవితంలో విస్తృతంగా పర్యటించారు. రాములు గారి బహుజన తాత్విక సిద్ధాంతాలకు ఆకర్షితులైన ప్రజాకవి గూడ అంజయ్య గారు ఆయనను కలిసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం ఒక ఉమ్మడి వేదిక అవసరమని ప్రతిపాదించారు.

1992 జూన్ 22న ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో జరిగిన సాహిత్య సమావేశంలో "దరకమే ఐక్యవేదిక" ఏర్పాటుకు సన్నాహక కమిటీ ఏర్పడింది. బి.ఎస్. రాములు దీనికి వ్యవస్థాపక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు , "రచయితలారా, కళాకారులారా మీరు ఎటువైపే?" అని కరపత్రాల ద్వారా పిలుపు రాష్ట్రాన్ని కదిలించింది.. తదనంతర కాలంలో ఈ సంస్థకు రెండవ అధ్యక్షుడిగా వి. నారగోని, మూడవ అధ్యక్షుడిగా మాస్టర్జీ పనిచేశారు.

కరీంనగర్ సెమినార్ (1992): 1992 డిసెంబర్ 6వ తేదీన బాబ్రీ మసీదు కూల్చివేత జరిగిన రోజునే దేశంలో భయానక వాతావరణం ఉన్నప్పటికీ, స్థలం మార్చి కరీంనగర్ లో ఎస్టీయూ టీచర్స్ యూనియన్ ఆఫీసులో రాష్ట్రస్థాయి సెమినార్ విజయవంతంగా నిర్వహించారు.

వరంగల్ సదస్సు (1993): 1993 జనవరి 3న వరంగల్ గిర్మాజీ పేట ప్రాంతంలో సాహిత్య సదస్సు జరిపారు. ఈ సందర్భంగా రాములు గారు రాసిన 'దళిత సాహిత్య గర్జన' అనే 8 పేజీల సిద్ధాంత వ్యాసాన్ని పుస్తకంగా వేలాది కాపీలు పంపిణీ చేశారు.

- జూజుల గౌరి

మిగితా తరువాయి సంచికలో..

## గౌతమ్ నగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే విస్తృత పర్యటన



**మల్కాజిగిరి, ఆగస్టు 15 (జనం సాక్షి) :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌లతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మల్లికార్జున నగర్‌లో 36 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం ఇందిరా నెహ్రూ నగర్‌లో 200 మంది పేదలకు లేబర్ కార్డులను అందజేశారు. రామాంజనేయ నగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ రేషన్ కార్డుల మంజూరు



**జోగులాంబ గద్వాల, ప్రతినిధి, ఆగస్టు 15 (జనం సాక్షి) :** జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఘనంగా ప్రారంభమైంది. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజేయుడు, ం+ూ+ఙజఖీూ చైర్‌పర్సన్ సరిత లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. జిల్లాలో 1.90 లక్షల మందికి స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. తొలుత 150 మందికి కార్డులు ఇచ్చారు. మిగతా వారికి 15 రోజుల్లో రేషన్ డీలర్ల ద్వారా సర్పంచులు, గ్రామ కార్యదర్శుల సమక్షంలో అందజేస్తామన్నారు. అర్హులైన వారి నుంచి మీ సేవ కేంద్రాల ద్వారా కొత్త రేషన్ కార్డు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. రేషన్ బియ్యం పారదర్శక పంపిణీకి టీ-నేషన్ యాప్ వినియోగిస్తున్నామని, దుర్వినియోగంపై పిడి యాక్ట్ కింద చర్యలు ఉంటాయన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టడం గర్వకారణమని ఎమ్మెల్యేలు అన్నారు. ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా కార్డుల పంపిణీ ప్రారంభించడం పేదలకు మేలు చేస్తుందని చైర్‌పర్సన్ సరిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి

- ప్రజా సేవల్లో సమన్వయంతో పనిచేయాలి
- దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బదావత్ సంతోష్



**ఖైరతాబాద్, ఆగస్టు 15 (జనం సాక్షి) :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ ఖైర తాబాద్ జోనల్ కార్యాలయంలో శనివారం జాతీ య జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బదావత్ సంతోష్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమ రయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బం ది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత చొరవ చూ పాలని అన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్, జోనల్ సీపీ శ్రీనివాస్, డిసి లు శంకర్, శ్రీనివాసులు కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



**చేర్యాల, ఆగస్టు 15 (జనంసాక్షి) :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్ కుమార్ అన్నారు. శనివారం చేర్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాల మహాసభకు గూడెపు సుదర్శన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో రాజ్ కుమార్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు చేర్యాల ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అందరూ ఏకమై ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదివిన యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక కార్మికులుగా, కూలీలుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. చేర్యాల ప్రాంతంలో నెలకొన్న సమస్యల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని ఆయన కోరారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు ఈరి భూమయ్య, వలబోజు నర్సింహా చారి, బియ్యు బాలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బిచ్చుల శ్రీనివాస్, బొజ్జ బాలకృష్ణ, బోడపట్ల రాజు, కాశబోయిన చరణ్, దాసరి హరిబాబు, కొయ్యడ లింగం, మేకల ప్రభాకర్, సలేంద్ర మహేష్, ముద్దల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# జోగులాంబ గద్వాల జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి

- గూడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచుతూ క్యాబినెట్ ఆమోదం
- అభివృద్ధి, సంక్షేమమే ప్రధానంగా సుపరిపాలన
- తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంతో ముందుకెళ్తున్న ప్రభుత్వం

**జోగులాంబ గద్వాల ప్రతినిధి, ఆగస్టు 15 (జనం సాక్షి) :** న్యూఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ పత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు క్రీడా వ్యవహారాలు ఏపీ జితేందర్ రెడ్డి. గద్వాల పరేడ్ గ్రౌండ్ లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ప్రసంగిస్తూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ఒక భాగం అని మార్చి 6 నుండి జూన్ 12 వరకు నిర్వహించ తలపెట్టినందున జిల్లాలో ఇప్పటివరకు 10 టీంలు పరిశుభ్రత, ఆరోగ్యం, రహదారి భద్రత అరైవ్, అలైవ్, సంక్షేమ పథకాల అమలు, పిల్లల భద్రత నో-డ్రగ్స్ ప్రచారం, రైతు సంక్షేమం, విద్యా, ఉపాధి అవకాశాలు, యువత, క్రీడలకు ప్రోత్సాహం, మహిళా శిశు సంక్షేమం మరియు పర్యావరణ కార్యక్రమాలు చేపట్టి ప్రజలలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, వివిధ అభివృద్ధి పనుల వివరాలు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి సమావేశాలలో ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రధానంగా సుపరిపాలన అందిస్తూ, జోగులాంబ గద్వాల జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని న్యూఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ పత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు క్రీడా వ్యవహారాలు ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు.

ఐడిఓసి కార్యాలయంలో వేడుకలు

జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల అమలే ధ్యేయమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఐడిఓసిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ



వేడుకలు. జోగులాంబ గద్వాల జిల్లా అభివృద్ధికి అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం ఐడిఓసి ఆవరణ వద్ద జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ముందుగా కలెక్టర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న వారందరికీ, ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం గద్వాల పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన వేడుకల్లో ఏపీ జితేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రజలకు హృదయ పూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గద్వాల, ఆలంపూర్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, రాష్ట్ర గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, వాల్మీకి బోయ కార్పోరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, తదితర అతిథులతో కలిసి మొదట దేశ నాయకుల చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గీతం తో పాటు వందేమాతరం, జాతీయ గీతాలను ఆలపించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఓపెన్ టాప్ జీపులో ముఖ్య అతిథితో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీ ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

### జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రోజు ఉదయం 07:40 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయం నందు జిల్లా ఎస్పి శ్రీ టి. శ్రీనివాస రావు, ఐ.పి.యస్. జాతీయ జెండాను ఎగరవేసి, సిబ్బందితో కలిసి జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ సిబ్బందికి, కుటుంబ సభ్యులకు, జిల్లా ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు. మాతృ భూమి కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసి బ్రిటిష్ వారితో పోరాడి, మనకు సమకూర్చి పెట్టిన ఈ స్వాతంత్ర్య భారత్ నేటితో 79 వసంతాలను పూర్తి చేసుకుందని, ఈ సందర్భంగా ఆ మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ పండుగలు మనం సమాజానికి ఏవిధంగా సేవాచేయాలని మన విధులను గుర్తు చేస్తాయని అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో పని చెయ్యాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఒక్కరిని సమానంగా చూడటం, ప్రతి బాధితుడికి న్యాయం చేయగలిగినప్పుడే మనం సాధించుకున్న స్వాతంత్ర్య దేశానికి సార్థకత అని అన్నారు.

## సాంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుందాం



**మొయినాబాద్, ఆగస్ట్ 15 (జనం సాక్షి) :** విద్యార్థులు నాణ్యమైన విద్యుత్ తో పాటు సాంస్కృతి సాంప్రదాయాలను పాటించాలని తెలంగాణ రాష్ట్ర టిపిసిసి కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్. పిన్ అనామిక్స్ క్యాపిటల్ మేనేజింగ్ పార్ట్నర్ సీఈవో డాక్టర్ సత్యనారాయణ వడ్డీ స్వామి నారాయణ గురుకుల్ ఇంచార్జ్ సుక్ స్వామీజీ లు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలో గల స్వామి నారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా ఉల్లాసంగా ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి వారు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ ఐక్యత ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించేలా ఎదగాలని సూచించారు దేశభక్తి అందరిలో ఉండాలని తెలిపారు భారత స్వతంత్రం వెనుక ఉన్న చరిత్రక త్యాగాలను తెలియజేశారు విద్యార్థులలో ఐక్యత నిజాయితీ ఎంతో ఉందని క్రమశిక్షణ దేశభక్తి లాంటి విలువలను మరింత పెంపొందించుకోవాలని సూచించారు ఈ వేడుకల్లో విద్యార్థులు చేసిన నృత్యాలు సాంస్కృతిక నాటికలు బ్రహ్మవిద్య సాద్విద్య ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న స్వామినారాయణ్ గురుకుల్ సమస్త ఎంతో ప్రతిష్టంగా నిలిచిందని తెలిపారు ఇక్కడ ఉన్న స్వామీజీలు విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులతో పాటు క్రమశిక్షణ ఐక్యత దేశభక్తిని నింపడం వారిని అభినందించారు ఈ పాఠశాల జాతీయ గర్వాన్ని నింపుతుందని అన్నారు జాతీయ రహదారి హైదరాబాద్ బెంగళూరు రోడ్డు పక్కనే ఉండడంతో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థుల నృత్యాలు డాన్సులు సాంస్కృతి కార్యక్రమాలు రహదారిపై వెళ్లే వాహనదారులు ప్రయాణికులు ఆసక్తిగా తిలకించడం తో పాటు సంతోషం వ్యక్తం చేస్తూ చప్పట్లతో అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ముఖ్యం




**తాండూరు, ఆగస్టు 15 (జనంసాక్షి) :** స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ముఖ్యమని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మరియు మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం తాండూరు పట్టణంలో ని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ లో భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని అత్యంత దేశభక్తి ఉత్సాహంతో, గర్వంగా మరియు సంబరంగా జరుపుకున్నారు. స్వేచ్ఛ, ఐక్యత మరియు జాతీయ బాధ్యతల స్ఫూర్తిని ప్రతిబింబించే ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వాగతం మరియు దేశభక్తి పూరిత ప్రారంభం కార్యక్రమం గౌరవపూర్వక స్వాగతంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడంతో వాతావరణం దేశభక్తితో నిండిపోయింది. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్

మాట్లాడుతూ స్వాతంత్ర్యం అంటే కేవలం వేడుక కాదు. అది మనపై ఉన్న బాధ్యత. క్రమశిక్షణ, నిజాయితీ, దేశభక్తి కలిగిన బాధ్యతాయుత పౌరులుగా మీరందరూ ఎదగాలి. మన రాజ్యాంగ విలువలను కాపాడుతూ, సమాజానికి మంచి చేయడానికి కృషి చేయాలని విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం ఇచ్చారు. విద్యార్థులు దేశభక్తితో, ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. పాఠశాల డైరెక్టర్లు మల్లేషం, వెంకటేశం మరియు సతీష్‌లకు వారి స్ఫూర్తిదాయక నాయకత్వానికి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఆజాదీ కీ అమర్ గాథ నాటికను తాండూరు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో కూడా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి , మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ మరియు ఇతర ప్రముఖులు హాజరయ్యారు. విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల కృషిని, నైపుణ్యాన్ని అందరూ ప్రశంసించారు. నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ అసంఖ్యాక వీరుల త్యాగఫలం అనే సందేశాన్ని ఈ నాటిక బలంగా తెలియజేసింది.

### చిన్నారి అద్భుత ప్రతిభ

జూనియర్ కేజీ చిన్నారి ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అతి చిన్న వయసులోనే అద్భుతమైన జ్ఞాపకశక్తితో భారతదేశ రాష్ట్రాలు మరియు రాజధానులను, శ్లోకాలను స్పష్టంగా వినిపించి అందరి మన్ననలు పొందాడు. ఈ కార్యక్రమంలో నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ సెక్యూరిటీలో వనపర్తి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానం

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 15 (జనంసాక్షి) :** సైబర్ నేరాల నియంత్రణలో వనపర్తి జిల్లా పోలీస్ శాఖ రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ భవనంలో నిర్వహించిన 'సురక్ష కా తిరంగా--సైబర్ నేర రహిత తెలంగాణ' రాష్ట్రస్థాయి కార్యక్రమంలో వనపర్తి జిల్లా సైబర్ విభాగం సెక్యూర్డ్ ప్రొఫైలింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. సైబర్ నేరాల నియంత్రణ, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, ప్రజల్లో డిజిటల్ భద్రతపై అవగాహన కల్పించడం, సైబర్ మోసాల పట్ల అప్రమత్తత పెంపొందించడం వంటి అంశాల్లో జిల్లా సైబర్ విభాగం చేపట్టిన చర్యలకు ఈ గుర్తింపు లభించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం వనపర్తి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ప్రథమ స్థానానికి సంబంధించిన ప్రశంసా పత్రాన్ని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఆధ్వర్యంలో సైబర్ ఎస్సై రవిప్రకాష్ తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు కొత్త



రూపాల్లో విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద లింకులు, ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, నకిలీ యాప్‌లు, ఆన్‌లైన్ పెట్టుబడులు, సోషల్ మీడియా మోసాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తున్న జిల్లా పోలీస్ శాఖకు ఈ రాష్ట్రస్థాయి విజయం నిదర్శనమని ఎస్పీ సునిత రెడ్డి పేర్కొన్నారు. ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో సైబర్ నేరాల నియంత్రణ, ప్రజల డిజిటల్ భద్రత కోసం మరింత పటిష్టమైన చర్యలు చేపడతామని తెలిపారు.

# రైతాంగ, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఐక్య పోరాటం

- తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

**ముషీరాబాద్, ఆగస్టు 15 (జనం సాక్షి) :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయం ఎదుట మువ్వన్నెల జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నాగయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యవాదం, వలసవాదానికి వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య పోరాటంలో రైతు సంఘం కీలకంగా పాల్గొన్న విషయాన్ని గుర్తుచేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తయినా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదల జీవితాల్లో ఆశించిన స్థాయిలో ఆర్థిక పురోగతి సాధించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రైతాంగం, ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్య పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.



అమెరికా-భారత్ మధ్య ఇటీవల కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వానికి విఘాతం కలిగించే విధంగా ఉందని వారు విమర్శించారు. ఢిల్లీ రైతు ఉద్యమాన్ని విరమింపజేసే సమయంలో కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన రాతపూర్వక హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణ, వ్యవసాయ రంగ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా రైతాంగం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రైతులు పండించే అన్ని రకాల పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని పార్లమెంట్‌లో చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సాగు వ్యయానికి 50 శాతం లాభం కలిపి మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన పెట్టుబడి వ్యయాలు, అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను ఆదుకునేందుకు సమగ్ర రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని కోరారు. వీబీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి కనీసం 200 రోజుల పని కల్పించడంతో పాటు రోజువారీ కూలీని రూ.700గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు నివేశన స్థలాలు, పింఛన్ సదుపాయం కల్పించాలని కోరారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉండే విధానాలకు స్వస్తి చెప్పి వ్యవసాయ రంగ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్. శ్రీరామ్ నాయక్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్, నాయకులు ఆంజనేయులు, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- **ఫుడ్ సెక్యూరిటీ స్మార్ట్ కార్డులతో పారదర్శకంగా రేషన్ సరఫరా.**
- **మంత్రి వాకిటి శ్రీహరి**

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 15 (జనం సాక్షి) :** పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమ ని,పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందించ డమే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య శాఖ, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో వినియో గదారుల వ్యవహారాలు, ఆహార పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమా న్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడు తూ గతంలో రేషన్ బియ్యంపై ఉన్న చిన్న చూపును తొలగించి, పేద లు కూడా గౌరవంగా నాణ్య మైన సన్నబియ్యం తినాల నే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో పండించిన సన్నరకం వరిధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించ డంతో పాటు రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తూ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యం గా మార్చి అర్హులైన ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నట్లు తెలిపారు.



### స్మార్ట్ కార్డుతో పారదర్శకత

ఫుడ్ సెక్యూరిటీ స్మార్ట్ కార్డు ద్వారా రేషన్ సరఫరాలో పారదర్శకత పెరుగు తుందని మంత్రి అన్నారు. కుటుంబ సభ్యుల వివ రాలు, రేషన్ బియ్యం పొందిన వివరాలు డిజిటల్ విధానంలో నమోదవు తాయని తెలిపారు. అర్హు లైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయో జనాలు సులభంగా అందే లా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో కొత్త రేషన్ కార్డుల మంజూరు, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు, తొలగింపు వంటి అంశాల్లో ఎదురైన ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభు త్వం చర్యలు చేపట్టిం దన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త ఫుడ్ సెక్యూరిటీ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగు తుందని తెలిపారు.

### ప్రతి గ్రామంలో రేషన్ బియ్యం అందేలా చర్యలు

నారాయణపేట జిల్లాలో కొంతమంది లబ్ధిదారులు రేషన్ బియ్యం కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సి వస్తున్న పరిస్థితిని మంత్రి ప్రస్తావిం చారు. దీనివల్ల కూలి పనులు కోల్పోవడంతో పాటు ప్రయాణ ఖర్చులు భరించాల్సి వస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి "ఏ గ్రామానికి చెందిన రేషన్ కార్డుదారులు ఆ గ్రామంలోనే రేషన్ బియ్యం పొందేలా"చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సుల భంగా, అందుబాటులో ఉండేలా అధికారులు పనిచేయాలని కోరారు.

### రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

రేషన్ డీలర్లు పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమాన్ని చేరవేసే కీలక భాగస్వా ములని మంత్రి అన్నారు. వారి సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్య క్రమాలను అమలు చేస్తోందని, ప్రజలు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. మహిళల సంక్షేమం, ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణా లు, ఇందిరమ్మ ఇళ్లు తది తర కార్యక్రమాలను ప్రభు త్వం అమలు చేస్తోందన్నా రు. పేద కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం కలెక్టర్ తో కలిసి మంత్రి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక,ఎస్పీ డాక్టర్ వినీత్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీవో రమేష్, స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కాంత్ కుమార్, ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బాల్ రాజ్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సైదులు, అన్ని మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, అన్ని గ్రామాలు, పట్టణాల రేషన్ షాప్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ సమగ్రత, ఐక్యతను కాపాడాలి

- **ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



**మెదక్ బ్యూరో ఆగస్టు 15 (జనం సాక్షి) :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమక్షంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని పేర్కొన్నారు. దేశ సమగ్రత, ఐక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని ఎస్పీ తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. మహిళలు, బాలికలు, వృద్ధులు, బలహీన వర్గాల రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యువత మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. పోలీసు సిబ్బంది అంకితభావంతో ప్రజలకు సేవలందిస్తూ ప్రజల భద్రతకు ముందువరుసలో నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు కృష్ణమూర్తి, సందీప్‌రెడ్డి, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలి

- **రూ.25వేల విలువైన స్కూల్ కిట్స్ పంపిణీ చేసిన డాక్టర్ సుధీర్ కుమార్**



**సూర్యాపేట, ఆగస్టు 15 (జనంసాక్షి) :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మన అమ్మ హాస్పిటల్ ఎంఎస్ ఆర్థో డాక్టర్ సుధీర్ కుమార్ సేవా కార్యక్రమంను నిర్వహించారు. మోతె మండలం ఉర్లుగొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం రూ. 25 వేలు విలువైన స్కూల్ బ్యాగులు, పెన్నులు, కంపాస్ బాక్సులను డాక్టర్ సుధీర్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు సహాయాన్ని అందిస్తానని తెలిపారు. పేద, ప్రతిభావంతులైన పిల్లలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొక్క వెంకటేశ్వర్లు,కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ బాల్టు శోభన్ బాబు, జి. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం

- **ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులు మెరుగైన ఆదాయం పొందాలి**
- **80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చీఫ్ విప్ ఎమ్మెల్సీ డా. పట్నం మహేందర్ రెడ్డి**

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 15 (జనంసాక్షి) :** ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ డా. పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో లోటు వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులు మినుములు, కంది, జొన్న, ఆముదం, కూరగాయలు తదితర ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించి మెరుగైన ఆదాయం పొందాలని ఆయన సూచించారు. 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వనపర్తి జిల్లా ఐ.డి.ఓ.సి. ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డా. పట్నం మహేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథికి స్వాగతం పలికారు. ఈ




సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు అర్పించిన ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, పాత్రికేయులు, ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత స్వాతంత్ర్య పోరాటం మహాత్మా గాంధీ నాయకత్వంలో అహింసను ఆయుధంగా చేసుకుని సాగి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో పేదరికం, అసమానతలు, అంటరానితనం వంటి సామాజిక సమస్యల నిర్మూలనకు పునాది పడిందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించే దిశగా పనిచేస్తోందని తెలిపారు. 2025-26 సంవత్సరానికి 9,023 స్వయం సహాయక సంఘాలకు రూ. 7.72 కోట్ల వడ్డీలేని రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో 956 సంఘాలకు రూ. 3.16 కోట్ల వడ్డీలేని రుణాలు అందించామన్నారు. ఈ సందర్భంగా మెప్మా పరిధిలోని 45 స్వయం సహాయక సంఘాలకు రూ. 3.75 కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందజేశారు.

### భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి

రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూ భారతి చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 12,501 దరఖాస్తులు స్వీకరించగా 11,303 దరఖాస్తులను పరిష్కరించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్, వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- **మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**

**మెదక్ టౌన్, ఆగస్టు 15 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్--2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెదక్ జిల్లాలో మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇండ్లు తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూరుతోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు 4.49 కోట్ల సార్లు ఉచిత ప్రయాణం చేయగా, రూ. 161.49 కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు. రైతు భరోసా కింద 2,66,674 మంది రైతులకు రూ. 222.69 కోట్లు అందించినట్లు వివరించారు. జిల్లాలో 8,955 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 7,382 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, 4,353 ఇళ్లు నిర్మాణం పూర్తయ్యే దశకు చేరుకున్నాయని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా మెదక్ జిల్లాలో 2,41,393 మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుందని చెప్పారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పర్యాటక రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఏడుపాయల ఆలయంలో వసతి గృహాల ఏర్పాటుకు రూ. 7 కోట్లు, మెదక్ పోర్టు పునరుద్ధరణకు రూ. 57 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో రూ. 3.50 కోట్ల జంబో చెక్కును



లబ్ధిదారులకు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలు అందించి, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీవో రమాదేవి, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పుర ప్రముఖులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మూడో రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు

**వెల్దుర్తి, ఆగస్టు 15 (జనం సాక్షి) :** తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను వెల్దుర్తి మండలంలోని వేరే గ్రామంలో ఏర్పాటు చేయవద్దని మండల కేంద్రమైన వెల్దుర్తిలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నేటికీ మూడవ రోజుకు చేరుకున్నాయి శనివారం రోజున దీక్షల పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు



ముఖ్యంగా నెల్లూరు గ్రామ సర్పంచ్ రంగారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ తో పాటు జేఏసీ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగింది ముఖ్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను అన్ని వసతులు ఉన్న వెల్దుర్తి పట్టణంలోని ఏర్పాటు చేయాలని రవాణా సౌకర్యం లేనటువంటి వేరే ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లయితే మండలంలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలు వారి పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడతారని రంగారెడ్డి తెలిపారు ముఖ్యంగా ఈ స్కూల్ వెల్దుర్తి పట్టణంలో ఏర్పాటు చేసినట్లయితే వెల్దుర్తి పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని వారు కోరారు ప్రభుత్వం వేరే ఆలోచన మానుకొని వెల్దుర్తి పట్టణంలోని త్వరితగతిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని వారి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పలువురు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



**గుమ్మడిదల, ఆగస్టు 15 (జనం సాక్షి) :** విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సూచించారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "బాగా చదువుకోండి.. మీ వెంట నేనుంటా. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కష్టపడాలి. చదువులో ముందుండే విద్యార్థులకు నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తాను" అని గోవర్ధన్ రెడ్డి అన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరచాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సీజీఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారి లక్ష్య సాధనకు అండగా నిలవడమే తన ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తిలో స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 15 (జనంసాక్షి) :** పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీల అమలుతో పాటు అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి స్వయంగా స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను జారీ చేయడంతో పాటు గతంలో ఎన్నడూ లేని విధంగా స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను అందిస్తున్నామని చెప్పారు.

వనపర్తి జిల్లాలోని 15 మండలాలు, ఐదు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 1,83,013 స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో కొత్తగా 26,465 రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన సన్నబియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేస్తున్న కృషిని చీఫ్ విప్ ప్రశంసించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇప్పటికే సుమారు రూ. 2 వేల కోట్ల నిధులు మంజూరు చేయించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. జిల్లా అభివృద్ధికి కలెక్టర్ ఆదర్శ్ సురభి చేస్తున్న కృషిని కూడా అభినందించారు. వనపర్తి జిల్లా అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

### ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి కార్యక్రమం ప్రారంభం కాగా, వనపర్తిలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

### బార్‌కోడ్‌తో రేషన్ వివరాలు

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతోందన్నారు. వనపర్తిలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించామని, అనంతరం ఆయా మండలాల్లో



కార్డుల పంపిణీ కొనసాగుతుందని తెలిపారు.

జిల్లావ్యాప్తంగా 1,83,013 మంది లబ్ధిదారులకు స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్డుపై ఉన్న బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా రేషన్ షాపు వివరాలు, లబ్ధిదారులకు అందే రేషన్ వివరాలతో పాటు ఇతర సంబంధిత సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, పౌరసరఫరాల డీఎం ఆంజనేయులు, వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమోదిని, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, లబ్ధిదారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# లడ్డూ ప్రసాదమేదీ?



- ఈవోను ప్రశ్నించిన భక్తులు..!
- వరంగల్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద నిరసన

**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 15 (జనం సాక్షి) :** ప్రతి శనివారం భక్తులకు అందించేటువంటి లడ్డు ప్రసాదం ఏది? అని భక్తులు ప్రశ్నించిన సంఘటన వరంగల్ నగరంలోని రామన్నపేట శ్రీ బాలానగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద శనివారం చోటుచేసుకుంది. ఎంతో మహిమాన్వితమైనటువంటి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వచ్చే భక్తుల సంఖ్య దినదినం పెరుగుతుంది. ఈ క్రమంలో పవిత్ర శ్రావణమాసం సందర్భంగా శనివారం నాడు వందలాదిగా వచ్చినటువంటి భక్తులకు ఇక్కడ ప్రతి శనివారం ఇచ్చేటువంటి లడ్డు ప్రసాదం ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు మూడు సంవత్సరాలుగా శ్రీనివాస పద్మావతి సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా ఇక్కడ భక్తులకు ఉచిత లడ్డు ప్రసాదాన్ని అందిస్తున్నారు. సుమారు 300 మంది భక్తులు నెలకు 400 రూపాయల చొప్పున వేసుకొని తమ ట్రస్టు ద్వారా ఈ ఉచిత లడ్డు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి అత్యంత ప్రీతికరమైనటువంటి లడ్డు ప్రసాదం గత కొన్ని రోజులుగా ఇవ్వకుండా ఆపేశారు. దీంతో భక్తులు తమ నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా సంబంధిత ఈవోతో ఫోన్లో మాట్లాడగా పర్మిషన్ తీసుకొని లడ్డు ప్రసాదాన్ని పంచాలని చెప్పినట్లు భక్తులు తెలిపారు. ఎండోమెంట్ వాళ్లు లడ్డు ప్రసాదం పెట్టరు, లడ్డు ప్రసాదం పెట్టే భక్తులను పెట్టనీయరు అంటూ ఈ సందర్భంగా భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల, ట్రస్ట్ సభ్యుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నటువంటి సంబంధిత అధికారులు ఇప్పటికైనా దేవాలయంలో భక్తుల కోసం ఉచితంగా పంపిణీ చేస్తున్న లడ్డు ప్రసాదాన్ని కొనసాగించాలని కోరుతున్నారు.

# ఖిలా వరంగల్‌లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఎగరవేసిన మంత్రి కొండ సురేఖ
- స్వాతంత్ర సమరయోధులకు సన్మానం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 15 (జనం సాక్షి) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఖిలా వరంగల్ కుష్ మహల్ ప్రాంగణంలో శనివారం 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరు కాగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీసీపీ అంకిత్ కుమార్,డి ఎఫ్ ఓ నిఖిత, ప్రజా ప్రతినిధులు,జిల్లా అధికారులు, ప్రజలు, స్కూల్ పిల్లలు హాజరయ్యారు.తొలుత మంత్రి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ గేయాలాపన అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు.అనంతరం పోలీసు పరేడ్‌ను మంత్రి పరిశీలించారు.మంత్రి జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిపై జిల్లా ప్రగతి నివేదికను మంత్రి సందేశం ప్రజలకు వివరించారు. తదుపరి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను మంత్రి కొండా సురేఖ తిలకించారు.అనంతరం స్వాతంత్ర్య సమర యోధులను పర్యావరణ , అటవీ మరియు దేవాదాయశాఖ మంత్రి వర్యులు, జిల్లా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పూల మాలలు, శాలువాల తో సన్మానించారు.ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల డబుల్ బెడ్ రూంలు అడగగా అడిగిన వెంటనే మంత్రివర్యులు హామీ ఇవ్వడమైనది. అందుకు ప్రాంగణం అంతా కరతాళ ధ్వనులతో మారుమ్రోగాయి..ఉత్తమ అధికారులు, ఉద్యోగస్తులకు మంత్రి చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందించడమైనదిఅనంతరం వివిధ శాఖల చే ఏర్పాటు చేసిన స్టాల్స్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, తదితరులు మంత్రితోపాటు సందర్శించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసులు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, ఆగస్టు 15(జనంసాక్షి) :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు, సిబ్బందికి, విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, భవిష్యత్తులో దేశానికి మంచి పౌరులుగా ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్, స్థానిక సంస్థలు జి సంపత్ రావు, ఆర్డీఓ కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి షా ఫైజల్ హుస్సేనీ, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎండి రఫిక్, కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్, కలెక్టరేట్ విభాగాల పర్యవేక్షకులు, కలెక్టరేట్ కాంప్లెక్స్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అడవిలోకి ఆవుల ప్రవేశంపై ఫారెస్ట్ శాఖ వైఖరిపై ప్రశ్నలు

- ఆవుల ఆకలి తీర్చేదెలా..? ఫారెస్ట్ శాఖ ఆంక్షలతో పశుపోషకుల ఇబ్బందులు...




**రెబ్బెన,ఆగస్టు15(జనం సాక్షి):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం రాజారం గ్రామపంచాయతీ పరిధిలో పశు పోషకులు తమ ఆవులను మేపేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అడవుల్లో పశువులు మేతకు వెళ్లకూడదని ఫారెస్ట్ శాఖ ఆంక్షలు విధిస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు సరిపడా మేత వనరులు ఎక్కడ ఉన్నాయనే ప్రశ్నకు స్పష్టమైన పరిష్కారం కనిపించడం లేదని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవుల్లో సహజంగా లభించే గడ్డి, పచ్చికపై ఆధారపడే పశువులను పూర్తిగా అడ్డుకోవడం వల్ల వాటి పోషణపై ప్రభావం పడుతోందని వారు చెబుతున్నారు. అయితే అటవీ సంరక్షణ, మొక్కల రక్షణ పేరుతో పశువుల ప్రవేశాన్ని నియంత్రిస్తున్న ఫారెస్ట్ శాఖ ముందుగా ప్రత్యామ్నాయ మేత వనరులు, పశుపోషకులకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు...

### ఆంక్షలు మాత్రమే కాదు.. పరిష్కారం చూపాలి

పశువులను అడవిలోకి రానివ్వకపోవడం ఒక్కటే పరిష్కారం కాదని, గ్రామాల్లో పశువుల మేత కోసం ప్రత్యేక ప్రాంతాలను ఏర్పాటు చేయడం, అవసరమైన మేత సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని పశు పోషకులు కోరుతున్నారు. అటవీ సంరక్షణతో పాటు గ్రామీణ ప్రజల జీవనాధారమైన పశు పోషణను కూడా పరిగణనలోకి తీసుకుని ఫారెస్ట్ అధికారులు మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఫారెస్ట్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి.. పశుపోషకుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతారా? అనేది వేచి చూడాలి.

# ఆదిలాబాద్‌లో చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం



**మావల ఆగస్టు 16( జనం సాక్షి):** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ చెన్నై షాపింగ్ మాల్ నూతన శాఖను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, నగర ప్రముఖులు, చెన్నై షాపింగ్ మాల్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆదిలాబాద్‌లో ప్రముఖ వ్యాపార సంస్థలు తమ శాఖలను ఏర్పాటు చేయడం జిల్లా ఆర్థికాభివృద్ధికి మంచి సూచిక అని అన్నారు. చెన్నై షాపింగ్ మాల్ వంటి సంస్థలు జిల్లాలో సేవలు ప్రారంభించడం వల్ల ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు, ఆధునిక డిజైన్లు, విభిన్న కలెక్షన్లు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దీంతో ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడమే కాకుండా, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, చెన్నై షాపింగ్ మాల్ ప్రతినిధులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణ రైజింగ్ 2047తో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతాం
- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అభివృద్ధి, సంక్షేమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని, తెలంగాణ రైజింగ్ 2047తో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతామని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, తెలంగాణ రైజింగ్ 2047 విజన్ తో రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలబెడతామని చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం అమలు చేస్తున్నామని, జిల్లాలో 223 గ్రామాల్లో 53,763 దరఖాస్తులు స్వీకరించి విచారణ చేస్తున్నామని తెలిపారు. 70 గ్రామాల్లో రీ సర్వే పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల కింద జిల్లాకు 4,586 ఇళ్లు మంజూరు కాగా 797 ఇళ్లు పూర్తయ్యాయని, రూ.87.04 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రైతు సంక్షేమంలో భాగంగా రుణమాఫీ కింద 29,683 మంది రైతులకు రూ.299.34 కోట్లు, రైతు భరోసా కింద 1,27,151 మందికి రూ.144.93 కోట్లు అందించినట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో 2.19 కోట్ల మంది లబ్ధి పొందారని, గ్యాస్ పథకం కింద 68,373 మందికి రూ.500కే సిలిండర్ ఇస్తున్నామని చెప్పారు. గృహజ్యోతి కింద 58,298 మందికి జీరో బిల్లులు ఇచ్చి రూ.50.86 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో నాణ్యత పెంచామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, జిల్లా ఆస్పత్రిలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్ సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చామని అన్నారు. చేయూత పింఛన్ల ద్వారా 54,482 మందికి ప్రతి నెలా రూ.13.05 కోట్లు అందిస్తున్నామని వివరించారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామసభలు నిర్వహించి ప్రజల అవసరాల మేరకు పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు.అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, ఫోటో ఎగ్జిబిషన్ సందర్శన జరిగాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, అదనపు కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మానుకోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 15 (జనం సాక్షి):** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ గ్రౌండ్స్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందని తెలిపారు. జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. దేశ స్వాతంత్ర్యం కోసం వారు చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. క.జి.బి.వి కేసముద్రం, టీజీఎస్ఆర్ఎస్, కె.జి.బి.వి చిన్నగూడూరు, అనంతారం మోడల్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చాయి. విద్యార్థుల ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

అలాగే జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ స్నేహ శబరీష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ప్రజలకు, ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాల య ప్రాంగణంలోనూ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ స్నేహ శబరీష్ జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ పురుషోత్తం, డీఆర్ఓ నాగవాణి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కన్నుల పండువగా స్వాతంత్ర్య వేడుకలు

- ఆకట్టుకున్న సాంస్కృతిక సంబురాలు



**నిర్మల్ బ్యూరో ,ఆగస్టు 15: (జనంసాక్షి) :** నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ వేముల వీరేశం ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ గీతం, గేయాలాపన, తెలంగాణ రాష్ట్ర గీతంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అధికారుల సమష్టి కృషితో నిర్మల్ జిల్లా అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది మరింత ఉత్సాహంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రభుత్వ విప్, కలెక్టర్, ఎమ్మెల్యేలు ప్రశంసా పత్రాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను కూడా అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శనను తిలకించిన అధికారులు, ప్రజాప్రతినిధులు స్టాళ్లను సందర్శించారు. పోలీస్ పరేడ్ ఆకట్టుకుంది. జిల్లా మహిళా సంఘాలకు మంజూరైన రూ.50 కోట్ల విలువైన చెక్కులను ఈ సందర్భంగా అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఏఎస్పీ సాయి కిరణ్, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ పాల్గొన్నారు.

# గూడూరులో 500 మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ



**గూడూరు, ఆగస్టు15 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో 80వ,స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని 500మీటర్ల భారీ జాతీయ జెండాతో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. గూడూరు సీఐ వర్స వినయ్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈకార్యక్రమానికి పోలీసులు ప్రజలు,యువత, అధికారులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.గూడూరు పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని సీఐ వర్స వినయ్ కుమార్, ఎస్ఐ చిర్ర రమేష్ బాబు జెండాను ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ 500మీటర్ల జాతీయ జెండాను 1000మంది విద్యార్థిని, విద్యార్థులతో పాటు పోలీసులు, యువత, ప్రజలు, అధికారులు,అధిక సంఖ్యలో హాజరై జాతీయ జెండాను చెత్తో పట్టుకొని అరవింద హైస్కూల్ నుండి నేషనల్ హైవే 265 రహదారిపై ర్యాలీ తీయడం పట్ల గూడూరు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో గూడూరు, కొత్తగూడ, గంగారాం ఎస్ ఐ లు చిర్ర.రమేష్ బాబు, రాజ్ కుమార్, కోటేశ్వర్, ఫారెస్ట్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# గూడూరు పోలీసులకు ప్రశంస పత్రాలు

**మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 15 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా గూడూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఉత్తమ సేవలు అందించిన సీఐ వినయ్ కుమార్, ఎస్సై గిరిధర్ రెడ్డిలకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రశంస పత్రాలు అందజేశారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయడం తదితర అంశాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ చేతుల మీదుగా వారికి ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులను ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు అభినందించారు.

# ఉత్తమ ఉద్యోగులకు అవార్డు అందజేసిన అదనపు కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 15(జనం సాక్షి) :** 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉద్యోగులను గుర్తించి వారికి జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పరేడ్ గ్రౌండ్ లో ఉత్తమ ఉద్యోగులకు అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ఉత్తమ ఉద్యోగుల గ్రహీతలుగా జిల్లాలోని పరకాల మండల పరిషత్ కార్యాలయంలో వి బి జి రామ్ జి పథకంలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ సుమలత మండలంలోని నాగారం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ గడ్డం కోమల ను ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి జిల్లా అదనపు కలెక్టర్ రవి చేతుల మీదుగా అవార్డులు ప్రధానం చేయడం జరిగింది. అనంతరం ఉద్యోగ విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వారిని గుర్తించి ఈ అవార్డులు అందజేయడం జరిగిందని తెలియజేశారు

# పులికుంట వాగులో జేసీబీ పట్టివేత



**రెబ్బెన, ఆగస్టు15 (జనం సాక్షి):** రెబ్బెన మండలం పులికుంట శివారులోని వాగులో ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న జేసీబీని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వాగులో ఇసుకను తవ్వుతున్నారన్న సమాచారం అందడంతో అధికారులు అక్కడికి చేరుకున్నారు. తనిఖీల్లో ఇసుక తవ్వకాలకు ఉపయోగిస్తున్న జేసీబీని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టడంపై అధికారులు చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు ఇసుక అక్రమ తవ్వకాలతో వాగు స్వరూపం దెబ్బతినడంతో పాటు సహజ నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
16 ఆగస్టు 2026

# అవినీతి లేకుండా పారదర్శకంగా రేషన్ పంపిణీ

- స్మార్ట్ కార్డులతో లబ్ధిదారులకు తప్పనున్న ఇబ్బందులు..?
- మార్పులు చేర్పులు మరింత సులభం
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమం ఆపలేదు
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని కాంచనంగా ప్రారంభించిన రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్ట్ 15 (జనం సాక్షి) : ఇకపై రేషన్ పంపిణీ వ్యవస్థ మరింత సులభతరం కానున్నదని, అత్యంత పారదర్శకంగా ఎలాంటి అవినీతికి తావు లేకుండా రేషన్ పంపిణీ వ్యవస్థకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, మహబూబ్ నగర్ కలెక్టర్ కుష్బూ గుప్తా తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డుల జారీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు జారీ కాలేదని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా కోటీ ఐదు లక్షల స్మార్ట్ కొత్త రేషన్ కార్డులను జారీ చేసినట్లు తెలిపారు. కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం ద్వారా అదనంగా సన్నబియ్యం అందించే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో కొత్తగా మంజూరు చేసిన కార్డులతో కలిపి మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 2,79,523 కు చేరిందన్నారు. వీటితో 9,61,377 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు.

## డిజిటల్ రేషన్ కార్డులతో పారదర్శకత

సాంకేతికతను వినియోగించుకుని రేషన్ కార్డులను స్మార్ట్ కార్డులుగా మార్చినట్లు మంత్రి తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాల్లో మార్పులు, కొత్త సభ్యుల చేరిక, వివాహం అనంతరం పేర్ల మార్పు వంటి ప్రక్రియలను మరింత సులభతరం చేయడమే స్మార్ట్ రేషన్ కార్డుల ప్రధాన ఉద్దేశమన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుతో సేవలు మరింత సులభం

దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆహార భద్రత, ఆరోగ్య భద్రతకు రేషన్ కార్డు ఎంతో కీలకమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి 2023 వరకు కొత్త రేషన్ కార్డులు జారీ చేయలేదని, కుటుంబంలో కొత్తగా చేరిన సభ్యుల పేర్లను కూడా చేర్చుకునే అవకాశం లేక అనేక మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యారని తెలిపారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీకి చర్యలు చేపట్టిందన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 63,367 రేషన్ కార్డులు ఉన్నాయని, వీటిలో సుమారు 20వేల కొత్త రేషన్ కార్డులు ఉన్నాయని చెప్పారు.

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కోటికి పైగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కార్డులో నమోదైన కుటుంబ సభ్యుల వివరాలను ఎప్పుడైనా సులభంగా పరిశీలించుకోవచ్చన్నారు. పేర్లు చేర్చడం లేదా తొలగించడం వంటి వివరాలను కూడా తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. దీనివల్ల లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందని, రేషన్ డీలర్లకు కూడా వివరాలను స్పష్టంగా తెలియజేయడం సులభమవుతుందని తెలిపారు. లబ్ధిదారులు స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మేయర్ జి. మమత, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ మూడావత్ బాలకోటి, డి. ఎస్.సి.ఓ గంప శ్రీనివాస్, జిల్లా అధికారులు, స్మార్ట్ రేషన్ కార్డు లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ రవాణా వ్యవస్థ మెరుగుదల ప్రభుత్వ ప్రాధాన్యత



ఖమ్మం/బోనకల్, ఆగస్టు 15 (జనంసాక్షి) : గ్రామీణ రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల రూపురేఖలను మార్చడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు శనివారం పలు కీలక అభివృద్ధి పనులకు వేడుకగా శంఖుస్థాపనలు చేశారు. బోనకల్ మండలంలో రూ. 7.66 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ముఖ్యమైన అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపనలు చేశారు. బోనకల్ మండలం చొప్పకట్లపాలెం గ్రామం నుండి దబ్బాకుపల్లి గ్రామం వరకు రూ. 4 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటీ లింక్ రోడ్డు పనులకు, చొప్పకట్లపాలెం ఎస్సీ కాలనీలో రూ. 1.06 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత రహదారుల (ఇంటర్నల్ సీసీ రోడ్లు) నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. బీటీ రోడ్డు నిర్మాణంతో గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కానున్నాయి. అనంతరం రామాపురం గ్రామం నుండి పాతర్లపాడు వరకు రూ. 2.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు కూడా డిప్యూటీ సీఎం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచుతామని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రహదారుల నిర్మాణంతో గ్రామాలకు మెరుగైన రవాణా వసతులు అందుబాటులోకి వస్తుండటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో పిఆర్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ యుగంధర్ రావు, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మారేళ్లపాడు ఎత్తిపోతలకు డెడ్‌లైన్

- ఆగస్టు నెలాఖరులోగా నీరు
- పనుల్లో జాప్యంపై మంత్రి తుమ్మల ఆగ్రహం..
- రైతులకు న్యాయమైన పరిహారం



అశ్వాపురం, ఆగస్టు 15 (జనంసాక్షి) : మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేసి ఆగస్టు నెలాఖరులోగా తుమ్మల చెరువుకు గోదావరి జలాలు అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం కొనసాగితే పెద్ద సంఖ్యలో రైతులకు సాగునీరు అందించే లక్ష్యం దెబ్బతింటుందని, అందువల్ల భూసేకరణ, పైప్‌లైన్ నిర్మాణం, ఇంజినీరింగ్ పనులను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.బిజీకొత్తూరు వద్ద సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్--1ను మంత్రి తుమ్మల, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి పరిశీలించారు. పంప్‌ను ప్రారంభించి గోదావరి జలాలను దిగువకు విడుదల చేశారు.ప్రాజెక్టు పనులను కేవలం పూర్తి చేయడం కాకుండా, అందుబాటులో ఉన్న గోదావరి జలాలను సమర్థంగా వినియోగించి ఎక్కువ మంది రైతులకు ప్రయోజనం కల్పించడమే లక్ష్యంగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులు పూర్తయితే వచ్చే ఏడాది జూన్ నాటికి సుమారు మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. మారేళ్లపాడు పనుల పరిశీలన సందర్భంగా భూసేకరణ, పైప్‌లైన్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందిస్తామని, రైతుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.కొంతమంది రైతుల సమస్యల పరిష్కారం ఆలస్యమైతే వేలాది ఎకరాల సాగుకు నీరు ఆలస్యం అవుతుంది. అదే సమయంలో రైతులకు నష్టం కలగకుండా పరిహారం, పంట నష్టం, భూముల పునరుద్ధరణ వంటి అంశాలను పరిష్కరించడం ద్వారా రెండు వైపుల ప్రయోజనాలను సమన్వయం చేయాలి అని మంత్రి సూచించారు.సాగునీటి ప్రాజెక్టులకు రాజకీయాలకు అతీతంగా ప్రాధాన్యం ఇవ్వాలని, పనులను అడ్డుకునే పరిస్థితులు లేకుండా అధికారులు రైతులతో నిరంతరం సమన్వయం చేయాలని ఆదేశించారు."ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆగస్టు నెలాఖరులోగా మారేళ్లపాడు ఎత్తిపోతల పథకానికి స్విచ్ ఆన్ చేసి రైతులకు సాగునీరు అందిస్తాం" అని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.

## సూర్యాపేట జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నిరంతర కృషి



సూర్యాపేట, ఆగస్టు 15 (జనంసాక్షి) : సూర్యాపేట జిల్లాను రాజకీయాలకు అతీతంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని నూతన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె. నరసింహతో కలిసి మంత్రి పాల్గొన్నారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన మంత్రి ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహాత్మాగాంధీ సారథ్యంలో సాగిన భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో గ్రామ స్వరాజ్యాన్ని సాధించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు జిల్లాలో పెద్ద సంఖ్యలో కుటుంబాలకు చేరుతున్నాయని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఇప్పటివరకు సుమారు 5.68 కోట్ల ప్రయాణాలు జరిగాయని, మహిళలకు రూ.343.87 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా 5.52 లక్షలకుపైగా సిలిండర్లు పంపిణీ చేసి రూ.15.26 కోట్ల సబ్సిడీని జమ చేశామని తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 1.91 లక్షలకుపైగా కుటుంబాలు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్నాయని, 2026 జనవరి నుంచి జూలై వరకు రూ.42.49 కోట్ల సబ్సిడీ అందించినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాకు 12,868 ఇళ్లు కేటాయించగా 7,928 ఇళ్లు మంజూరయ్యాయని, ఆరు వేలకుపైగా ఇళ్లు నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధులు అందించిన స్వేచ్ఛను కాపాడుకోవడం, రాజ్యాంగ విలువలను గౌరవించడం, సామాజిక సామరస్యాన్ని పరిరక్షించడం, దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించడం బాధ్యత అని మంత్రి అన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్, జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, ఆర్డీఓ వేణుమాధవ్, డీఈఓ అశోక్, జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మృతికి కారణమైన నలుగురు నిందితుల అరెస్ట్



బూర్గంపహాడ్, ఆగస్టు 15 (జనంసాక్షి) : అడవి జంతువులను వేటాడేందుకు అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల కారణంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీవో) బానోతు నవీన్ మృతికి కారణమైన నలుగురు నిందితులను బూర్గంపహాడ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 11న రాత్రి నకిరేపేట అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు అడవి జంతువులను విద్యుత్ షాక్‌తో చంపేందుకు అక్రమంగా వైర్లు ఏర్పాటు చేసినట్లు సమాచారం అందింది. దీంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ తన డీఆర్ఓ అనార్కలి, ఇతర సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి నిందితుల కోసం గాలిస్తుండగా అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్ తగిలి నవీన్ అక్కడికక్కడే మృతి చెందారు. డీఆర్ఓ అనార్కలి ఫిర్యాదు మేరకు ఆవుల నాగిరెడ్డి, దాసరి నరేష్, తాటి వీరబాబు తదితరులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు శనివారం లక్ష్మీపురం గ్రామంలోని ఆవుల నాగిరెడ్డి ఇంటి వద్ద ముగ్గురు నిందితులు ఉన్నట్లు సమాచారం అందుకుని అక్కడికి వెళ్లారు. పోలీసులను చూసి పారిపోతుండగా ఆవుల నాగిరెడ్డి, దాసరి నరేష్, తాటి వీరబాబును పట్టుకున్నారు. వారి నుంచి లభించిన సమాచారంతో నాలుగో నిందితుడు కన్నెదారి అనంతయ్యను నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని అతని ఇంటి వద్ద పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఆవుల నాగిరెడ్డి (44), దాసరి నరేష్ (35), తాటి వీరబాబు (28), కన్నెదారి అనంతయ్య (58) ఉన్నారు. నిందితుల వద్ద నుంచి బైండింగ్ వైరు, కర్రలు పాతేందుకు ఉపయోగించే గడ్డపలుగు, ఖాళీ క్వార్టర్ సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అడవి జంతువులను వేటాడేందుకు అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి జంతువులతో పాటు అధికారుల ప్రాణాలకు ముప్పు కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అరెస్టయిన నలుగురు నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించనున్నట్లు పాల్వంచ సీఐ తెలిపారు.

## స్వాతంత్ర్య వేడుకల్లో మహిళా సమైక్యకు అవమానం..?

- అధ్యక్షురాలు ఉండగానే ఏపీఎం జెండావిష్కరణ
- మహిళా సాధికారతపై అధికారుల తీరుపై విమర్శలు



మర్రిగూడ, ఆగస్టు 15 (జనం సాక్షి) : మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన, సామాజిక, రాజకీయ చైతన్యం కోసం ఏర్పాటు చేసిన మహిళా సమైక్యలోనే మహిళలకు ప్రాధాన్యత దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. మర్రిగూడ మహిళా సమైక్య కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మహిళా సమైక్య అధ్యక్షురాలు అక్కడే ఉన్నప్పటికీ, ఆమెతో జెండావిష్కరణ చేయించకుండా ఏపీఎం వెంకటేశ్వర్లు జెండా ఆవిష్కరించడం వివాదానికి దారితీసింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మహిళా సమైక్య అధ్యక్షులే జాతీయ జెండాను ఆవిష్కరించిన సందర్భాలు ఉండగా, మర్రిగూడలో మాత్రం అధ్యక్షురాలిని పక్కనపెట్టడం ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మహిళలకు నాయకత్వ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సంస్థలోనే మహిళా నాయకురాలికి అవకాశం ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవోతో పాటు అధికారులు హాజరై ఉండటం గమనార్హం. అధ్యక్షురాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఏపీఎంతో జెండావిష్కరణ చేయించడానికి కారణమేంటో అధికారులు స్పష్టం చేయాలని మహిళా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. మహిళా సాధికారత మాటల్లో కాకుండా ఆచరణలో కనిపించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

## యాదగిరిగుట్ట ఆలయంలో భక్తుల రద్దీ



యాదగిరిగుట్ట టెంపుల్, ఆగస్టు 15 (జనంసాక్షి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి ఆలయానికి విచ్చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు రెండు గంటల సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి దాదాపు గంట సమయం పట్టింది. ఆర్జిత సేవలు,నిత్యా పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు భక్తులు. రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. నిత్యా కల్యాణం, లడ్డు ప్రసాదం కౌంటర్లు, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కొండక్రింద కల్యాణ కట్ట, పుష్కరిణి, వాహనాల పార్కింగ్ వద్ద భక్తుల సందడి నెలకొంది.

# బాలల అభివృద్ధే భవిష్యత్ సమాజ అభివృద్ధి

- సుధాన్వా దేశ్‌పాండే
- 'బాలమిత్ర' బ్రోచర్ ఆవిష్కరణ..



ముషీరాబాద్, ఆగస్టు 15 (జనం సాక్షి) : బాలలు మంచి విద్యను అభ్యసించి ఆరోగ్యంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని బాలల సంఘం ఆల్ ఇండియా కో-ఆర్డినేటర్ సుధాన్వా దేశ్‌పాండే అన్నారు. ఈ మేరకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం 'బాలమిత్ర' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధాన్వా దేశ్‌పాండే మాట్లాడుతూ.. నేటి పిల్లలే రేపటి పౌరులని, దేశానికి వారు వెన్నెముక వంటి వారని అన్నారు. దేశ, సమాజ అభివృద్ధితో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణలో భవిష్యత్ తరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. బాలల సమస్యలు, వారి అభివృద్ధి, ఆరోగ్యం తదితర అంశాలపై పనిచేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని కోరారు. అయితే విద్యార్థుల సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా విధానానికి విఘాతం కలిగించే విధంగా విద్యా రంగంలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ బాలసాహితీవేత్త, బాలసాహిత్య అవార్డు గ్రహీత, మెజీషియన్ చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ.. చిన్నారుల మనోభావాలకు అనుగుణంగా సిలబస్ రూపొందించినప్పుడే వారు సంపూర్ణంగా ఎదగగలరని అన్నారు. విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు మస్తాన్‌రావు పెసల మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలు లేని, కుల, మత, ప్రాంతీయ వివక్షలకు తావులేని సమసమాజ నిర్మాణానికి చిన్నారుల్లోనే మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే సంక్షేమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రముఖ సైన్స్ పాపులరైజర్ వలుగొండ వెంకటేశ్వర్లు చిన్నారులకు పలు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించి చూపించారు. ఇటువంటి ప్రయోగాల ద్వారా పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు వారిని ప్రోత్సహించాలని, దేశ భవిష్యత్తుకు తోడ్పడేలా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి బాలమిత్ర తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎన్. సోమయ్య అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయ నాయకురాలు అంకమ్మ, ట్యూషన్ కోఆర్డినేటర్ మహేష్ దుర్గే, ఆఫీస్ సెక్రటరీ బ్రాహ్మణి, బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ట్యూషన్ సెంటర్ల ఉపాధ్యాయులు దీప, కవిత, ప్రవళిక, శిరీష, శివకుమార్‌తో పాటు వివిధ ట్యూషన్ సెంటర్లకు చెందిన సుమారు 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను వెల్దుర్తిలో ఏర్పాటు చేయాలి



వెల్దుర్తి, ఆగస్టు 15 (జనం సాక్షి) : వెల్దుర్తి మండల కేంద్రానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను వెల్దుర్తిలోనే ఏర్పాటు చేయాలని శనివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకట స్వామికి మండల సర్పంచులు వెల్దుర్తిలో రిలే దీక్షలు చేపడుతున్న యువకులు వినతిపత్రం సమర్పించారు. వెల్దుర్తి మండలం లో 26 గ్రామాలు ఉన్నాయని అన్ని గ్రామాలకు పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు అనుకూలంగా వెల్దుర్తి ఉంటుందని మంత్రికి వివరించారు.స్పందించిన మంత్రిఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి స్థానికంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ రాజిరెడ్డి సర్పంచులు ఆదర్శ్ నరసింహ రెడ్డి యువకులు శేఖర్ గౌడ్ చందు నవీన్ పటేల్ పవన్ ముకుందంలు పాల్గొన్నారు.




# నాలుగో రోజూ నిఫ్టీకి నష్టాలే

**ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.508 కోట్లు**

**డీఐఐ కొనుగోళ్లు: రూ.356 కోట్లు**

అమెరికా- ఇరాన్ అనిశ్చితుల వల్ల ముడిచమురు ధర ఇంకా అధికంగానే ఉండటంతో, దేశీయ సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. వరుసగా నాలుగో రోజూ నిఫ్టీకి నష్టాలు తప్పలేదు. డాలర్‌తో పోలిస్తే రూపాయి 3 పైసలు తగ్గి 95.42 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 87 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.72,000 కోట్లు తగ్గి రూ.492.16 లక్షల కోట్ల (5.16 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ 176 పాయింట్ల నష్టంతో (క్రితం ముగింపు 78,079.96 పాయింట్లతో పోల్చితే) 77,903.43 వద్ద ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే ఉన్న సూచీ, ఇంట్రాడేలో 77,684.37 వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 70.71 పాయింట్ల నష్టంతో 78,009.25 దగ్గర స్థిరపడింది. నిఫ్టీ 29.85 పాయింట్లు తగ్గి 24,366 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,296.80- 24,405.20 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 23 కుదేలయ్యాయి. ఏషియన్ పెయింట్స్ 1.69%, ఇండిగో 1.39%, ఎన్‌టీపీసీ 1.19%, పవర్‌గ్రిడ్ 1.08%, ఎస్‌బీఐ 1.04%, హెచ్‌సీఎల్ టెక్ 1.03% నష్టపోయాయి. భారతీ ఎయిర్‌టెల్ 2.53%, అదానీ పోర్ట్స్ 1.82%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.57%, టైటన్ 0.56% రాణించాయి. 2026-27లో ఆదాయం 20 % పైగా వృద్ధి చెందుతుందని అంచనా వేసిన నేపథ్యం లో, అపోలో హాస్పిటల్స్ షేరు బీఎస్ఈలో 3.84% లాభపడి రూ.8925 వద్ద స్థిరపడింది.అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యుజియా ఫార్మా స్పెషాలిటీస్‌కు చెందిన తెలంగాణ తయారీ కేంద్రం యూనిట్-1లో అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) తనిఖీలు నిర్వహించింది. 4 లోపాలను గుర్తించి, హెచ్చరిక లేఖ పంపింది.



వెల్లడించని విదేశీ ఆస్తుల కోసం నేటి నుంచి

## వన్‌టైమ్ విండో!




**న్యూఢిల్లీ:**విదేశీ ఆస్తుల వివరాలను రిటర్నులో వెల్లడించని పన్నుదారుల కోసం 'వన్‌టైమ్ విండో'ను అందుబాటులోకి తేనుంది. ఈ విండో ఆగస్టు 16న ప్రారంభమై.. డిసెంబర్ 31న ముగియనుంది. ఈ ఏడాది మార్చి 31 నాటికి పన్ను చెల్లింపుదారుల పేరిట ఉన్న బ్యాంకు ఖాతాలు, ఆభరణాలు, స్థిరాస్తులు, లిస్టెడ్, అన్‌లిస్టెడ్ సెక్యూరిటీలు వంటి విదేశీ ఆస్తులను ఈ పథకం కింద ఐటీ శాఖ పరిగణనలోకి తీసుకోనుంది. రూ.కోటి వరకు విదేశీ ఆస్తులు లేదా ఆదాయం ఉండి.. ఆ వివరాలను పన్ను రిటర్నులో దాఖలు చేయని వారికి ఇది వర్తిస్తుంది. అదేవిధంగా రూ.5 కోట్ల వరకు విదేశీ పెట్టుబడులు ఉండి, ఆ వివరాలు వెల్లడించని వారికి కూడా ఈ అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఆగస్టు 16 నుంచి డిసెంబర్ 31 మధ్య ఫారమ్-1 ద్వారా ఎలక్ట్రానిక్ పద్ధతిలో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది.రూ.కోటి వరకు ఆస్తులు లేదా ఆదాయం ఉండి ఐటీ రిటర్నులు దాఖలు చేయనివారు మొత్తం 60 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది (30 శాతం పన్నుతో పాటు, దానికి సమానమైన 30 శాతం అదనపు పన్ను). రూ.5 కోట్ల విదేశీ ఆదాయంపై పన్ను చెల్లించినప్పటికీ, ఎన్ఆర్ఐగా ఉన్న సమయంలో ఆయా ఆస్తులను ఐటీ రిటర్నులో దాఖలు చేయనివారు రూ.1 లక్ష ఫ్లాట్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. పన్నుదారులు ఫారమ్-1 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించిన అనంతరం.. చెల్లించాల్సిన మొత్తాన్ని ఫారమ్-2 ద్వారా పన్నుదారులకు ఐటీ శాఖ తెలియజేస్తుంది. నోటీసు అందిన 2 నెలల్లోపు ఈ మొత్తాన్ని చెల్లించాలి. ఒకవేళ చెల్లింపులు ఆలస్యమైతే నెలకు 1 శాతం చొప్పున అదనపు వడ్డీ భారం పడుతుది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం లేదా నల్లధనం చట్టాల కింద ఇప్పటికే కేసులు, విచారణ ఎదుర్కొంటున్న ఆస్తులకు ఈ స్కీమ్ వర్తించదు.

### భారీగా పెరిగిన బీడీఎల్ లాభం

హైదరాబాద్: రక్షణ రంగ ఉత్పత్తుల సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), జూన్ త్రైమాసికంలో రూ.675.68 కోట్ల మొత్తం ఆదాయం, రూ.118.79 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2025-26 ఇదే కాలంలో ఆదాయం రూ.231.09 కోట్లు, నికర లాభం రూ.18.34 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే, ఈసారి ఆదాయంలో 101.82%, నికర లాభంలో 547.36% వృద్ధి నమోదైంది. 2025-26 సంవత్సరానికి రూ.5 ముఖ విలువ గల ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.0.40 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రతిపాదించింది.

### తగ్గిన నాట్కో లాభం

హైదరాబాద్: ఔషధ తయారీ రంగంలోని నాట్కో ఫార్మా, జూన్ త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.794.40 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.206 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2025-26 ఇదే కాలంలో ఆదాయం రూ.1,390.60 కోట్లు, నికర లాభం రూ.480.30 కోట్లుగా ఉన్నాయి. ఏడాది ప్రాతిపదికన చూస్తే.. ఆదాయం 42.87%, నికర లాభం 57.01% తగ్గాయి. అమెరికాలో లెనాలిడోమైడ్ విక్రయాల రాబడి తగ్గడమే లాభాదాయల క్షీణతకు కారణమని సంస్థ తెలిపింది. రూ.2 ముఖవిలువగల ఒక్కో షేరుపై రూ.1.50 (75%) డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. ఈక్విటీ లేదా ఇతర సెక్యూరిటీల జారీ ద్వారా రూ.2,000 కోట్లు సమీకరించే ప్రయత్నాలకు బోర్డు ఆమోదం తెలిపింది.




### మహీంద్రా కొత్త ట్రక్

ముంబయి: దేశంలో ఛార్జింగ్ సదుపాయాలు తగినంతగా విస్తరించాక, అధిక దూరాలకు సరకు తీసుకెళ్లగలిగే హెవీ డ్యూటీ విద్యుత్తు ట్రక్కులను ఆవిష్కరిస్తామని మహీంద్రా గ్రూప్ ఉన్నతాధికారి వినోద్ సహాయ్ తెలిపారు. ఒకసారి ఛార్జి చేస్తే కనీసం 500 కిలోమీటర్లు ప్రయాణించేలా ఆవిష్కరించాలన్నది ధ్యేయమన్నారు. కొత్తతరం ట్రక్కు బ్లేజో ఐ-టీఆర్‌కే ను విపణిలోకి విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హెవీ ట్రక్ విభాగంలో గతంలో ఉన్న 5% మార్కెట్ వాటాను తిరిగి సాధించడమే లక్ష్యంగా నూతన వాహనాలు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఉత్తమ ఇంధన సామర్థ్యం, అధిక పనితీరు కలిగిన పవర్‌ట్రెయిన్, అధునాతన కనెక్టెడ్ టెక్నాలజీ, పరిశ్రమలోనే ప్రముఖ అప్‌టైమ్ గ్యారంటీ వంటి ఫీచర్లు బ్లేజోలో ఉన్నాయని పేర్కొంది. వీటి యజమానులు ఉత్పాదకతను మెరుగుపరచుకుని, నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవచ్చని..ఆదాయాన్ని పెంచుకోగలరని సంస్థ తెలిపింది.



### స్వల్పంగా తగ్గిన టోకు ధరలు

దిల్లీ: దేశీయంగా టోకు ధరలు అధికంగానే ఉన్నా, జూన్‌తో పోలిస్తే గత నెలలో స్వల్పంగా తగ్గాయి. జులైలో టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 9.78 శాతంగా నమోదైంది. జూన్‌లో ఇది 9.87 శాతంగా ఉంది. కాగా.. గత 9 నెలల్లో టోకు ద్రవ్యోల్బణం నెల ప్రాతిపదికన తగ్గడం ఇప్పుడే. ఇంధనం, ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణమని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంధనం, విద్యుత్ రంగాల టోకు ద్రవ్యోల్బణం జూన్‌లోని 27.41% నుంచి జులైలో 20.05 శాతానికి తగ్గింది. ఆహార వస్తువుల ధరల్లో పెరుగుదల 5.49% నుంచి 5.44 శాతానికి తగ్గింది. తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 7.48% నుంచి 8.29 శాతానికి పెరిగింది. పీపీఐ యథాతథం..: రాబోయే అయిదేళ్లలో డబ్ల్యూపీఐ స్థానంలో ప్రభుత్వం తేవాలనుకుంటున్న అవుట్‌పుట్ ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్ (పీపీఐ) జూన్‌తో పోలిస్తే మార్పు లేకుండా 9.6% వద్దే ఉంది. ఈ సూచీ ప్రకారం తయారీ, గనుల రంగాల్లో తక్కువ ద్రవ్యోల్బణం ఉండగా.. వ్యవసాయం, విద్యుత్‌లో అధిక ద్రవ్యోల్బణం నమోదైంది. రానున్న నెలల్లో టోకు ధరలు ఇంకా తగ్గొచ్చని బార్‌క్లేస్ తన పరిశోధనా నివేదికలో తెలిపింది.



**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

| ₹ 1,54,236 (22 క్యారెట్లు) | ₹ 1,67,180 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్


₹ 2,40,000

# విదేశీ నిధులు.. రూ.5.4 లక్షల కోట్లు

**ఆగస్టు 31 వరకే రాయితీ స్వాప్**

**గడువు తగ్గించిన ఆర్‌బీఐ**

**రూపాయి పతనాన్ని అడ్డుకుని, దేశంలోకి డాలర్ల ప్రవాహాన్ని వేగంగా పెంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రవేశ పెట్టిన రాయితీ స్వాప్ పథ కానికి అమిత ఆదరణ లభించింది. ప్రవాసులు జమ చేసే విదేశీ కరెన్సీ డిపాజిట్లపై వడ్డీ రేట్లకు గరిష్ఠ పరిమితులను సడలించడంతో పాటు, కొన్ని కాలపరిమి తులపై అయ్యే పూర్తి హెడ్జింగ్ ఖర్చును తానే భరిస్తానని ప్రకటించింది**



**ముంబయి:** ఈ పథకం కింద ఆగస్టు 13 వరకు 56.84 బిలియన్ డాలర్ల నిధులు వచ్చాయి. ఫారిన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ బ్యాంక్ (ఎఫ్‌సీఎన్ఆర్-బి) డిపాజిట్ ఖాతాల్లో మూడేళ్లలోపు డిపాజిట్లపై గ్లోబల్ బెంచ్‌మార్క్ రేటు (సుమారు 3.63%) కంటే 2.5% అదనపు వడ్డీ అందించేందుకు బ్యాంకులకు అనుమతి లభించింది. దీంతో ఎన్ఆర్ఐలు మూడేళ్లలోపు డిపాజిట్లపై గరిష్ఠంగా 6.13% వరకు రాబడి పొందనున్నారు. మూడేళ్లు పైబడిన డిపాజిట్లపై వడ్డీ పరిమితిని ఆర్‌బీఐ పూర్తిగా తొలగించడంతో విదేశీ డిపాజిట్లను ఆకర్షించేందుకు బ్యాంకులు భారీగా వడ్డీ రేట్లు పెంచాయి. గతంలో సెప్టెంబరు 30 వరకు ఈ పెట్టుబడులను అనుమతించాలని నిర్ణయించినా, పెట్టుబడులు భారీగా తరలి వచ్చినందున ఆగస్టు 31 వరకు చేసే డిపాజిట్లకే ఈ ప్రయోజనాలు వర్తిస్తాయని ఆర్‌బీఐ శుక్రవారం తెలిపింది. ఈ డిపాజిట్లకు సంబంధించిన స్వాప్‌లను 2026 సెప్టెంబరు 11 వరకు ఆర్‌బీఐ వద్ద పొందొచ్చు. ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్, ఓవర్సీస్ ఫారిన్ కరెన్సీ బారోయింగ్స్‌కు సంబంధించిన పథకం మాత్రం 2026 డిసెంబరు 31 వరకు కొనసాగుతుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

**రూ.9 లక్షల కోట్లకు చేరొచ్చు: కేర్‌ఎడ్జ్**

2026-27లో 90-95 బిలియన్ డాలర్ల (రూ.8.55-9 లక్షల కోట్ల) విదేశీ నిధులు దేశంలోకి వచ్చే అవకాశం ఉందని రేటింగ్ సంస్థ కేర్‌ఎడ్జ్ నివేదికలో పేర్కొంది. ఎఫ్‌సీఎన్ఆర్ (బీ) డిపాజిట్లు, విదేశీ వాణిజ్య రుణాలు (ఈసీబీ), విదేశీ కరెన్సీ రుణాల (ఓఎఫ్‌సీబీ) కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తీసుకొచ్చిన కన్సెషనల్ స్వాప్ విండోస్ ఇందుకు ఉపకరిస్తుందని తెలిపింది. ఎఫ్‌సీఎన్ఆర్ (బీ) డిపాజిట్ల ద్వారా 80 బిలియన్ డాలర్లు (రూ.7.60 లక్షల కోట్లు), ఈసీబీలు, ఓఎఫ్‌సీబీల ద్వారా మరో 10-15 బి.డాలర్లు (సుమారు రూ.95,000-1.43 లక్షల కోట్లు) వస్తాయన్నది అంచనా. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో కేవలం 2 బి.డాలర్లుగా ఉన్న భారత మూలధన ఖాతా మిగులు, ఈ చర్యల వల్ల 2026-27లో 108 బి.డాలర్లకు చేరనుంది. ఆర్‌బీఐ గడువు తగ్గించకముందు ఈ అంచనా వెలువడింది.

## భారత్-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం

పునాదిగా నిలుస్తోందని రూబియో పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం కేవలం రెండు దేశాల ప్రయోజనాలకే పరిమితం కాదని, అంతకు మించి విస్తరించి ఉందని స్పష్టం చేశారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో దిల్లీతో పరస్పర సహకారానికి వాషింగ్టన్ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. భవిష్యత్తులోనూ భారత్‌తో కలిసి పనిచేసేందుకు అమెరికా ఎదురు చూస్తోందని తెలిపారు.



ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ భారత్‌కు, ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహ బంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సింగపూర్ ప్రభుత్వం భారత్‌తో తమకున్న వ్యూహాత్మక, ఆర్థిక బంధాన్ని గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా ప్రత్యేక సందేశాన్ని విడుదల చేస్తూ.. ఇరు దేశాల మధ్య డిజిటల్ కనెక్టివిటీ, గ్రీన్ ఎనర్జీ, రక్షణ రంగాల్లో భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించింది.




ఆగస్టు 15 సందర్భంగా రూ.5వేల నగదు ప్రోత్సాహం..

## నిజమెంత?

**న్యూఢిల్లీ:**80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ రూ.5 వేల నగదును ప్రోత్సాహకంగా అందిస్తున్నారని, ఇందుకోసం బ్యాంకు వివరాలు తెలపాలంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. అవన్నీ అవాస్తవాలని స్పష్టం చేసింది. అలాంటి మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దని ప్రజలను కోరింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని ఎలాంటి నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించలేదని కేంద్రం స్పష్టం చేసింది. అనుమానిత లింక్‌లను క్లిక్ చేసే ముందు జాగ్రత్తగా ఉండాలని, తెలియని వ్యక్తులతో గానీ, అనధికార వెబ్‌సైట్‌లలో గానీ వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలను పంచుకోవద్దని కోరింది. ఏదైనా సున్నిత సమాచారాన్ని ఎంటర్ చేసేముందు అధికారిక వెబ్‌సైట్‌లను తనిఖీ చేసుకోవాలని సూచించింది. ప్రభుత్వానికి సంబంధించి ఎలాంటి అనుమానిత కంటెంట్ కనిపించినా.. పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగానికి ఫిర్యాదు చేయాలని కోరింది.

## భారత్, పాక్ ప్రజల మధ్య... పరస్పర అపనమ్మకం ఎక్కువే

**అమెరికన్ సంస్థ ప్యూ రిసెర్చ్ సర్వే వెల్లడి**

**వాషింగ్టన్:** భారతీయులు, పాకిస్థానీలలో అత్యధికులు ఒకరినొకరు అతిపెద్ద ముప్పుగా పరిగణిస్తున్నారు. ఇది రెండు పొరుగు దేశాల మధ్య లోతుగా వేళ్లూనుకున్న అపనమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని అమెరికన్ సంస్థ ప్యూ రిసెర్చ్ సర్వే వెల్లడించింది. ఈ సర్వేలో పాల్గొన్న భారతీయ వయోజనులలో 54 శాతం మంది పాకిస్థాన్‌ను తమ అతిపెద్ద రాజకీయ ముప్పుగా అభివర్ణించారు. 21 శాతం మంది చైనాను ప్రమాదంగా పరిగణించారు. 36 శాతం మంది భారతీయులు రష్యా తమ అగ్ర మిత్రదేశమని చెప్పగా, 16 శాతం మంది అమెరికాకు ఆ హోదా ఇచ్చారు. మరోవైపు 43 శాతం మంది పాకిస్థానీలు భారతదేశాన్ని తమ అతిపెద్ద ముప్పుగా భావిస్తున్నారు. 75 శాతం మంది పాకిస్థానీలు చైనాను అత్యంత ముఖ్యమైన మిత్రదేశంగా చూస్తుంటే, 12 శాతం మంది సౌదీ అరేబియాకు మొగ్గు చూపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాకిస్థాన్ సైన్యాధిపతి ఆసిమ్ మునీర్ మధ్య స్నేహ సంబంధాలు ఉన్నప్పటికీ, 15 శాతం మంది పాకిస్థానీలు మాత్రమే అమెరికా పట్ల సానుకూలమైన అభిప్రాయాన్ని వ్యక్తంజేశారు. చైనా పట్లనైతే ఏకంగా 90 శాతం మంది పాకిస్థానీలు సానుకూలత కలిగి ఉన్నారు.శ్రీలంకలో అత్యధికంగా 79 శాతం మంది భారతదేశం పట్ల సానుకూల అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో ఇది 42 శాతంగా, పాకిస్థాన్‌లో 7 శాతంగా ఉంది. శ్రీలంకలో 63 శాతం మంది భారతదేశాన్ని తమ అత్యంత ముఖ్యమైన మిత్రదేశంగా పేర్కొనగా, బంగ్లాదేశీలు, పాకిస్థానీలు భారతదేశాన్ని తమ అతిపెద్ద ముప్పుగా పేర్కొంటున్నారు. అమెరికాలో 45 శాతం మంది అమెరికన్లు భారతదేశాన్ని అనుకూలంగా చూడగా, 50 శాతం మంది వ్యతిరేకంగా చూస్తున్నారు. అక్కడ రిపబ్లికన్ పార్టీ ఓటర్ల కన్నా డెమొక్రటిక్ పార్టీ ఓటర్లు భారత్ పై ఎక్కువ సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు.

## స్వేచ్ఛ అంటే బహుమతి మాత్రమే కాదు.. బాధ్యత కూడా

స్వాతంత్ర్య సమ రయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, వారు అందించిన స్వేచ్ఛను భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించాల్సిన బాధ్యత ప్రస్తుత తరంపై ఉందని ఆయన సందేశం స్పష్టం చేసింది. జాతీయ పతాకాన్ని ఆవిష్కరిం చిన పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించారు. ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ ప్రతి అంశానికీ తన తన ప్రభుత్వమే కారణమన్నట్లుగా క్రెడిట్ తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో ఇప్పటి వరకు జరిగి అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వాల పాత్రను విస్మరించలేమని అన్నారు. ఇక ఆహార హక్కు, విద్యా హక్కు, ఉపాధి హక్కు (ఎంఎన్ఆర్ఈజీఏ) వంటి హక్కుల ఆధారిత చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. ఈ విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పేదలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు అందించేందుకు అప్పటి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అలాంటి ఒక్క హక్కును కూడా ప్రజలకు ఇవ్వలేదని విమర్శించారు. ఎవరు ఏ చట్టం ఎప్పుడు తీసుకొచ్చారో చరిత్రలో స్పష్టంగా నమోదై ఉందని, అందుకే క్రెడిట్ ఎవరిదో ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు.

**స్వాతంత్ర్యం అంటే బ్రిటిష్ పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు: ఖర్గే**

అంతకుముందు ఎక్స్ వేదికగా దేశ ప్రజలకు ఖర్గే స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన అసంఖ్యాక సమరయోధులకు ఘన నివాళులు అర్పించారు. వారి ధైర్యం, త్యాగం, దేశంపై ఉన్న అచంచల విశ్వాసం ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. భారత్ ఎంతో దూరం ప్రయాణించినప్పటికీ, దేశం ముందున్న అనేక ఆకాంక్షలు ఇంకా నెరవేరాల్సి ఉందని ఖర్గే అన్నారు. స్వాతంత్ర్యం అంటే కేవలం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందడం మాత్రమే కాదని వ్యాఖ్యానించారు. దేశ రాజ్యాంగం ప్రతి భారతీయుడికి కల్పించిన సమానత్వం, గౌరవం, న్యాయం, భయంలేకుండా మాట్లాడే స్వేచ్ఛ నిజమైన స్వాతంత్ర్యానికి ప్రతీకలని పేర్కొన్నారు. ఇవే ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులని, పౌరుల హక్కులకు రక్షణ కవచాలని తెలిపారు.

**ప్రజాస్వామ్య సంస్థలకు సవాళ్లు'**

గత పదేళ్లలో దేశ రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సంస్థలు, సామాజిక సామరస్యానికి తీవ్ర సవాళ్లు ఎదురయ్యాయని ఖర్గే విమర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవం వేళ దేశం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. దేశ యువత తమ ఆశయాలను నెరవేర్చుకునేందుకు తగిన అవకాశాలు పొందాలని అన్నారు. రైతుల శ్రమకు గౌరవం, న్యాయం దక్కాలని, మహిళలకు సమానత్వం, సాధికారతతో పాటు దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో సమాన భాగస్వామ్యం కల్పించాలని పేర్కొన్నారు.

**'అందరికీ రాజ్యాంగ హక్కులు దక్కాలి'**

దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, మైనారిటీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వం, సామాజిక న్యాయం పూర్తిస్థాయిలో అందాలని ఖర్గే అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశం ముందుకు తీసుకెళ్లాల్సిన గొప్ప సంకల్పం ఆశ, సమానత్వం, న్యాయం కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుంటూ ప్రతి పౌరుడి హక్కులను పరిరక్షించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

## 1,380 కొత్త జీసీసీలు.. 11.80 లక్షల ఉద్యోగాలు

**7 రాష్ట్రాల ప్రణాళిక ఇదీ: సీబీఆర్ఈ**



**ముంబై:**అయిదేళ్లలో కొత్తగా 1,380 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీలు) ఏర్పాటు ద్వారా 11.8 లక్షల ఉద్యోగాలు సృష్టించే దిశగా దేశంలోని 7 రాష్ట్రాలు అడుగులు వేస్తున్నాయి. ఇందుకోసం ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకున్నాయని స్థిరాస్తి కన్సల్టెంట్ సంస్థ సీబీఆర్ఈ తెలిపింది. ఈ ఏడు రాష్ట్రాల్లో కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, కేరళ, హరియాణా, మధ్యప్రదేశ్ ఉన్నాయి. 'భారత వాణిజ్య స్థిరాస్తి రంగంలో, జీసీసీలకు ప్రత్యేక విధానాలను అధికారికంగా రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చిన వేగం అపూర్వమైనద'ని సీబీఆర్ఈ ఛైర్మన్, సీఈఓ (భారత్, ఆగ్నేయాసియా, పశ్చిమాసియా, ఆఫ్రికా) అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. ప్రోత్సాహకాలు, వేగవంతమైన ఆమోదాలు, దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల కల్పన ద్వారా జీసీసీలను ఆకర్షించేందుకు రాష్ట్రాలు చురుకుగా పోటీ పడుతున్నాయని పేర్కొన్నారు. తమిళనాడు కూడా జీసీసీ ఉద్యోగుల కోసం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టిందని సీబీఆర్ఈ తెలిపింది. జీసీసీ ఎకోసిస్టమ్ అభివృద్ధిని ప్రోత్సహించేందుకు తెలంగాణ, దిల్లీ కూడా విధానపరమైన చర్యలను చేపట్టాయని వెల్లడించింది. సీబీఆర్ఈ నివేదిక ప్రకారం.. 2022 నుంచి 2026 తొలి అర్ధభాగం వరకు భారత్‌లోని 9 నగరాల్లో జీసీసీలు 123 మిలియన్ చదరపు అడుగులకు పైగా కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
16 ఆగస్టు 2026

# కల్తీ బెల్లంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- బంట్వారంలో 7,500 కిలోల కుళ్లిపోయిన బెల్లం స్వాధీనం
- ఆటోలో తరలిస్తుండగా 4 క్వింటాళ్లు పట్టివేత
- దుకాణంలోనూ భారీగా నిల్వలు గుర్తింపు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: టాస్క్‌ఫోర్స్



**బంట్వారం, ఆగస్టు 15 (జనంసాక్షి):** బంట్వారం మండలంలో కల్తీ, కుళ్లిపోయిన బెల్లం నిల్వలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి భారీగా సరుకును స్వాధీనం చేసుకున్నారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో నిబంధనల ఉల్లంఘనలపై టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక నిఘా కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా ఆధ్వర్యంలో బంట్వారం మండలం బోపునారం గ్రామ పరిధిలో తనిఖీలు చేపట్టారు. తాండూరు నుంచి కర్ణాటకకు తరలిస్తున్న ఆటోను తనిఖీ చేయగా సుమారు 4 క్వింటాళ్ల కల్తీ, కుళ్లిపోయిన బెల్లం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో ఉన్న చంద్ పాషా, డ్రైవర్ మొహమ్మద్ కుతుబొద్దీన్‌ను పోలీసులు విచారించగా, వారి దుకాణంలోనూ కల్తీ, కుళ్లిపోయిన బెల్లం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆటోలో లభించిన బెల్లంతో పాటు దుకాణంలో ఉన్న నిల్వలను కలిపి మొత్తం 7,500 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బెల్లాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం బంట్వారం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బెల్లం నిల్వలు ఎక్కడి నుంచి వచ్చాయి, ఎక్కడికి తరలించేందుకు సిద్ధం చేశారు తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా మాట్లాడుతూ కల్తీ, కుళ్లిపోయిన బెల్లం నిల్వలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ సరుకులకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని కోరారు.

# సొంత భవనం లేక.. అద్దె భవనంలోనే ఆగస్టు 15 వేడుకలు

- ఉప్పల్ ఎక్సైజ్ కార్యాలయానికి శాశ్వత భవనం ఎప్పుడు?
- జాతీయ పండుగ వేడుకల నిర్వహణపైనా ప్రశ్నలు



**ఉప్పల్, ఆగస్టు 15 (జనంసాక్షి):** దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్న వేళ.. ఉప్పల్ ఎక్సైజ్ శాఖ కార్యాలయ పరిస్థితి చర్చనీయాంశంగా మారింది. సొంత కార్యాలయ భవనం లేకపోవడంతో అద్దె భవనంలోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. దీంతో జాతీయ పండుగ వేడుకల నిర్వహణకు కూడా అనువైన శాశ్వత ప్రాంగణం లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ శాఖలకు సొంత కార్యాలయాలు ఉండటం వల్ల సిబ్బందికి మెరుగైన వసతులతో పాటు రికార్డుల నిర్వహణ, ప్రజలకు సేవలందించడంలో సౌలభ్యం కలుగుతుంది. అయితే ఉప్పల్ ఎక్సైజ్ కార్యాలయం మాత్రం అద్దె భవనంలో కొనసాగుతుండటంతో స్థలాభావం, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు ఎదురవుతున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

**సొంత భవనం ఎప్పుడు?**

ఉప్పల్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ పరిధి, బాధ్యతలు కూడా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించేందుకు అనువైన శాశ్వత కార్యాలయ భవనం అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి నిధులు కేటాయించి ఆధునిక సౌకర్యాలతో సొంత భవనం నిర్మించాలని కోరుతున్నారు.

**జెండా పండుగకు శాశ్వత ప్రాంగణం లేక..**

స్వాతంత్ర్య దినోత్సవం వంటి జాతీయ పర్వదినాల్లో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం ఆనవాయితీ. అయితే ఉప్పల్ ఎక్సైజ్ శాఖకు సొంత భవనం లేకపోవడంతో వేడుకల నిర్వహణపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ శాఖకు కనీసం జాతీయ పండుగలను గౌరవప్రదంగా నిర్వహించుకునే స్థిరమైన ప్రాంగణం కూడా లేకపోవడం విచారకరమని పలువురు పేర్కొంటున్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖలకు అవసరమైన కార్యాలయ భవనాల ఏర్పాటుపైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఎక్సైజ్ శాఖకు త్వరితగతిన శాశ్వత కార్యాలయ భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



## ట్రినిటీ వైద్య శిబిరానికి విశేష స్పందన

**థైరాయిడ్, బీపీ, షుగర్ పరీక్షలతో ఉచిత వైద్య సేవలు**

**కీసర, ఆగస్టు 15 (జనంసాక్షి):** ప్రజారోగ్య సేవల్లో భాగంగా ట్రినిటీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, పద్మస్ ట్రినిటీ ఐవీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం కుషాయిగూడలోని శ్రీనివాస ఎన్‌క్లేవ్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో భాగంగా థైరాయిడ్, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, దంత, పల్స్ పరీక్షలతో పాటు బరువు, ఎస్‌పీఓ2 పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్ వైద్య సంప్రదింపులు కూడా అందించారు. డాక్టర్ ఎస్.డి.ఎస్.రాజు, డాక్టర్ ప్రగతి నేతృత్వంలోని వైద్య బృందం శిబిరానికి వచ్చిన ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసర మైన వైద్య సూచనలు, చికిత్స అందించింది. ట్రినిటీ హాస్పిటల్ యాజమాన్య బృందం సభ్యులు అమృత్ రాజ్, ఎలిజబెత్, క్యాంప్ మేనేజర్ కార్తిక్ సమన్వయంతో శిబిరం సజావుగా సాగింది. శిబిరం ద్వారా మొత్తం 124 మంది లబ్ధి పొందారు. స్థానికులు ట్రినిటీ హాస్పిటల్ చేపట్టిన సేవా కార్యక్రమాన్ని అభినందించారు. ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ట్రినిటీ హాస్పిటల్ భవిష్యత్తులోనూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## నిమ్స్‌లో ఎంహెచ్ఎం విద్యార్థులకు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డులు

**ఖైరతాబాద్, ఆగస్టు 15 (జనం సాక్షి) :** నిజామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా అకడమిక్స్‌లో ప్రతిభ కనబరిచిన ఎంహెచ్ఎం విద్యార్థులకు ఈ ఏడాది నుంచి బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డులను అందజేయడం పట్ల నిమ్స్ లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ మార్త రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డులను తొలిసారిగా ప్రవేశపెట్టేందుకు చొరవ చూపిన నిమ్స్ డైరెక్టర్ ప్రొ. రాహుల్ దేవరాజ్, డీన్ ప్రొ.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొ.పరం జ్యోతి, మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, హెచ్వోడీ డా. లక్ష్మీ భాస్కర్‌లకు డాక్టర్ మార్త రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. నిమ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, అధికారులు, ఉద్యోగులతో పాటు ఎంహెచ్ఎం ఫైనల్ ఇయర్ విద్యార్థిని థెరిస్సా జేవియర్‌కు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు లభించడం పట్ల డాక్టర్ మార్త రమేష్ అభినందనలు తెలిపారు. విద్యార్థులు అకడమిక్స్‌తో పాటు అన్ని రంగాల్లో ప్రతిభను కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

# ఉత్తమ సేవలకు మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డికి ప్రశంసా పత్రం

**ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రత్యేక చొరవకు గుర్తింపు**



**శామీర్‌పేట్, ఆగస్టు 15 (జనంసాక్షి):** అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్‌రెడ్డి ఉత్తమ సేవలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన ప్రత్యేక చొరవకు గుర్తింపుగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, నూతన పాలకవర్గం సహకారంతో ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు కమిషనర్ చేపట్టిన చర్యలను జిల్లా అధికారులు అభినందించారు. ప్రధానంగా వన మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడం, విస్తృతంగా మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో ఆయన చొరవ చూపారు. బోనాల సందర్భంగా పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, విద్యుత్, ఇతర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి భక్తులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. అలియాబాద్, మజీద్‌పూర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరుస్తూ డ్రైనేజీల శుభ్రత, పూడికతీత, క్లీనింగ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. వీధిలైట్ల సమస్యలను సత్వరం పరిష్కరిస్తూ అవసరమైన చోట కొత్త లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించడం, అధికారులు, సిబ్బందిని సమన్వయం చేయడం, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో వెంకట్‌రెడ్డి చూపిన చొరవకు ఈ ప్రశంస దక్కింది. ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించడమే లక్ష్యంగా పారిశుద్ధ్యం, పచ్చదనం, మౌలిక వసతులు, ప్రజా సౌకర్యాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని వెంకట్‌రెడ్డి తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవం రోజు మద్యం అమ్మకాలు

- 'డ్రై డే' నిబంధనలకు తూట్లు పొడిచిన హనుమాన్ దాబా నిర్వాహకులు
- కొందుర్గు మండలంలో జోరుగా సాగిన బెల్టుషాపు దందా
- అధికారుల మౌనమా .. లేక చూసీచూడనట్లు వదిలేశారా?
- అధికారుల మౌనంపై స్థానికుల అనుమానాలు



**కొందుర్గు, ఆగస్టు 15 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్న వేళ, కొందుర్గు మండలంలో మాత్రం ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా తుంగలో తొక్కారు. ఆగస్టు 15 పురస్కరించుకుని ప్రభుత్వం మద్యం దుకాణాల మూసివేతకు (డ్రై డే) కఠిన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, రామచంద్రపురం గ్రామంలో బెల్టుషాపుల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిం ది. గ్రామంలోని 'హనుమాన్ దాబా' వేదికగా నిర్వాహకులు ఎలాంటి భయం లేకుండా బహిరంగంగా, యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరిపారు. సాధారణ రోజుల్లో కంటే మిన్నగా ఇక్కడ మందుబాబుల రద్దీ కనిపించింది. ప్రభుత్వ ఉత్తర్వులను ఏమాత్రం పట్టించుకోకుండా సాగిన ఈ అక్రమ విక్రయాలపై స్థానిక గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల మౌనం.. చూసీచూడనట్లు వదిలేశారా?**

పవిత్రమైన స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా ఇంత బహిరంగంగా అక్రమ మద్యం వ్యాపారం జరుగుతుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక పోలీసు, ఎక్సైజ్ అధికారుల మౌనం వెనుక ఉన్న రహస్యం ఏంటని ప్రజలు నిలదీస్తున్నారు. ఉన్నతాధికారుల నిఘా లోపం వల్లే నిర్వాహకులు ఇంతలా రెచ్చిపోతున్నారని, అన్నీ తెలిసి కూడా చూసీచూడనట్లు వదిలేశారా? అని స్థానికులు బహిరంగంగానే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న హనుమాన్ దాబా నిర్వాహకులపై ఎక్సైజ్ మరియు పోలీస్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# జెండా ఆవిష్కరణలో ఘర్షణ.. కాలనీ అధ్యక్షుడిపై దాడి

- మల్లెం వెంకటేష్‌గౌడ్‌ను అరెస్టు చేయాలి: పాశం బుచ్చి యాదవ్
- గాయపడిన కొండె శంకర్‌కు ఆస్పత్రిలో చికిత్స
- ఘటనపై పోలీసులకు ఫిర్యాదు.. చర్యలు తీసుకోవాలని డిమాండ్



**బోడుప్పల్, ఆగస్టు 15 (జనంసాక్షి):** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ సమయంలో మేడిపల్లి వివేకానంద కాలనీలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. జెండా ఆవిష్కరణ ఏర్పాట్ల విషయంలో కాలనీ అధ్యక్షుడు కొండె శంకర్, స్థానిక బీఆర్ఎస్ నాయకుడు మల్లెం వెంకటేష్‌గౌడ్ మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. వాగ్వాదం తీవ్రతరం కావడంతో ఘర్షణకు దారితీసి కొండె శంకర్‌పై దాడి జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన శంకర్‌ను సమీపంలోని అఫెక్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు పాశం బుచ్చి యాదవ్, జైపాల్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని కొండె శంకర్‌ను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ వంటి దేశభక్తి కార్యక్రమంలో ఘర్షణ చోటుచేసుకోవడం బాధాకరమని నాయకులు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. కాలనీ అధ్యక్షుడిపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మల్లెం వెంకటేష్‌గౌడ్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. వెంకటేష్‌గౌడ్‌ను అరెస్టు చేయాలని పాశం బుచ్చి యాదవ్ డిమాండ్ చేశారు. ఘటనా నేపథ్యంలో కాలనీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**డాక్టర్ జి. శైలజకు ఉత్తమ వైద్యురాలి అవార్డు**

ఆల్వాల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్వాల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ జి. శైలజకు ఉత్తమ వైద్యురాలి అవార్డు లభించింది. ఆమె అందిస్తున్న విశిష్ట వైద్య సేవలను గుర్తించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆమెకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్ శైలజను అభినందించారు.

# బ్రిటన్ రాజు భారతీయులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

- కొల్లగొట్టిన భారత సంపదను తిరిగి ఇవ్వాలి : కల్వకుంట్ల కవిత..
- బ్రిటన్ చరిత్ర పుస్తకాల్లో అసత్యాలను సరిచేయాలి



**ముషీరాబాద్, ఆగస్టు 15 (జనం సాక్షి):** భారతీయులపై బ్రిటిష్ పాలనలో జరిగిన అఘాయిత్యాలకు బ్రిటన్ రాజు బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. దేశానికి లభించిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఎంతోమంది పూర్వీకుల త్యాగాలు, పోరాటాల ఫలితమని కవిత అన్నారు. ప్రతి ఒక్కరూ భారత చరిత్ర, సంస్కృతి, స్వాతంత్ర్య పోరాట గొప్పతనాన్ని తెలుసుకోవాలని సూచించారు. చరిత్రను తెలుసుకున్నవారే భవిష్యత్‌ను సమర్థవంతంగా నిర్మించగలరని పేర్కొన్నారు.

**కొహినూర్‌తో పాటు కొల్లగొట్టిన సంపదను తిరిగి ఇవ్వాలి**

జలియన్‌వాలా బాగ్ ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, బ్రిటిష్ పాలనలో కృత్రిమ కరువుల కారణంగా వేలాది మంది మరణించారని కవిత ఆరోపించారు. రెండు ప్రపంచ యుద్ధాల్లో భారత సైనికులను వినియోగించుకుని, స్వాతంత్ర్యం ఇస్తామని ఇచ్చిన హామీని బ్రిటిష్ పాలకులు నిలబెట్టుకోలేదని విమర్శించారు. శాంతియుతంగా స్వాతంత్ర్యం కోసం పోరాడిన భారతీయులపై బ్రిటిష్ పాలకులు అనేక అణచివేత చర్యలకు పాల్పడ్డారని అన్నారు. రెండు వందల ఏళ్ల పాలనలో భారతీయులపై జరిగిన అఘాయిత్యాలకు బ్రిటన్ రాజు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారతదేశం నుంచి కొల్లగొట్టుకెళ్లిన కొహినూర్ వజ్రంతో పాటు ఇతర సంపదను తిరిగి ఇవ్వాలని కోరారు. బ్రిటిష్ పాలనలో ఒకే భూభాగంగా ఉన్న భారత్, పాకిస్తాన్‌లను ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా విభజించడం వల్ల రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక వైరుధ్యాలు ఏర్పడ్డాయని కవిత పేర్కొన్నారు. బ్రిటిష్ పాలన ఆనవాళ్ల నుంచి బయటపడుతూ భారతీయ సంస్కృతి, చరిత్రను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిటన్ పాఠ్య పుస్తకాల్లో భారత్‌కు సంబంధించిన చరిత్రను వక్రీకరించి లేదా తప్పుగా చిత్రీకరించిన అంశాలను సరిచేయాలని డిమాండ్ చేశారు.

**స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను పిల్లలకు వివరించాలి**

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భారతదేశంలో ఎన్నో సంవత్సరాల పాటు సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతోమంది ప్రాణత్యాగాలు చేశారని కవిత గుర్తు చేశారు. ఉద్యమానికి ఎన్నో ఆటంకాలు ఎదురైనా పోరాట స్ఫూర్తిని కోల్పోకుండా కొనసాగించిన ఉద్యమకారుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని, స్వాతంత్ర్య ఉద్యమంలో జరిగిన పోరాట చరిత్రను పిల్లలకు స్పష్టంగా వివరించాలని కవిత పిలుపునిచ్చారు.

# పేదల సంక్షేమానికి పెద్దపీట

*పది కాలాలపాటు పదిలంగా ఉండే పథకాల అమలే లక్ష్యం*






- స్మార్ట్ రేషన్ కార్డుతో ఎక్కడైనా సన్నబియ్యం పొందొచ్చు
- మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రాధాన్యం
- వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు: స్పీకర్ ప్రసాద్‌కుమార్

**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 15 (జనంసాక్షి):** ప్రజల సంక్షేమానికి పది కాలాలపాటు ఉపయోగపడే పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం వికారాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. లబ్ధిదారులకు మన్నికైన ల్యామినేటెడ్ స్మార్ట్ రేషన్ కార్డులు అందించడంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డు ద్వారా లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా రేషన్ దుకాణంలో సన్నబియ్యం పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. మహిళలు, రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో వికారాబాద్ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరవుతున్నాయని ప్రసాద్‌కుమార్ తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా రూ.600 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఇప్పటికే రూ.480 కోట్లు మంజూరయ్యాయని, తాజాగా మరో రూ.53 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రహదారుల అభివృద్ధికి తగిన నిధులు రాకపోవడంతో రోడ్లు అధ్వానంగా మారాయని, తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత వాటి అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిపై మహిళలు, యువత చర్చించుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ కుటుంబ సభ్యుల వివరాలతో స్మార్ట్ రేషన్ కార్డులు రూపొందించామని తెలిపారు.

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల బియ్యాన్ని ఇతరులు అక్రమంగా తీసుకెళ్లకుండా, లబ్ధిదారులు తాము ఉన్న ప్రాంతంలోనే సన్నబియ్యం పొందే వెసులుబాటు స్మార్ట్ రేషన్ కార్డుతో కలుగుతుందని తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి తిండి, బట్ట, ఇల్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జిల్లాలో 44,733 స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.12 వేల కోట్లు చెల్లించామని, ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్లు ఉమాశంకర్ ప్రసాద్, వెంకటాచారి, జెడ్పీ సీఈవో సుధీర్, ఎస్‌ఎఫ్‌సీ రంగరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, డీఎస్‌ఓ సుదర్శన్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో.. ప్రగతి పరుగులు

- రంగారెడ్డిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- గ్రామీణ స్వయం సహాయక సంఘాలకు రూ.261.52 కోట్లు
- పట్టణ సంఘాలకు రూ.18.78 కోట్ల చెక్కుల పంపిణీ
- ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు



**రంగారెడ్డి, ఆగస్టు 15 (జనంసాక్షి):** ప్రజా పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు.

వేడుకల్లో భాగంగా గ్రామీణాభివృద్ధి, అటవీ, గృహ నిర్మాణ, సంక్షేమ, పౌరసరఫరాలు, వైద్య ఆరోగ్య, విద్య, అగ్నిమాపక, ఐసీడీఎస్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాలను మంత్రి, అధికారులు తిలకించారు. అనంతరం పరిశ్రమలు, వ్యవసాయం, ఉద్యానవన, విద్యుత్ తదితర శాఖలు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయా శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలను అధికారులు మంత్రికి వివరించారు.

మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇందులో భాగంగా గ్రామీణ స్వయం సహాయక సంఘాలకు రూ.261.52 కోట్ల విలువైన చెక్కులను, మెప్మా పరిధిలోని పట్టణ స్వయం సహాయక సంఘాలకు రూ.18.78 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం నిరంతరం ప్రోత్సహిస్తోందన్నారు.

జిల్లా పరిపాలనలో ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి మంత్రి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ వై. నితిన్‌కు కూడా ప్రశంసా పత్రం అందించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులు మరింత అంకితభావంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

వేడుకల్లో భాగంగా కేజీబీవీ మహేశ్వరం, ఏవీఎన్ ఇంటర్నేషనల్ స్కూల్, టీఎస్ మోడల్ స్కూల్ నేదునూర్, వివేక విద్యాభారతి ఆమనగల్, జెడ్పీహెచ్ఎస్ తుక్కుగూడ విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రదర్శనలకు హాజరైన వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం మంత్రి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు డాక్టర్ కె.కిరణ్మయి, చంద్రారెడ్డి, శంషాబాద్ డీసీపీ బి.రాజేష్, జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, కలెక్టరేట్ ఏఓ సునీల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాలి

- అక్రమంగా గ్రామస్తులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి
- ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఇన్చార్జి ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



**గంగాధర ఆగస్టు 15 (జనంసాక్షి) :** మండలంలోని నారాయణపూర్ గ్రామంలో నారాయణపూర్ రిజర్వాయర్ ఆనుకొని ఉన్న నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని గత ఏడు రోజులుగా గ్రామస్తులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి , సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి హాజరై దీక్షలకు సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు. సందర్భంగా అంబటి జోజి రెడ్డి, మిల్కూరి వాసుదేవరెడ్డి లు మాట్లాడుతూ నారాయణపూర్ గ్రామాన్ని తక్షణమే ముంపు గ్రామంగా ప్రకటించాలని చాలా రోజుల నుండి ఇక్కడ ఉన్న ప్రజలు,రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా నారాయణపూర్ విచ్చేసిన మేడిపల్లి సత్యం నేను గెలిచిన తర్వాత రెండు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ముంపు గ్రామంగా ప్రకటిస్తానని చెప్పి ఓట్లు వేపించుకొని నేడు ముఖం చాటేసే పరిస్థితి దాపురించిందని విమర్శించారు. న్యాయబద్ధంగా ప్రజా స్వామ్య యుతంగా నారాయణపూర్ గ్రామ ప్రజలు తమ న్యాయమైన హక్కులు ,డిమాండ్ల కోసం చేస్తున్న ఉద్యమాన్ని నీరు కార్చేందుకు రాజకీయ దురుద్దేశంతో కేసులు గ్రామ ప్రజలపై నమోదు చేయడం బాధాకరం అన్నారు. గ్రామ ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తూ రాజకీయ పబ్బం గడుపుకునే వారి పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తక్షణమే నారాయణపూర్ గ్రామ ప్రజల న్యాయమైన డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కారం చూపే దిశగా ముందుకు వెళ్లాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

చొప్పదండి ఎమ్మెల్యే కాకముందు ఒక మాట గెలిచిన తర్వాత మరో మాట మాట్లాడడం మేడిపల్లి సత్యంకు తగదన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి గ్రామస్తుల డిమాండ్ ను పరిష్కరించాలన్నారు. ముంపు గ్రామంగా ప్రకటించి, అవార్డు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమాల ముందు ఏ ప్రభుత్వాలు నిలబడలేవన్నారు. రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా విస్తరించక ముందే నారాయణపూర్ గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు చేసే న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ పార్టీలు ప్రత్యక్షంగా పరోక్షంగా మద్దతుగా ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి రాజేశం, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కరీంనగర్ నగర అధ్యక్షులు సత్య రావు, రాజశేఖర్, మాజీ సర్పంచుల ఫోరం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జోగు లక్ష్మీరాజ్యం సాగర్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నవీన్ రావు, మాజీ సర్పంచ్ ఎం డి నజీర్, వడ్లూరి ఆదిమల్లు గడ్డం స్వామి, పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- పేదలకు నాణ్యమైన సన్నబియ్యం.. అర్హులందరికీ రేషన్ కార్డులు
- పెద్దపల్లి జిల్లాలో 2,46,157 కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు
- 30 వేలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు
- సన్నబియ్యం పథకం దుర్వినియోగం కాకుండా కట్టడి చర్యలు
- 116 కులాంతర వివాహ జంటలకు రూ.2.50 లక్షల చొప్పున ప్రోత్సాహకం



**పెద్దపల్లి, ఆగస్టు 15 (జనంసాక్షి):** అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడంతో పాటు పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా నుంచి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించగా, అదే సమయంలో అన్ని జిల్లాల్లో పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విజయరమణారావు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మొత్తం 2,46,157 కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించనున్నామని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇప్పటికే జిల్లాలో 30 వేలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు.

పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం పథకం పక్కదారి పట్టకుండా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని విజయరమణారావు సూచించారు. రేషన్ బియ్యాన్ని బ్లాక్‌మార్కెట్‌కు తరలించడం సరికాదని, అవసరం లేని వారు రేషన్ బియ్యం తీసుకోకుండా అర్హులైన పేదలకు ప్రయోజనం చేకూరేలా సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో 30 వేలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, మొత్తం 2,46,157 కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించనున్నామని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అని, అర్హత ఉన్నప్పటికీ ఇంకా రేషన్ కార్డు పొందని వారు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

అనంతరం కులాంతర వివాహాలు చేసుకున్న 116 జంటలకు ప్రభుత్వం తరఫున రూ.2.50 లక్షల చొప్పున ప్రోత్సాహక ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను ప్రభుత్వ విప్, కలెక్టర్ పంపిణీ చేశారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించడంతో పాటు సామాజిక సమానత్వం, సామరస్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ఈ ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీరాములు, పెద్దపల్లి ఆర్డీఓ గంగయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల మేనేజర్ శ్రీకాంత్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, సంబంధిత శాఖల అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఫీడే రేటింగ్ చెస్ పోటీలకు విశ్వనాథ్ అకాడమీ విద్యార్థులు

**పికా అంతర్జాతీయ ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్లలో తలపడనున్న క్రీడాకారులు**

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 15 (జనంసాక్షి):** హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న పికా అంతర్జాతీ య ఫీడే రేటింగ్ చెస్ పోటీల్లో విశ్వనాథ్ చెస్ అకాడమీకి చెందిన విద్యార్థులు పాల్గొంటున్నట్లు అకాడమీ డైరెక్టర్ అంతరి విశ్వనాథ్ ప్రసాద్ తెలిపారు. ప్రత్యూష ఇంటర్నేషనల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆగస్టు 15, 16 తేదీల్లో మియాపూర్ లోని శ్రీచైతన్య ఫ్యూచర్ పాత్‌వేస్ గ్లోబల్ స్కూల్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ చెస్ రేటింగ్ కలిగిన బాలసంకు ల అమన్‌రామ్, అక్కినపల్లి విశృత్‌రామ్, కట్ట శ్రీవాస్తవ్, గాదె శివాన్, ముక్క శ్రీతన్, విరాజ్ నందన్‌రెడ్డి పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్లలో జరిగే పోటీల్లో దేశంలోని పలువురు ప్రతిభావంతులైన క్రీడాకారులతో వీరు తలపడనున్నారు. పోటీలకు బయలుదేరిన క్రీడాకారులను ఉద్దేశించి అకాడమీ డైరెక్టర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఏకాగ్రతతో ఆడి మంచి ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారులకు అనుభవంతో పాటు తమ రేటింగ్‌ను మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. జిల్లా చదరంగ సమాఖ్య కన్వీనర్ అంతగిరి రాజేంద్రప్రసాద్, సీనియర్ చెస్ కోచ్ కొప్పర్తి శివయ్యతో పాటు తల్లిదండ్రులు, క్రీడాభిమానులు విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# సైబరాబాద్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సీపీ డా. ఎం. రమేష్
- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్: సీపీ
- 19 మంది పోలీసు సిబ్బందికి సేవా పతకాలు ప్రదానం



**శేరిలింగంపల్లి, ఆగస్టు 15 (జనంసాక్షి):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' ఆలపించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సాధించి 80 ఏళ్లు పూర్తవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. బలమైన రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థతో భారత్ ఎనిమిది దశాబ్దాలుగా స్థిరంగా ముందుకు సాగుతోందని తెలిపారు. దేశం సాధించిన ప్రగతిని ప్రతి ఒక్కరూ గర్వంగా భావించాలని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న ఆర్థిక, భౌగోళిక, వాణిజ్య, సాంకేతిక మార్పులు, అంతర్జాతీయ సవాళ్లను భారత్ సమర్థంగా ఎదుర్కొంటూ స్వయం సమృద్ధి దిశగా పయనిస్తోందని చెప్పారు.

హైదరాబాద్, తెలంగాణ శాస్త్ర, సాంకేతిక, ఫార్మా రంగాల్లో ప్రపంచస్థాయి గుర్తింపు పొందుతున్నాయని సీపీ పేర్కొన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచంలో ఉన్నత స్థానంలో నిలపాలన్నదే లక్ష్యమన్నారు. ఈ దిశగా ఆర్థిక వ్యవస్థ, పరిశ్రమలు, సాంకేతిక రంగం, ఉపాధి అవకాశాలు మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు.

హైదరాబాద్‌లో పరిశ్రమలు, ఐటీ సంస్థలు, పెట్టుబడులు పెరగాలంటే శాంతిభద్రతలు కీలకమని డా. రమేష్ అన్నారు. ప్రజలకు, పరిశ్రమలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ద్వారా అభివృద్ధికి పోలీస్ శాఖ తనవంతు సహకారం అందిస్తోందని తెలిపారు. ప్రజా కేంద్రిత పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తూ సైబరాబాద్ పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారని చెప్పారు. శాంతిభద్రతలను సమర్థంగా నిర్వహించడం ద్వారా హైదరాబాద్ అభివృద్ధికి, మరిన్ని పెట్టుబడులు రావడానికి పోలీసులు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన నలుగురు పోలీసు సిబ్బందికి ఉత్తమ సేవా పతకాలు, మరో 15 మందికి సేవా పతకాలను సీపీ అందజేశారు. పతకాలు పొందిన సిబ్బందిని అభినందించి, ఇదే అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని సూచించారు. అనంతరం పోలీసు సిబ్బంది కుటుంబాలకు చెందిన చిన్నారులకు బహుమతులు అందజేసి, వారితో ముచ్చటించారు. చిన్నారులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి వారితో కలిసి ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, వివిధ జోన్ల డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రైతులపై యూరియా అదనపు భారం

## బస్తాకు రూ.20 ట్రాన్స్‌పోర్ట్ చార్జీ వసూలు

**అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి: రైతు పల్లె బాలయ్య**

**రూ.266 యూరియా బస్తాకు మరో రూ.20 వసూలు**




**గంభీరావుపేట, ఆగస్టు 15 (జనంసాక్షి):** యూరియా బస్తాపై అదనంగా రూ.20 ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు వసూలు చేయడంపై రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడుతున్న తమపై అదనపు భారం మోపడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా బస్తా ధర రూ.266 కాగా, రవాణా చార్జీల పేరుతో ఒక్కో బస్తాకు అదనంగా రూ.20 వసూలు చేస్తున్నారని రైతులు పేర్కొన్నారు. దీంతో ఎరువుల కొనుగోలుపై అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. రైతుల నుంచి అదనంగా వసూలు చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని రైతు పల్లె బాలయ్య డిమాండ్ చేశారు. రైతులకు నిర్ణయించిన ధరకే యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ నాయకుడు కోడె రమేష్ మాట్లాడుతూ రైతులపై ట్రాన్స్‌పోర్ట్ చార్జీల పేరుతో అదనపు భారం మోపడం సరికాదన్నారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని అదనపు వసూళ్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ అంశంపై స్పష్టత ఇవ్వడంతో పాటు రైతులకు ఉపశమనం కల్పించాలని కోరారు. ఈ విషయంపై ఏవో సలావుద్దీన్ మాట్లాడుతూ యూరియా ట్రాన్స్‌పోర్ట్ చార్జీల విధానం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. యూరియా సరఫరా, రవాణాకు సంబంధించిన ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఈ విధానం అమలవుతోందని పేర్కొన్నారు.

# వాట్సాప్ ఏపీకే ఫైల్‌తో రూ.4.15 లక్షలు మాయం

## జగిత్యాలలో సైబర్ మోసం కలకలం



**జగిత్యాల, ఆగస్టు 15 (జనంసాక్షి):** వాట్సాప్‌కు వచ్చిన ఓ ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేసిన వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి ఏకంగా రూ.4.15 లక్షలు మోసపోయిన ఘటన జగిత్యాల పట్టణంలో కలకలం రేపింది. పట్టణంలోని వాణీనగర్‌కు చెందిన ఎలిగేటి అశోక్‌కు వాట్సాప్‌లో ఓ ఏపీకే ఫైల్ వచ్చింది. దానిని ఓపెన్ చేసిన అనంతరం కొద్దిసేపటికే ఆయన బ్యాంకు ఖాతా నుంచి విడతల వారీగా నగదు డ్రా అయినట్లు మొబైల్‌కు సందేశాలు రావడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే గాయత్రి బ్యాంకును సంప్రదించి తన ఖాతా నుంచి నగదు బదిలీ అయిన విషయాన్ని తెలియజేసి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. అయితే సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలనే సూచన కూడా బ్యాంకు సిబ్బంది నుంచి రాలేదని ఆయన ఆరోపించారు. మరుసటి రోజు తన స్నేహితుడైన పోలీసు కానిస్టేబుల్‌ను సంప్రదించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏపీకే ఫైల్ ద్వారా మొబైల్‌లోకి అనధికారిక యాప్ లేదా మాల్వేర్ ప్రవేశించి ఉండవచ్చనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు లావాదేవీలు, నగదు ఏ ఖాతాలకు బదిలీ అయిందన్న అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వాట్సాప్, ఎస్ఎంఎస్, సోషల్ మీడియా ద్వారా వచ్చే ఏపీకే ఫైళ్లు, అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరికీ తెలియజేయవద్దని, అనుమానాస్పద లావాదేవీలు గుర్తించిన వెంటనే సంబంధిత బ్యాంకుతో పాటు సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని విద్యావేత్తలు కోరారు. గ్రామాలు, విద్యాసంస్థలు, కార్యాలయాల్లో సైబర్ మోసాలపై చైతన్య కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు టోల్‌ఫ్రీ ఫిర్యాదు మార్గాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాను ఎగురవేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.. ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన
- ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు
- మహిళా సంఘాలకు రూ.120 కోట్లకు పైగా రుణాలు.. దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 15 (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేడుకలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఆయన అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, పోలీస్, మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ మహేష్ బి. గితే తదితరులు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

వ్యవసాయ, ఉద్యానవన, చేనేత-జౌళి, మత్స్య, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, అగ్నిమాపక, ఆర్టీసీ, గృహ నిర్మాణ, జిల్లా సంక్షేమ, పౌరసరఫరాలు, సర్వే అండ్ రెవెన్యూ శాఖలతో పాటు సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రతిబింబించేలా శకటాలను రూపొందించి ప్రదర్శించారు. ఆయా శకటాల ద్వారా శాఖల కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, ఉద్యానవన, పోలీస్, 17వ బెటాలియన్, అటవీ, లీడ్ బ్యాంక్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ మహేష్ బి. గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తదితరులతో కలిసి పరిశీలించారు. స్టాళ్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలు, పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఉత్తమ శకటాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు నగదు పురస్కారాలను అందజేసి అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాల సభ్యులకు ఈ-స్కూటీలు, ఈ-ఆటోలను పంపిణీ చేశారు. రూ.లక్ష విలువైన ఈ-స్కూటీలను 24 మంది మహిళలకు, రూ.14.25 లక్షల విలువైన ఈ-ఆటోలను లబ్ధిదారులకు అందజేశారు.

855 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.100.12 కోట్ల రుణాలు, 847 సంఘాలకు స్త్రీనిధి ద్వారా రూ.20.66 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. మహిళా సంఘాలకు మొత్తం రూ.120 కోట్లకు పైగా రుణాలు అందించినట్లు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమంలో భాగంగా టీపీసీసీ పథకం కింద పలువురు దివ్యాంగులకు ఆటోలు, హైబ్రిడ్ వీల్‌చైర్ అటాచ్మెంట్లను పంపిణీ చేశారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన దుంపేటి కుమారస్వామికి ఎలక్ట్రిక్ ఆటోను, గుర్రంవాణిపల్లికి చెందిన కంది తిరుమల్‌రెడ్డి, ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన కొమిరె పరశురాముకు హైబ్రిడ్ వీల్‌చైర్ అటాచ్మెంట్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఎస్పీ కలిసి అందజేశారు.

కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్మన్లు జిందం కళా చక్రపాణి, పుల్కం రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాసాచారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ఏవో రాంరెడ్డి, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# త్యాగధనులను స్మరించుకోడం మనందరి బాధ్యత


**మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్**



**రాయికల్ ఆగస్టు 15 జనం సాక్షి :** భారతదేశానికి స్వేచ్చ కల్పించిన త్యాగధనులను స్మరించుకోడం మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్ అన్నారు. శనివారం రాయికల్ మండలం ,పట్టణంలోని 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్,తహసిల్దార్ కార్యాలయంలో తాహ సిల్దార్ నాగర్జున,మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో చిరంజీవి,పోలీస్ స్టేషన్లో ఎస్ఐ సుధీర్, మండల విద్యా వనరుల కార్యాలయంలో ఎంఈఓ రాఘవులు, వ్యవసాయ కార్యాలయంలో ఏవో ముక్తేశ్వర్,రాయికల్,భూపతిపూర్ సింగిల్ వుండు కార్యాలయంలో సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,ముత్యంరెడ్డి,ఆయా గ్రామపంచాయతీలో సర్పంచులు జెండాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రవి మాట్లాడుతూ బ్రిటిష్ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను త్యాగం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ టి. మనోహర్, వైస్ చైర్ పర్సన్ తురగ సౌజన్య, తోపారపు స్రవంతి,భుక్యా రాకేష్ నాయక్,కూనారపు మానస,వేముల మౌనిక,ఎలిగేటి దివ్య,పల్లికొండ గంగాధర్, బత్తిని మహేశ్వరి,మచ్చ గంగ లక్ష్మి,పుర్రె శ్రీధర్,కల్లెడ ధర్మపురి,మేనేజర్ వెంకటి,కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్,సుధ వేణి లత, మహేష్, ఇంత్యాస్ పర్వీన్,నాయకులు తురగ శ్రీధర్,మచ్చ శేఖర్,ఎలిగేటి అనిల్,బత్తిని నాగరాజు,తోపారపు సురేష్,కూనారపు భూమేష్,రాము, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ సర్వతోముఖాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి

- 47,138 కొత్త రేషన్ కార్డులు.. 97,013 మందికి లబ్ధి
- ఆరోగ్యశ్రీతో 14,932 మందికి ఉచిత శస్త్రచికిత్సలు
- ఉత్తమ సేవలకు అధికారులకు ప్రశంసా పత్రాలు



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 15 (జనంసాక్షి):** అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించి, ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని మంత్రి కోరారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కరీంనగర్ జిల్లాలో మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో ఇప్పటివరకు 47,138 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి 97,013 మంది కుటుంబ సభ్యులను కొత్తగా నమోదు చేశామని చెప్పారు. మొత్తం 3,22,198 కుటుంబాలకు నెలకు 6,063 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా జనవరి నుంచి ఇప్పటివరకు 14,932 మందికి ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించి, నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.42.75 కోట్లు చెల్లించామని చెప్పారు. చొప్పదండిలో రూ.37 కోట్లతో 100 పడకల ఆసుపత్రి సిద్ధమవుతుండగా, మానకొండూరులో రూ.17.50 కోట్లతో 30 పడకల ఆసుపత్రి నిర్మాణంలో ఉందన్నారు. కొత్తపల్లిలో రూ.15 కోట్లతో ఆయుష్ ఆసుపత్రి నిర్మించనున్నట్లు తెలిపారు. కొత్తపల్లి మెడికల్ కళాశాల ఆవరణలో రూ.26 కోట్లతో నర్సింగ్ కళాశాల నిర్మాణం పూర్తికావస్తోందన్నారు.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 4,290 పెండింగ్ ఫైళ్లను పరిష్కరించామని, జిల్లాలో 15 రోజుల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కోనేరుపల్లి, వెలిచాల గ్రామాలు ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. భూభారతి చట్టం అమలులో భాగంగా భూవివాదాలు లేని గ్రామాలే లక్ష్యంగా సమగ్ర భూసర్వే చేపట్టామని, ఎల్లంపల్లి, గౌరవెల్లి ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతం చేశామని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, జర్నలిస్టులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సహకారంతో కరీంనగర్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



**ఇల్లంతకుంట జూలై 15(జనంసాక్షి) :** ఇల్లంతకుంట మండలం వంతడ్పుల గ్రామంలో శుక్రవారం రోజున రామరామి మధ్యాహ్నం ఒంటిగంట నుండి మధ్యాహ్నం రెండు ముప్పై నిముషాల మధ్య ఇంటిలో ఎవరు లేని సమయంలో వంతడుపుల గ్రామానికి చెందిన చింతకింది భూమయ్య తండ్రి మల్లయ్య వయసు 59 అనునతడు గడ్డి మందు తాగగా చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రోజున ఉదయం నాలుగున్నర గంటలకు చనిపోయినాడు, మృతుడు గత కొంతకాలంగా అనారోగ్య కారణాలతో జీవితం మీద విరక్తి చెంది గడ్డి మందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడు మృతుడి కొడుకు చింతకింది నరసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేయుచున్నాము. అని ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు.

## గోల్కొండ కోటలో త్రివర్ణపతాకం రెపరెపలు

▫ తొలిసారి పూర్తిస్థాయి వందేమాతర గీతాలాపన



హైదరాబాద్, ఆగస్టు 15 (జనంసాక్షి) : గోల్కొండ కోటలో 80వ స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోల్కొండ కోటపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఇక, గోల్కొండ కోటపై తొలిసారిగా 'వందేమాతరం' గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కోట ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. 80వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వాతంత్య వేడుకలు ప్రజల్లో నూతన ఉత్సాహం, చైతన్యం నింపాలన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి కొత్త ఊపునివ్వాలని ఆకాంక్షించారు. స్వాతంత్య సమరయోధుల త్యాగాలను స్మరించు కోవాలని పిలుపునిచ్చారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ దేశభక్తి, పరస్పర గౌరవం పెంపొందించాలని అన్నారు. అసమానతలు లేని శాంతియుత, సౌభ్రాతృత్వ భారతదేశాన్ని నిర్మించాలని తెలిపారు. సమరయోధుల త్యాగాలకు అదే నిజమైన నివాళి అని సీఎం వ్యాఖ్యానించారు. సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో 80వ స్వాతంత్య దినోత్సవం జరుపుకోవాలని ఆకాంక్షించారు. నవ భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు కర్తవ్యనిష్ఠతో ముందుకు సాగాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## హనుమకొండలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

▫ స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి



హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 15 (జనం సాక్షి) :హనుమకొండలోని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఎమ్మెల్యేలు నాగరాజు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులు ఒక్కొక్కటిగా సాకారం అవుతున్నాయని తెలిపారు. రానున్న రెండు, మూడు సంవత్సరాల్లో వరంగల్ రూపురేఖలు మరింతగా మారబోతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందని వరంగల్ అన్నారు. అర్హులైన పేదలకు మాత్రమే రేషన్ కార్డులు అందేలా చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగానే స్మార్ట్ రేషన్ కార్డుల విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో జరిగిన అవకతవకలకు తావులేకుండా నిజమైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ రవి, ఆర్డీఓ వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అవసరాలు గుర్తించి సంక్షేమ పాలన

▫ అన్ని వర్గాలకు న్యాయం చేయడం కోసం కృషి
▫ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఖమ్మం, ఆగస్ట్15 (జనంసాక్షి) : తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాలకూ సంక్షేమం అందుతోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో కాలయాపన చేసిందని విమర్శించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో నకిలీలను పూర్తిగా అరికట్టేందుకు ఈ కొత్త స్మార్ట్ కార్డులలో ఎన్క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, ప్రత్యేక హోలోగ్రామ్, వాటర్ మార్క్, యూవీ లోగో సహా 9 రకాల పటిష్టమైన భద్రతా ఫీచర్లను పొందుపరిచామని భట్టి అన్నారు. ఈ-పాస్ యంత్రాలతో బయోమెట్రిక్ విధానాన్ని అనుసంధానించి రేషన్ పంపిణీలో నూరు శాతం పారదర్శకతను తీసుకువస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా 3.42 కోట్ల మందికి నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ సరికొత్త డిజిటల్ కార్డులు మంజూరు చేస్తూ, వాటి ద్వారా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నాం.పేదలకు మెరుగైన వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కల సాకారం, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే మన ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లేలా మన ప్రభుత్వం అడుగులు వేస్తోందని భట్టి తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని భట్టి చెప్పుకొచ్చారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులకు భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు మరింత సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## ఆదిలాబాద్ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

▫ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ



మావల ఆగస్ట్ 16 (జనం సాక్షి): అదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డిజిటల్ ఫుడ్ సెక్యూరిటీ (స్మార్ట్ రేషన్) కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా కేవలం తెలంగాణలోనే తెల్ల రేషన్ కార్డులను ప్రభుత్వం అందిస్తోందని, ఈ ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆరు గ్యారంటీల అమలుతో ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తున్నామని అన్నారు.

జిల్లాలో మొత్తం 2.26 లక్షల రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని దశలవారీగా చేపట్టామని, తొలి విడతలో అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆదిలాబాద్ జిల్లా రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని, ఎయిర్‌పోర్టు, రక్షణ అకాడమీలు, సైనిక పాఠశాలల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి జిల్లా సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

పార్లమెంట్ సభ్యుడు గోడం నగేశ్ మాట్లాడుతూ, ఏ ప్రభుత్వం కూడా అర్హులైన పేదలను సంక్షేమ పథకాల నుంచి తొలగించే ఉద్దేశంతో పనిచేయదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆర్థికంగా స్థిరపడిన వారు స్వచ్ఛందంగా రేషన్ కార్డులను వదులుకుంటే నిజమైన పేదలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని సూచించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పేదల సంక్షేమం కోసం భారీగా సబ్సిడీ బియ్యం అందిస్తోందని పేర్కొంటూ, రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.




# ఆలయంలో అమానుషం..

### బాలికపై అర్చకుడి అఘాయిత్యం



రామచంద్రాపురం, అగస్టు 15(జనం సాక్షి) : దైవ సన్నిధిలో బాలికపై అర్చకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపింది. భక్తులు పవిత్రంగా భావించే ఆలయంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. రామచంద్రాపురం ప్రాంతంలోని ఓ ఆలయంలో సాయన్న అనే వృద్ధుడు అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఆలయానికి వచ్చిన మైనర్ బాలికను ఎవరూ గమనించని సమయంలో లోపలికి తీసుకెళ్లి, బయట నుంచి తాళం వేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆలయం లోపలి నుంచి బాలిక రోదనలు వినిపించడంతో స్థానికులకు అనుమానం వచ్చింది. వెంటనే వారు ఆలయం వద్దకు చేరుకుని పరిశీలించగా విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని సాయన్నను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### పోక్సో కేసు నమోదు

బాధిత బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టంతో పాటు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ఆలయంలో జరిగిన ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## డిజిటల్ కార్డుతో పేదలకు మేలు

▫ ప్రభుత్వ విప్ వేముల వీరేశం

నిర్మల్ బ్యూరో, ఆగస్టు 15 (జనంసాక్షి): నూతన డిజిటల్ రేషన్ కార్డులతో పేదలకు అన్ని విధాలా మేలు జరుగుతుందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. సోన్ మండలం కడ్తాల్ సమీపంలోని సాగర్ కన్వెన్షన్‌లో శనివారం నూతన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రేషన్ బియ్యాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని, బయట విక్రయించవద్దని సూచించారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ.. రేషన్ కార్డులు పలు సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా ఉపయోగపడతాయన్నారు.










Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370